ఫిబ్రవరి 2026

# చైతన్యం

సంకల్ప బలం

రు. 20/-

సామాజిక విలువల మాసపత్రిక



## అంతరిక్ష వీరుడు

## శుభాన్షు శుక్లాకు అశోక చక్ర


పద్మవిభూషణ్
వి ఎస్ అచ్యుతానందస్


పద్మవిభూషణ్
నోరి దత్తాత్రేయుడు



వ్యవస్థాపక సంపాదకురాలు
**తీగవరపు శాంతి**

# చైతన్యం
సంకల్ప బలం

సామాజిక విలువల మాస పత్రిక

**ఫిబ్రవరి 2026**

సంపుటి -15 సంచిక - 5

## ఈ సంచికలో....

సంపాదకీయం 4

వార్తా విశేషాలు 6

కాశీ మజిలీ కథలు 38

నాయకుని మాట తీరే ... 40

బ్రహ్మ ఖండం 42

కలియుగ ప్రత్యక్ష దైవం 44

కదిరి నృసింహస్వామి 45

కలిస్తే నిలుస్తాం.... 48

సమయం విలువ 49

గజేంద్రమోక్షము 50

రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

కుటుంబ నేపథ్యం -- దేశం అభివృద్ధి పథంలోకి

కుటుంబం సక్రమంగా ఉండాలంటే ఆ కుటుంబానికి తల్లి తండ్రి ఎంతో ముఖ్యం. అంతే కాదు ఆ తల్లి తండ్రి కూడా వారు సక్రమంగా ఉండడమే కాక, ఎంతో సత్ప్రవర్తనతో ఉండి, కుటుంబాన్ని కూడా ఎంతో నేర్పుతో తీర్చి దిద్దాలి. అలాంటప్పుడు వారు కుటుంబానికే కాకుండా సమాజానికి, దేశానికి కూడా ఎంతో ఆదర్శవంతులవు- తారు. ఎప్పటికప్పుడు కుటుంబంలో తప్పులు జరగకుండా చూసుకుంటూ సంసారాన్ని నడుపుకోగలిగినప్పు- డే, కుటుంబలో అందరూ ప్రశాంతంగా ఉండగలరు. భవిష్యత్తు కోసం ప్రణాళికలు వేసుకోగలరు. అంతే కాదు సమాజానికి కూడా సేవ చెయ్యాలనే ఆలోచన, ఉత్సాహం వస్తుంది. అందుకే కుటుంబం అత్యంత ప్రధాన- మైనది. అలా ప్రతి కుటుంబంలో తల్లిదండ్రులు లేదా పెద్దలు కుటుంబ బాధ్యతను నిబద్దతతో నిర్వహించవలసి ఉంటుంది. అలాగే మన సమాజం, దేశంలోని ప్రజలందరూ హాయిగా ఉండాలంటే మన సమాజంలోని పెద్దలు, అదే విధిగా దేశాన్ని పరిపాలించే పెద్దలు అంటే ప్రధాన మంత్రి లేదా దేశాన్ని పరిపాలించే పరిపాలకులు ఎన్నో నియమ నిబంధనలు పాటిస్తూ, ఎంతో జాగరూకతతో చుట్టుపక్కల దేశాలను గమనించుకుంటూ ప్రజల సం- క్షేమాన్ని చూడవలసిన అత్యంత కీలకమైన బాధ్యత దేశంలోని అత్యున్నత అధికారులపై ఉంటుంది. ఒక్క ప్రజల సంక్షేమమే కాదు, సరిహద్దులు, ఆ సరిహద్దుల్లో ఉన్న అనేక జీవులు పశుపక్ష్యాదులతో సహా కాపాడే కీలక బాధ్యత కూడా దేశాధికారులపైనే ఉంటుంది. అంటే సూర్య చంద్రుల వల్ల మన ప్రాణ కోటి ఎలా అయితే హాయిగా జీవిస్తోందో, మనల్ని పరిపాలించే నేతలు కూడా అంత కీలకమైన బాధ్యత వహించవలసిన అవసరం ఉందనే కదా! ఒక్క రోజు సూర్యుడు రాక పోయినా, ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినా మన జీవరాశులన్నీ అత- లాకుతలమై పోతాయి. అదే విధంగా అంతటి ప్రాముఖ్యం ఉన్న దేశాధికారులు కూడా నిస్వార్ధంగా ఉండి, ప్రతి క్షణం, ప్రతి పని మీద అత్యంత శ్రద్ధ వహిస్తూ దేశ పౌరులను సన్మార్గంలో నడిపించవలసిన అవసరం ఎంతైనా ఉంది. లేదంటే ప్రకృతిలో వైపరీత్యం జరిగితే ఎన్ని కష్ట నష్టాలు మనం అనుభవించాల్సి వస్తుందో మన దేశంలోని ప్రజలైనా అంతే. అందుకే ప్రజలు కూడా నాయకుల ప్రవర్తనపై దృష్టి కేంద్రీకరించి, ఎప్పుడికప్పు- డు తప్పులు చేస్తుంటే వెంటనేసరిదిద్దుకుంటూ ఉండాలి. అంతే కానీ, వాళ్ళు అలా ఉన్నారు కదా! అని మనం కూడా వారినే అనుసరిస్తే, దేశాలు, సమాజం, కుటుంబాలు కూడా సర్వ నాశనం అయిపోతాయి అనడంలో సందేహం లేదు. అందుకే ఎప్పుడూ కుటుంబానికి తల్లి ఎంత ముఖ్యమో, దేశానికి ప్రధానమంత్రి కూడా అంతటి ప్రాధాన్యత వహించవలసి ఉంటుంది. ప్రస్తుతం మన భారత దేశ పరిస్థితి, అలాగే చుట్టూ ఉన్న దేశాలతో సత్స- సంబంధాల విషయానికి వస్తే, పెద్ద అన్నగారి స్థానంలో ఉండే అమెరికా, అక్కడ ప్రెసిడెంట్ ట్రంప్ అధికారంలో- కి వచ్చిన దగ్గర నుండి అధికార దాహంతో చుట్టూ ఉన్న దేశాలను తన గుప్పిట్లో ఉంచుకోవాలని చుట్టుపక్కల దేశాలపై చుక్కలు చూపిస్తున్నాడు. ఏ మాత్రం ఎక్కడైనా అవకాశం దొరికేటట్లు ఉంది అంటే చాలు, అబద్దాలు ఆడి, మోసం చేసైనా అమెరికా డాలర్ల మీద మోజుతో పాగా వేసేయాలి అనే స్వభావం చుట్టూ పక్కల దేశాలతో పాటు మన వాళ్ళది కూడా. అసలే తమ దేశాంలోవి అన్నీ అందరూ అనుభవించేస్తున్నారు. మనకి సరిగా దక్కడం- లేదు. ఉద్యోగాలు అన్నీ లాగేసుకుంటున్నారు అని భయం మొదలైన తెల్ల జాతీ యులకు, మీ కందరికీ నేను- న్నాను అని ట్రంప్ హామీ ఇచ్చి ప్రెసిడెంట్ గా వచ్చాడు. అసలే వ్యాపారవేత్త , లెక్కల మనిషి. అదే పనిగా అందరూ అన్యాయంగా దూరిపోతుంటే, ఏరి పారేస్తున్నాడు ట్రంప్ . అంతే కాదు దేశాల ఎగుమతి దిగుమతులపై . కూడా ఆంక్షలు విధించడం మొదలు పెట్టాడు శతకోటి దరిద్రాలకు అనంత కోటి ఉపాయాలు అని మన వాళ్ళు ఇంకా దారులు వెతుకుతూనే ఉన్నారు. అంతే కాదు మన దేశ ఆర్ధిక పరిస్థితి దృష్ట్యా 2019 లో స్విజర్లాండ్, రష్యా లో పెట్టిన మన బంగారాన్ని స్విడ్జర్లాండ్ నుంచి మోదీ 2025 లో విడిపించుకుని మన దేశానికి తెచ్చుకోవడం, అలాగే అమెరికాకు బాండ్లు ఇవ్వడం మన దేశ ప్రధాని తగ్గించడం జరిగింది. అంతే కాదు ఆర్ధికంగా మనం ఆర్ధికంగా బలోపేతం అవ్వడానికి బంగారం కూడా కొని జాగ్రత్త చెయ్యడం జరుగుతోంది. అన్యాయం చేస్తే, పిల్లైనా ఎన్నా- ళ్ళు కళ్ళు మూసుకుని కూర్చుంటుంది? మన దేశం ఆర్ధికంగా, సైనికంగా అన్ని రకాలుగా బలోపేతం చేసుకుంటూ, ముందుకు దూసుకుపోతోంది. కుటుంబంలో పిల్లలు ఎంత జాగ్రత్తగా ఉండవలసిన అవసరం ఉంటుందో, మన ప్రజలు కూడా అంతకన్నా ఎక్కువే జాగ్రత్తగా, దేశ భక్తితో ఐక్యతతో ఉండవలసిన అవసరం ఎంతైనా ఉంది.

కేంద్ర బడ్జెట్ 2026--27

వచ్చే ఆర్థిక సంవత్సరం 2026-27 కు సంబంధించిన వార్షిక బడ్జెట్ వచ్చేసింది. పార్లమెంట్ లో ఈరోజు ఫిబ్రవరి 1న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. వరుసగా 9వ సారి బడ్జెట్ ప్రవేశపెట్టి రికార్డు సృష్టించారు. దేశ ఆర్థికవృద్ధిని వేగవంతం చేయడం, సబ్ కా సాథ్ సబ్ కా వికాస్ లక్ష్యానికి అనుగుణంగా ఈ బడ్జెట్ రూపొందించినట్లు ప్రకటించారు. కీలక రంగాలకు భారీ కేటాయింపులు, విదేశీ పెట్టుబడులకు అవకాశాలు, ఫ్యూచర్స్ ట్రేడింగ్‌పై పన్నుల పెంపు వంటి కీలక నిర్ణయాలు ఉన్నాయి. ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ లో పెరిగేవి, తగ్గేవి ఇవే...బడ్జెట్ లో ప్రవేశపెట్టిన నిర్ణయాలతో కొన్ని రకాల పరికరాలు, ఔషధాల ధరలు తగ్గి అందుబాటులోకి రానున్నాయి. అలాగే ధరలు తగ్గేవి: విదేశీ పర్యాటక ప్యాకేజీ 2%తగ్గింపు, విదేశీ విద్య : ఎల్ ఆర్ ఎస్ కింద విద్య ఖర్చుల కోసం తగ్గించారు. (టీడీఎస్ ను లిబరలైజ్డ్ రెమిటెన్స్ స్కీమ్)ఆల్కహాలిక్ లిక్కర్,కొన్ని రకాల ఖనిజాలు: వీటిపై కస్టమ్స్ డ్యూటీ 5% నుండి 2%శాతానికి తగ్గించారు. షూ అప్పర్ ఎగుమతులు వీటికి అవసరమైన మెటీరియల్ దిగుమతిని డ్యూటీ రహితంగా, అలాగే సోలార్ ప్యానల్స్ పై బేసిక్ కస్టమ్స్ తొలగింపు, ఎనర్జీ ట్రాన్స్మిషన్ పరికరాలు క్యాపిటల్ గూడ్స్ పై బిసిడి తొలగింపు, క్రిటికల్ మినరల్స్ పై బిసిడి తొలగింపు, అలాగే క్యాన్సర్ వంటి అరుదైన 17 రకాల వ్యాధుల ఔషధాలపై బీసీడీ తొలగించారు. అలాగే అణు విద్యుత్ ప్రాజెక్టులకు వాడే పరికరాలు, విద్యుత్ వాహనాల్లో వాడే బ్యాటరీలు, భారత్ లో తయారయ్యే స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్లెట్లు, విమానాల విడి భాగాలు ఇలా కొన్నింటిపై తగ్గించడం జరిగింది. ధరలు పెరిగేవి ఇవే: ఆదాయం పన్ను సరిగ్గా చూపని వారికి 100% పెంపు. బహిర్గతం చెయ్యని చరాస్థులపై జరిమానా విధింపు. ఫ్యూచర్ ఆప్షన్ ట్రేడింగ్, విలాసవంతమైన వాచీలు, ఆల్కహాల్, సిగరెట్లు, బీడీలు, పాన్ మసాలా, గుట్కా, కాఫీ రోస్టింగ్, బ్రువింగ్ వెండింగ్ యంత్రాలు, కొన్ని రకాల ఎరువులపై దిగుమతి ఫీజులను తొలగించారు. అమోనియం ఫాస్పేట్, అమోనియం నైట్రోఫాస్పేట్ వంటి ధరలు పెరగొచ్చు. చిత్రీకరణకు వాడే కెమెరాలు , పరికరాల ధరలు పెరిగే అవకాశం ఉంది. అత్యంత ముఖ్యమైనది: చరాస్థులపై జరిమానా విధింపు బహిర్గతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బడ్జెట్ నేపథ్యంలో ఆదివారం అయినప్పటికీ దేశీయ మార్కెట్లు పని చేసాయి. మదుపర్లకు బ్లాక్ సండే ను మిగిల్చింది.

**అంతర్జాతీయ వార్తలు:**

భారత్ కు ఓ వైపు పాక్, మరో వైపు చైనా, బంగ్లాదేశ్ తో తీవ్ర విబేధాలు కొనసాగుతున్న వేళ రికార్డు స్థాయిలో రక్షణ బడ్జెట్ పెరిగింది. ఆపరేషన్ సింధూర తో అత్యాధునిక యుద్ధ తంత్రం అవసరాలను భారత్ గుర్తించింది. దీనికి తగ్గట్టే కేటాయింపులు చేసింది. గత ఏడాది కొన్నిటిని కలుపుకుని ... రూ. 6. 81 లక్షల కోట్లు కేటాయించగా ... ఈ సారి అది రూ.7. 85 కోట్లకు చేరుకుంది. ఈ సారి బడ్జెట్ కేటాయింపుల్లో మొతం తమకు 14. 68 శాతం లభించినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ముఖ్యంగా రక్షణ దళాల ఆధునీకరణకు ఈ బడ్జెట్ పెద్ద పీట వేసి, గతేడాది 1.8 లక్షల కోట్లని కేటాయించగా.. ఈ బడ్జెట్ లో దానిని రూ 2. 19 లక్షల కోట్లకు చేర్చారు. వాయు సేన, యుద్ధ విమానాల అవసరాలకు పెద్ద మొత్తాన్ని ఇచ్చారు. ఇరాన్ అమెరికా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజి షికియాన్ కీలక వ్యాఖ్యలు చేసారు. తమ దేశంలోని ఆర్థిక ఇబ్బందులను సాకుగా చూపి, అమెరికా, ఇజ్రాయిల్, యూరప్ నాయకులు అశాంతిని రేకెత్తిస్తున్నారని ఆరోపించారు.అయితే అగ్ర రాజ్యంతో తాము యుద్ధం కోరుకోవడం లేదని అన్నారు. స్థానిక మీడియాలో ప్రసారమైన వీడియోలో ఫెజిష్కియాన్ మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు, యూరప్ నేతలు మా సమస్యలను లక్ష్యంగా చేసుకున్నారు. ఈ సందర్భంగా అమెరికాతో యుద్ధం కోరుకోవడం లేదని, ఇరాన్ కు గానీ, అమెరికాకు గాని సంఘర్షణలు ప్రయోజనకరం కావని స్పష్టం చేసారు. మన దేశమైనా, ప్రపంచ దేశాలైనా ప్రపంచ శాంతిని కోరుకుంటూ అత్యంత జాగరూకతతో ఉండవలసిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజలంతా కూడా దేశ భక్తితో నిస్వార్థంగా ఉండి, దేశాభివృద్ధిని కోరుకుంటూ ఉందామా మరి!

సర్వేజనా సుఖినోభవంతు



తీగవరపు శాంతి

# వార్తా విశేషాలు

## పార్లమెంట్లో బడ్జెట్ కు  ముందు ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టిన కేంద్ర ఆర్థిక మంత్రి

బడ్జెట్కు ముందు ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టడం భారత్లో ఒక సంప్రదాయంగా వస్తోంది. గత ఏడాది కాలంలో దేశ ఆర్థిక పనితీరు ఎలా ఉంది? రాబోయే ఏడాదిలో ఎదురయ్యే సవాళ్లేంటి? అనే అంశాలను ఆర్థిక వ్యవహారాల విభాగం ఈ సర్వేలో నిక్షిప్తం చేస్తుంది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఉభయ సభల్లో ఆర్థిక సర్వే 2025-26ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్  ప్రవేశపెట్టారు. ఈ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వృద్ధి రేటు 7.4 శాతంగా నమోదు కావొచ్చని ఆర్థిక సర్వే అంచనా వేసింది. ఇక రాబోయే 2026-27 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి 6.8 నుంచి 7.2 శాతం మధ్య ఉండొచ్చని సర్వే విశ్లేషించింది. ద్రవ్యలోటును గతేడాది ఉన్న 4.8 శాతం నుంచి 4.4 శాతానికి తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపట్టింది.  కేంద్ర ఆర్థిక సర్వే గణాంకాల ప్రకారం... 'వికసిత్ భారత్' లక్ష్య సాధనలో వ్యవసాయ రంగం కీలక పాత్ర పోషిస్తోంది. అటు తయారీ రంగంలోనూ భారత్ గ్లోబల్ హబ్గా మారుతోంది. ముఖ్యంగా ఎలక్ట్రానిక్ రంగం అద్భుత ప్రగతిని సాధించింది. పదేళ్ల క్రితం కేవలం 18 వేల కోట్లుగా ఉన్న మొబైల్ ఫోన్ల ఉత్పత్తి విలువ, నేడు 5 లక్షల 45 వేల కోట్లకు చేరింది. పీఎల్ఐ పథకాల ద్వారా లక్షల కోట్ల పెట్టుబడులు రావడమే కాకుండా.. సుమారు 12 లక్షల మందికి కొత్తగా ఉపాధి లభించింది. సెమీకండక్టర్ మిషన్ కింద 10 భారీ ప్రాజెక్టులు పట్టాలెక్కడం పారిశ్రామిక విప్లవానికి సంకేతంగా నిలుస్తోంది.  అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు, యుద్ధ వాతావరణం ఉన్నప్పటికీ భారత్ తన విదేశీ రక్షణ కవచాన్ని పటిష్టం చేసుకుంది. 701 బిలియన్ డాలర్ల రికార్డు స్థాయి విదేశీ మారక నిల్వలు దేశానికి భరోసాగా ఉన్నాయి. ఇది దాదాపు 11 నెలల దిగుమతులకు సరిపోతుంది. సేవలు, వస్తువుల ఎగుమతులు 825 బిలియన్ డాలర్లకు చేరాయి. సామాన్యుడిని వేధించే ద్రవ్యోల్బణం 1.7 శాతానికి పరిమితం కావడం ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనం. జీఎస్టీ వసూళ్లు 17 లక్షల కోట్ల మార్కును దాటడం ఆర్థిక పటిష్టతకు అద్దం పడుతోంది. డిజిటల్ సేవల వినియోగంలో పట్టణాలకు ధీటుగా గ్రామాలు పోటీ పడుతున్నాయి. భారత్-ఈయూ మధ్య కుదిరిన ట్రేడ్ డీల్ కొత్త ఎగుమతి అవకాశాలను కల్పిస్తోంది. ఇక మౌలిక సదుపాయాల విషయానికి వస్తే.. జాతీయ రహదారుల నిడివి 60 శాతం పెరిగి లక్షా 46 వేల కిలోమీటర్లకు చేరింది. రైల్వే నెట్వర్క్ దాదాపు వంద శాతం విద్యుదీకరణ దిశగా సాగుతోంది. అంతరిక్ష రంగం, ఏఐ టెక్నాలజీలో సామాన్యుడి భాగస్వామ్యం పెరగడం భవిష్యత్ భారత్కు శుభసూచకమని విశ్లేషకులు అంటున్నారు.  ఇక తెలంగాణ ఆర్థిక ప్రగతిపై ఆర్థిక సర్వే 2025-26 కీలక గణాంకాలను వెల్లడించింది. 2014-23 మధ్య కాలంలో రాష్ట్రంలో సాగు యోగ్య భూమి విస్తీర్ణం 1.31 కోట్ల ఎకరాల నుంచి 2.21 కోట్ల ఎకరాలకు గణనీయంగా పెరగగా, దేశ తయారీ రంగంలో రాష్ట్రం 5 శాతం వాటాను నమోదు చేసింది. ఐటీ, ఫైనాన్స్, ప్రొఫెషనల్ సర్వీసుల్లో కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడులతో కలిసి తెలంగాణ 40 శాతం వాటాను పంచుకోగా, ఏఐ స్టార్టప్లలో రాష్ట్రం 7 శాతం వాటాతో రాణిస్తోంది. పరిపాలనా సంస్కరణల్లో భాగంగా 'భూభారతి' ద్వారా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల విభాగాలను ఏకీకృతం చేసిన తీరును సర్వే ప్రశంసించగా, మున్సిపల్ బాండ్ల జారీలో భాగ్యనగరం దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ నాలుగో స్థానంలో, విజయవాడ పదో స్థానంలో నిలవడమే కాకుండా.. 2035 నాటికి హైదరాబాద్ జీడీపీ 201.4 బిలియన్ డాలర్లకు, విజయవాడ జీడీపీ 21.3 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని సర్వే అంచనా వేసింది.   మొత్తానికి.. 2025-26 ఆర్థిక సర్వే కేవలం అంకెలు కాదు..  140 కోట్ల భారతీయుల ఆకాంక్షలకు ప్రతిరూపం. 'మారథాన్ను స్ప్రింట్లా' పరిగెడుతూ, దీర్ఘకాలిక లక్ష్యాలను వేగంగా చేరుకోవాలని ఈ సర్వే దిశానిర్దేశం చేసింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు తడబడుతున్న వేళ.. స్థిరమైన వృద్ధి, పటిష్టమైన సంస్కరణలతో గ్లోబల్ లీడర్గా ఎదిగేందుకు భారత్ సర్వసిద్ధమైంది. ఫిబ్రవరి 1న సమర్పించబోయే కేంద్ర బడ్జెట్లో ఈ సర్వే అంశాలు ఎలాంటి ప్రాధాన్యత సంతరించుకుంటాయో చూడాలి.

# న్యూఢిల్లీలోని కర్తవ్య పథ్ లో77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు



ఆత్మ నిర్భర్ భారత్ స్ఫూర్తితో దేశ రాజధాని న్యూఢిల్లీలోని కర్తవ్య పథ్ లో సాగిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు... దేశ సంప్రదాయాలు, అభివృద్ధి, వైవిధ్యానికి ప్రతీకగా నిలిచాయి. దాదాపు 3 గంటల పాటు సాగిన రిపబ్లిక్ డే పరేడ్... భారత సైనిక శక్తి, ఆయుధ సంపత్తిని ప్రపంచానికి చాటి చెప్పింది. సర్వసైన్యాధ్యక్షురాలైన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి... త్రివిద దళాలు, ఇతర విభాగాల సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. వందేమాతర గేయం 150 సంవత్సరాలు పూర్తైన నేపథ్యంలో జరిగిన రిపబ్లిక్ డే వేడుకలు అంబరాన్నంటాయి. భారత శక్తి యుక్తులను ప్రదర్శిస్తూ సాగిన కవాతు ఆహుతులను కట్టిపడేసింది. గత 76 ఏళ్లలో వివిధ రంగాల్లో దేశం సాధించిన ప్రగతిని ఇది ప్రస్ఫుటించింది. 2047 నాటికి ఆత్మ నిర్భర్ భారత్ లక్ష్యంగా సాగుతున్న భారతావని నిబద్ధతను ఈ పరేడ్ ప్రతిబింభించింది. రాష్ట్రపతి ప్రత్యేక గుర్రపు బగ్గీలో కర్తవ్యపథ్కు చేరుకున్నారు. రిపబ్లిక్ డే పరేడ్ కు ప్రత్యేక ఆహ్వానితులైన యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ లేయెన్, ఐరోపా మండలి అధ్యక్షుడు ఆంటోనియా కోస్టాతో కలిసి ద్రౌపది ముర్ము గుర్రపు బగ్గీలో ప్రయాణించారు. అప్పటికే అక్కడికి చేరుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్.. రాష్ట్రపతికి సాదర స్వాగతం పలికారు. రాష్ట్రపతి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వేడుకలను ఆరంభించారు. అదే సమయంలో 21 గన్ సెల్యూట్తో కర్తవ్యపథ్ మారుమోగింది. గగనతలం నుంచి MI-17 హెలికాప్టర్లు 'ధ్వజ్ ఫార్మేషన్' లో పూల వర్షం కురిపించాయి. దీనికి కెప్టెన్ అలోక్ అహ్లావత్ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా ఇటీవల అంతరిక్ష యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకున్న గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా కు రాష్ట్రపతి అశోక చక్ర పురస్కారం అందజేశారు. పరేడ్ లో భాగంగా త్రివిధ దళాల ప్రత్యేక బృందాల కవాతు వీక్షకులను కట్టిపడేయగా... ఐరోపా సమాఖ్యకు చెందిన సైనిక బృందం కూడా పరేడ్ లో భాగం పంచుకుంది. విన్యాసాల్లో 16 యుద్ధ విమానాల, హెలికాప్టర్లు పాల్గొన్నాయి. రాఫేల్, సుఖోయ్, జాగ్వార్, మిగ్29 విమానాల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అర్జున్, వజ్ర, వరుణ ఫార్మేషన్ లను ప్రదర్శిస్తున్న సమయంలో కర్తవ్యపథ్ కరతాళ ధ్వనులతో మారుమోగింది. ఆపరేషన్ సింధూర్ లో వినియోగించిన ఆయుధ వ్యవస్థను కూడా పరేడ్ లో ప్రదర్శించారు. అనంతరం 17 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన 30 శకటాలు కర్తవ్య పథ్లో ముందుకు సాగాయి. ఇందులో కేంద్ర ప్రభుత్వానికి చెందిన 13 శకటాలు ఉన్నాయి. వివిధ రంగాల్లో సాధించిన అభివృద్ధితో పాటు సాంస్కృతిక వైభవాన్ని ఇవి ప్రతిబింబించాయి. ఈ వేడుకలకు ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, కేంద్ర మంత్రులు, ఉన్నతాధికారులతో పాటు దేశ వ్యాప్తంగా 10 వేల మంది ప్రత్యేక ఆహ్వానితులు హాజరయ్యారు.

## భారత్-యూరోపియన్ యూనియన్ మధ్య చారిత్రాత్మ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఖరారు

భారత్ -యూరోపియన్ యూనియన్ మధ్య చారిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఖరారు అయ్యింది. ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య భాగస్వామ్యానికి నిదర్శనంగా ఈ ఒప్పందం నిలిచింది. ప్రపంచ జీడీపీలో 25శాతం వాటా కలిగి ఉన్న భారత్-ఈయూల మధ్య ఈ ఎఫ్టీఏ మదర్ ఆఫ్ ఆల్ డీల్స్ అని ప్రధాన మంత్రి అభివర్ణించారు. ఈ ఒప్పందం సందర్భంగా ఇవాళ ఈయూ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఆంటోనియో, యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ తో ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్ లో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. కాగా, గోవాలో జరుగుతున్న ఇండియా ఎనర్జీ వీక్-2026లో ప్రధాని ఉదయం వర్చువల్ గా మాట్లాడుతూ.. నిన్న ఈ ఒప్పందం కుదిరినట్టు ప్రకటన చేశారు. భారత్-ఈయూ ఎఫ్టీఏ వల్ల భారత్ లోని 140కోట్ల మంది ప్రజలకు, ఈయూలో నివసిస్తున్న లక్షలాది మందికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. ఉత్పత్తి, సేవ రంగాలపై ఈ ఒప్పందం సానుకూల ప్రభావం చూపిస్తుందని అన్నారు. భారత్ లో పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచ వ్యాప్తంగా ఇన్వేస్టర్లలో విశ్వాసం పెరుగుతుందన్నారు. 2007లో ఎఫ్టీఏపై భారత్-ఈయూ కసరత్తు ప్రారంభించాయి, అనేక అవరోధాలను ఎదుర్కొని ఈ ఒప్పందం నేటికి ఖరారు అవడం విశేషం.

## న్యూఢిల్లీలో రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తో ఈయూ ప్రతినిధుల భేటీ

భారత్ - యూరోపియన్ యూనియన్ మధ్య చారిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఖరారు అయ్యింది. ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య భాగస్వామ్యానికి నిదర్శనంగా ఈ ఒప్పందం నిలిచింది. ప్రపంచ జీడీపీలో 25శాతం వాటా కలిగి ఉన్న భారత్-ఈయూల మధ్య ఈ ఎఫ్టీఏ మదర్ ఆఫ్ ఆల్ డీల్స్ అని ప్రధాన మంత్రి అభివర్ణించారు. ఈ ఒప్పందం సందర్భంగా ఇవాళ ఈయూ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఆంటోనియో, యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ తో ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్ లో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. కాగా, గోవాలో జరుగుతున్న ఇండియా ఎనర్జీ వీక్-2026లో ప్రధాని ఉదయం వర్చువల్ గా మాట్లాడుతూ.. నిన్న ఈ ఒప్పందం కుదిరినట్టు ప్రకటన చేశారు. భారత్-ఈయూ ఎఫ్టీఏ వల్ల భారత్ లోని 140కోట్ల మంది ప్రజలకు, ఈయూలో నివసిస్తున్న లక్షలాది మందికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. ఉత్పత్తి, సేవ రంగాలపై ఈ ఒప్పందం సానుకూల ప్రభావం చూపిస్తుందని అన్నారు. భారత్ లో పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచ వ్యాప్తంగా ఇన్వేస్టర్లలో విశ్వాసం పెరుగుతుందన్నారు. 2007లో ఎఫ్టీఏపై భారత్-ఈయూ కసరత్తు ప్రారంభించాయి, అనేక అవరోధాలను ఎదుర్కొని ఈ ఒప్పందం నేటికి ఖరారు అవడం విశేషం.



# హైదరాబాద్ లోమరో ప్రపంచ స్థాయి షాపింగ్ మాల్ ఏర్పాటు



హైదరాబాద్ లో మరో ప్రపంచ స్థాయి షాపింగ్ మాల్ ఏర్పాటు కానుంది. ప్రపంచ ఆర్థిక వేదిక 2026 సదస్సులో స్విట్జర్లాండ్లోని వాడ్ రాష్ట్ర ముఖ్యమంత్రి క్రిస్టెల్ లూసియర్ బ్రోడార్తో సీఎం రేవంత్ రెడ్డి జరిపిన చర్చలు సఫలమయ్యాయి. హైదరాబాద్లో స్విస్ మాల్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి క్రిస్టెల్ లూసియర్ కు ప్రతిపాదించారు. దీనికి క్రిస్టెల్ సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ప్రపంచంలోనే మొట్టమొదటి స్విస్ మాల్ను హైదరాబాద్ వేదికగా ఏర్పాటు చేస్తామని వాడ్ సీఎం హామీ ఇచ్చారు. కేవలం షాపింగ్కే పరిమితం కాకుండా స్విస్ సంస్కృతి, విద్య, నైపుణ్య శిక్షణ, హాస్పిటాలిటీకి ఈ మాల్ కేంద్ర బిందువుగా నిలవనుంది. సీఎం ప్రతిపాదించిన ఈ వినూత్న ఆలోచనకు స్విస్ ప్రతినిధుల బృందం తక్షణమే సానుకూలత వ్యక్తం చేసింది. అలాగే 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదిగేలా రూపొందించిన రోడ్మ్యాప్ను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వివరించారు. భారత్-స్విట్జర్లాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో రెండు రాష్ట్రాల మధ్య ఆర్థిక బంధం మరింత బలోపేతం కానుంది. ఈ భేటీలో మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, చర్చలు జరిపిన ఇద్దరు ముఖ్యమంత్రులు ఫుట్బాల్ క్రీడాకారులు కావడంతో.. క్రీడారంగంలో భాగస్వామ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు. క్రీడా శిక్షణ, మౌలిక వసతుల అభివృద్ధిలో అంతర్జాతీయ ప్రమాణాలను తెలంగాణకు తీసుకురావాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. మహిళా సాధికారతపై ఇద్దరు ముఖ్యమంత్రులు చర్చించారు. తెలంగాణలో మహిళల సంక్షేమానికి చేపడుతున్న కార్యక్రమాలు, స్వయం సహాయక సంఘాలు మహిళలను ఆర్థికంగా, సామాజికంగా ఎలా బలపరుస్తున్నాయో సీఎం రేవంత్ రెడ్డి వారికి వివరించారు. వాడ్ ప్రతినిధులు తెలంగాణకు వచ్చి స్వయం సహాయక బృందం మోడల్ను ప్రత్యక్షంగా అధ్యయనం చేయాలని సీఎం కోరగా.. త్వరలోనే ఓ ప్రతినిధుల బృందం రాష్ట్రానికి రానుందని సమాచారం. మొత్తంగా దావోస్ పర్యటనలో ఇప్పటివరకు తెలంగాణ సుమారు 20 వేల కోట్ల పెట్టుబడి ఒప్పందాలను కుదుర్చుకుంది. లైఫ్ సైన్సెస్, ఏఐ , గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో తెలంగాణను గ్లోబల్ హబ్గా మార్చే దిశగా సీఎం రేవంత్ రెడ్డి అడుగులు వేస్తున్నారు.

# ఢిల్లీలో 'బీటింగ్ రిట్రీట్' రిహార్సల్స్.. నేడు ఈ మార్గాల్లో ఆంక్షలు



గణతంత్ర వేడుకల ముగింపు ఘట్టమైన 'బీటింగ్ రిట్రీట్' వేడుకల రిహార్సల్స్ కారణంగా ఈరోజు న్యూఢిల్లీలోని విజయ్ చౌక్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు అడ్వైజరీ జారీ చేశారు. సాయంత్రం 4:00 గంటల నుండి 6:30 గంటల వరకు కింది ప్రాంతాల్లో వాహనాల రాకపోకలపై ఆంక్షలు ఉంటాయి. రైసినా రోడ్డులోని కృషి భవన్ సమీపంలోని రౌండ్‌అబౌట్ నుండి విజయ్ చౌక్ వైపు వెళ్లే వాహనాలపై ఆంక్షలు ఉంటాయి. దారా షికో రోడ్, కృష్ణ మీనన్ మార్గ్, సునేహ్రి మసీదు రౌండ్‌అబౌట్ల నుండి విజయ్ చౌక్ వైపు వెళ్లే దారులను మూసివేస్తారు. విజయ్ చౌక్ నుండి రఫీ మార్గ్ మీదుగా కర్తవ్య పథ్ క్రాసింగ్ వరకు ఉన్న రహదారిని కూడా మూసివేస్తారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా వాహనదారులు తమ ప్రయాణాన్ని ముందుగానే ప్లాన్ చేసుకోవాలని అధికారులు సూచించారు. రింగ్ రోడ్, రిడ్జ్ రోడ్, అరబిందో మార్గ్, మదర్సా టి-పాయింట్, సఫ్దర్జంగ్ రోడ్ - కమల్ అటాతుర్క్ మార్గ్ వైపు, రాణి ఝాన్సీ రోడ్, మింటో రోడ్ వంటి ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. వాహనదారులు ఈ ఆంక్షలను దృష్టిలో ఉంచుకుని సహకరించాలని ఢిల్లీ ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# నెక్లెస్  రోడ్ లో ఘనంగా ప్రారంభమైన నర్సరీ మేళా




హైదరాబాద్ నెక్లెస్రోడ్ లో నర్సరీ మేళా ఘనంగా ప్రారంభమైంది. దేశీయ, విదేశీ పూల మొక్కలు, విత్తనాలు, అంట్లు, అరుదైన వృక్ష జాతుల విత్తనాల విక్రయాలకు గ్రాండ్ నర్సరీ మేళా వేదిక అయింది.
19వ జాతీయ ఉద్యాన, వ్యవసాయ ప్రదర్శనను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. నెక్లెస్రోడ్లోని ఐ-మాక్స్ థియేటర్ పక్కన హెచ్ఎండీఏ మైదానంలో రాష్ట్ర ఉద్యాన, వ్యవసాయ శాఖ, తెలంగాణ ఈవెంట్ ఆర్గనైజర్స్ సంస్థ ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు గ్రాండ్ నర్సరీ మేళా జరుగుతోంది.
దేశవ్యాప్తంగా పేరుగాంచిన నర్సరీలు, విత్తన సంస్థలు, అంకుర సంస్థల వ్యవస్థాపకులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఇక్కడ స్టాళ్లు ఏర్పాటు చేశారు.
సహజ వనరులు పొదుపుగా సద్వినియోగం చేసుకుంటూ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, పట్టణ, నగరాల్లో మిద్దె పంటల సాగే లక్ష్యంగా గ్రాండ్ నర్సరీ మేళా సాగనుంది. ఈ నర్సరీ మేళాలో 150 కి పైగా స్టాళ్లు కొలువు తీరాయి.

## ఫిబ్రవరి 3 నుంచి మార్చి 31 వరకు రాష్ట్రపతి భవన్‌లో అమృత్ ఉద్యాన్

ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్లోని సుందరమైన అమృత్ ఉద్యాన్ ఫిబ్రవరి 3 నుండి మార్చి 31 వరకు ప్రజల సందర్శనార్థం అందుబాటులో రానుంది. సందర్శకులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు గేట్ నంబర్ 35 ద్వారా ప్రవేశించవచ్చు. సందర్శన కోసం అధికారిక వెబ్సైట్లో ముందస్తుగా లేదా గేట్ వద్ద ఆఫ్లైన్ ద్వారా ఉచితంగా టికెట్లు పొందవచ్చు. ప్రయాణికుల సౌకర్యార్థం సమీప మెట్రో స్టేషన్ నుండి ప్రత్యేక బస్సు సౌకర్యం కూడా కల్పించారు. ప్రతి సోమవారం నిర్వహణ కోసం, అలాగే మార్చి 4న హోలీ సందర్భంగా ఉద్యానవనాన్ని మూసివేస్తారు.

## వసంత పంచమి

"వసంత పంచమి "పర్వదినాన్ని ప్రజలు శుక్రవారం భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. చదువుల తల్లి సరస్వతీ దేవి మాఘశుద్ధ పంచమి రోజున జన్మించినట్టు పురాణాలు పేర్కొంటున్నాయి.వసంత పంచమిని శ్రీ పంచమి, మదన పంచమి అని కూడా పిలుస్తారు. పిల్లలకు చదువు ప్రారంభించడానికి ఈ రోజు శుభప్రదమైనదిగా పరిగణిస్తారు. వసంత పంచమి సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ ..., తెలంగాణా రాష్ట్రాలలోని దేవాలయాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.ఆంధ్ర ప్రదేశ్ లోని విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ కనకదుర్గమ్మ వారి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాలకు ఏర్పాట్లు చేశారు. అలాగే తెలంగాణా రాష్ట్రం బాసర జ్ఞాన సరస్వతీ దేవి ఆలయంలో అక్షరాభ్యాసాల కోసం ప్రత్యేక మండపాలను ఏర్పాటు చేశారు..

## ఎల్బీ స్టేడియంలో ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవాన్ని ప్రారంభించిన గవర్నర్

ప్రధాని మోదీ దేశాన్ని స్పోర్ట్స్ పవర్ హౌస్గా మార్చాలని విజన్ గా పెట్టుకున్నారని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవాన్ని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటలు మెడల్స్ కోసమే కాదు.. ఆత్మస్థైర్యం కోసం ఆడాలన్నారు. ప్రపంచానికి మన ఆత్మవిశ్వాసాన్ని చూపేందుకు క్రీడలు ఒక మార్గమని చెప్పారు. మోదీ పాలనలో స్వచ్ఛ భారత్ ఒక ఉద్యమంగా మారిందన్నారు. యోగాను ప్రపంచ వ్యాప్తంగా ప్రధాని మోదీ తీసుకెళ్లారని గుర్తు చేశారు. తన పాలసీలను ప్రజా ఉద్యమంగా మార్చడంలో మోదీ విజయవంతమయ్యారని వెల్లడించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. క్రీడలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో నియోజకవర్గాల వారీగా సంసద్ ఖేల్ మహోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు..ప్రపంచానికి పరిచయం చేయాలని ప్రధాని మోదీ..ఈ కార్యక్రమానికి పిలుపుని చ్చారని కిషన్ రెడ్డి తెలిపారు.

## .బేటీ బచావో.. బేటీ పడావో అనే మహత్తర కార్యక్రమానికి 11 ఏళ్లు పూర్తి

కేంద్ర ప్రభుత్వం బేటీ బచావో బేటీ పడావో అనే మహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించి నేటికి 11 ఏళ్లు పూర్తయ్యాయి. జనవరి 22, 2015 హర్యానాలోని పానిపట్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బేటీ బచావో- బేటీ పడావో అనే పథకానికి శ్రీకారం చుట్టారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా కీలక సందేశాన్ని పంచుకున్నారు. ఆడపిల్లల రక్షణ, విద్య, సాధికారతే లక్ష్యంగా ప్రారంభమైన బేటీ బచావో - బేటీ పడావో ఉద్యమం విజయవంతంగా 11 వసంతాలు పూర్తి చేసుకుందని మోదీ సంతోషం వ్యక్తం చేశారు. ఈ పథకం ద్వారా దేశంలో లింగ వివక్ష తగ్గి, బాలికల జననాల నిష్పత్తి మెరుగుపడటమే కాకుండా, విద్యా రంగంలోనూ అద్భుతమైన మార్పులు వచ్చాయని హర్షం వ్యక్తం చేశారు. ఒక కుమార్తె పదిమంది కుమారులతో సమానమని.. పదిమంది కుమారులను పెంచి పెద్ద చేయడం వల్ల ఏ పుణ్యం లభిస్తుందో, ఒక్క కుమార్తెను పెంచి ప్రయోజకురాలిని చేయడం వల్ల అంతకంటే ఎక్కువ ఫలితం లభిస్తుందని ప్రధాని మోదీ.. స్కంద పురాణంలోని శ్లోకం ద్వారా వివరించారు. ఈ సందర్భంగా నేడు భారతదేశంలోని ఆడపిల్లలు ఆకాశమే హద్దుగా రాణిస్తున్నారని ప్రశంసించారు. అంతరిక్ష పరిశోధనల నుండి ఏఐ వరకు ప్రతి రంగంలోనూ మహిళా శాస్త్రవేత్తలదే పైచేయిగా ఉందని కొనియాడారు. ఒలింపిక్స్ నుండి క్రికెట్ వరకు భారత్ కీర్తిని దశదిశలా వ్యాపింపజేస్తున్నారని తెలిపారు. యుద్ధ విమానాలను నడపడం నుండి సరిహద్దుల రక్షణ వరకు మహిళలు తమ సత్తా చాటుతున్నారని గుర్తు చేశారు. ఈ 11 ఏళ్ల ప్రస్థానంలో బేటీ బచావో-బేటీ పడావో కేవలం ప్రభుత్వ పథకంలా కాకుండా, ఒక సామాజిక విప్లవంగా మారిందని ప్రధాని మోదీ సంతోషం వ్యక్తం చేశారు.

## పేదలకు అంతర్జాతీయ ప్రమాణాల విద్య అందించడమే ప్రధాన లక్ష్యం: భట్టి విక్రమార్క

పేదల సొంతింటి కలను సాకారం చేయడం, ఆదివాసీలకు సమగ్రాభివృద్ధి కల్పించడంతో పాటు వారి పిల్లలకు నాణ్యమైన, అంతర్జాతీయ ప్రమాణాల విద్య అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గిరిజనుల ఆరాధ్య దైవం కేస్లాపూర్ లో కొలువున్న నాగోబా ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. వాయిస్ ఓవర్ : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని కుమ్మరి తండా, దంతన్పల్లి, పులిమడుగు ప్రాంతాల్లో ఉప ముఖ్యమంత్రి రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి పర్యటించారు. కుమ్మరితాండలో ప్రభుత్వం 200 కోట్ల రూపాయల నిధులతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణం పనులకు, అలాగే 13 కోట్ల రూపాయల వ్యయంతో ఆదిలాబాద్ సర్కిల్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఐదు 33/11 కెవి సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ పాదయాత్రలో ప్రజలు చెప్పిన ప్రతి విషయాన్ని నమోదు చేసుకున్నాని, వాటిని దశలవారీగా పరిష్కరిస్తున్నామని అన్నారు. పేదల సొంతింటి కల నెరవేరుస్తామని, ఆదివాసీ బిడ్డలకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం నేరుగా నగదు బదిలీ ద్వారా ఇప్పటివరకు రూ.1,21,874 కోట్లను ప్రజల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. మహిళా సాధికారత లక్ష్యంగా ఏటా మహిళా సంఘాలకు రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని చెప్పారు. వ్యవసాయ రంగంలో రూ.12,500 కోట్లతో ఇందిరా సౌర గిరి వికాసం పథకం అమలు చేస్తున్నామని వివరించారు.

# అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ జరిగి నేటికి రెండేళ్లు పూర్తి



భారతీయ ఆధ్యాత్మిక చరిత్రలో ఒక నవశకం ఆరంభమై నేటికి సరిగ్గా రెండేళ్లు పూర్తయ్యాయి. 2024, జనవరి 22న అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ జరిగిన అద్భుత ఘట్టం కోట్లాది మంది గుండెల్లో నిలిచిపోయింది. ఈ అపురూప ఘట్టానికి నేటితో రెండేళ్లు పూర్తయ్యాయి. దీంతో అయోధ్య పురవీధులు రెండో వార్షికోత్సవ శోభతో మెరిసిపోతున్నాయి. భవ్య మందిరంలో కొలువుదీరిన బాలరామయ్యను దర్శించుకునేందుకు దేశవిదేశాల నుంచి భక్తులు బారులుతీరారు. జైశ్రీరామ్ ఈ నామస్మరణతో అయోధ్య నగరం మారుమోగుతోంది.దేశంలో శతాబ్దాలుగా ఎదురుచూస్తున్న స్వప్నం నెరవేరి నేటికి రెండేళ్లు పూర్తయ్యింది. అయోధ్య రామమందిరం నిర్మాణం కోసం ఎదురు చూస్తున్న హిందూవులకు ప్రధాని నరేంద్ర మోదీ చొరవతో కల సాకారం అయ్యింది. సరిగ్గా రెండేళ్ల క్రితం 2024 జనవరి 22న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా రామ మందిరం ప్రారంభమైంది. ప్రధాని మోదీ 2020 ఆగస్టు 5న ఆలయ నిర్మాణానికి భూమి పూజ జరిగింది. ఆ తర్వాత నాలుగేళ్ల పాటు పలు దశల్లో నిర్మాణం జరిగింది. దేశంలో అత్యుత్తమ శిల్పులు, నిర్మాణ రంగ నిపుణులతో ఆలయాన్ని నిర్మించారు. బాల రామయ్య విగ్రహాన్ని కర్ణాటకకు చెందిన ప్రముఖ శిల్పి అరుణ్ యోగిరాజ్ చెక్కారు. ఆయన కుటుంబం ఐదు తరాలుగా శిల్పకళా సంప్రదాయాన్ని కొనసాగిస్తోంది. బాలరామయ్య విగ్రహం 51 అంగుళాలు ఎత్తుతో నల్లని రాయిపై చెక్కారు. ఈ ఆలయ నిర్మాణంలో భాగంగా గత ఏడాది నవంబర్ 25న ధ్వజారోహణంతో నిర్వహించారు. అయితే హిందూ క్యాలెండర్ ప్రకారం పుష్య మాసంలోని.. శుక్ల పక్ష ద్వాదశి రోజున ప్రాణప్రతిష్ఠ జరిగింది. ఈ ఏడాది ద్వాదశి ఈనెల 11న వచ్చింది. దాని ప్రకారం ఉత్సవాలు నిర్వహించారు. కానీ తేదీ ప్రకారం నేడు రెండో వార్షికోత్సవం వేడుకలు జరుగుతున్నాయి. ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభమైన ఈ దివ్య క్షేత్రం, నేడు ప్రపంచ పర్యాటక పటంలో అగ్రస్థానంలో నిలుస్తోంది. రెండో వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని పుష్పాలతో అందంగా అలంకరించారు. అయోధ్య రామమందిరం రెండో వార్షికోత్సవం సందర్భంగా ఆలయానికి భక్తులు పోటెత్తారు. సరయూ నదీ తీరాన లక్షలాది దీపాలతో 'దీపోత్సవం' నిర్వహిస్తున్నారు. ప్రత్యేక లేజర్ షో ద్వారా రామాయణ గాథను భక్తులకు కళ్లకు కట్టినట్లు వివరిస్తున్నారు. గత రెండేళ్లలో దాదాపు 10 కోట్లకు పైగా భక్తులు బాలరాముడిని దర్శించుకున్నట్లు ఆలయ ట్రస్ట్ గణాంకాలు చెబుతున్నాయి. అయోధ్యలో బారాముడు కొలువుదీరిన తర్వాత టెంపుల్ సిటీగా మాత్రమే కాదు.. ఆ ప్రాంతం మోడల్ స్మార్ట్ సిటీగా మారిపోయింది. కేవలం ఆధ్యాత్మిక కేంద్రంగానే కాకుండా, భారత శిల్పకళా వైభవానికి ఆలయం ఒక నిలువుటద్దంగా నిలించింది. అంతర్జాతీయ విమానాశ్రయం, అత్యాధునిక రైల్వే స్టేషన్, ప్రపంచ స్థాయి హోటళ్లతో ఈ నగరం భక్తుల రాకతో కళకళలాడుతోంది. గత రెండు సంవత్సరాలలో అయోధ్యలో పర్యాటక రంగం ద్వారా వేలాది మంది స్థానిక యువతకు ఉపాధి లభించింది. భక్తుల సౌకర్యార్థం ప్రవేశపెట్టిన డిజిటల్ దర్శనం, ఈ-బస్సులు సాంకేతికతకు, భక్తికి ఉన్న అనుసంధానాన్ని చాటిచెబుతున్నాయి. ఐదు శతాబ్దాల నిరీక్షణకు ఫలితంగా నిర్మితమైన ఈ రామ మందిరం, నేడు శాంతికి, సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. రెండో వార్షికోత్సవ వేళ అయోధ్య వెలుగులు ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

## భోజ్ శాల వివాదం.. వసంత పంచమి వేడుకలకు సుప్రీంకోర్టు అనుమతి



మధ్యప్రదేశ్లోని ధార్ జిల్లాలో ఉన్న చారిత్రక భోజ్శాల-కమల్ మౌలా మసీదు ప్రాంగణంలో రేపు (వసంత పంచమి) పూజలు, నమాజ్ నిర్వహించుకోవడానికి సుప్రీంకోర్టు అనుమతినిచ్చింది. ఈ మేరకు ఇరు వర్గాల ప్రార్థనల కోసం ప్రత్యేక సమయాలను కేటాయించింది. వసంత పంచమి, శుక్రవారం ఒకే రోజు రావడంతో సుప్రీంకోర్టు షెడ్యూల్ ను ఖరారు చేసింది. హిందూ సమాజం సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు పూజలు నిర్వహించుకోవచ్చు. ముస్లిం సమాజం మధ్యాహ్నం 1:00 గంట నుండి 3:00 గంటల వరకు నమాజ్ నిర్వహించుకోవడానికి అనుమతి ఉంటుంది. కాగా, నమాజ్ కోసం వచ్చే ముస్లిం వర్గీయుల జాబితాను జిల్లా పరిపాలన యంత్రాంగానికి ముందుగానే అందజేయాలని కోర్టు ఆదేశించింది. ప్రాంగణం వద్ద శాంతి భద్రతలను కాపాడేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా యంత్రాంగాన్ని కోర్టు ఆదేశించింది. ఇరు వర్గాలు పరస్పర గౌరవాన్ని పాటించాలని, చట్టం, యంత్రాంగానికి సహకరించాలని చీఫ్ జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పంచోలిలతో కూడిన ధర్మాసనం విజ్ఞప్తి చేసింది. 11వ శతాబ్దానికి చెందిన ఈ కట్టడాన్ని హిందువులు వాగ్దేవి (సరస్వతీ దేవి) ఆలయంగా భావిస్తారు. ముస్లింలు దీనిని కమల్ మౌలా మసీదుగా పిలుస్తారు. ఇది పురావస్తు శాఖ (ASI) రక్షణలో ఉంది. ఏప్రిల్ 7, 2003న ASI చేసిన ఏర్పాటు ప్రకారం.. ప్రతి మంగళవారం హిందువులు పూజలు, ప్రతి శుక్రవారం ముస్లింలు నమాజ్ నిర్వహించుకుంటున్నారు. ఈ ఏడాది వసంత పంచమి (సరస్వతీ పూజ) శుక్రవారం రావడంతో, రెండు వర్గాలు తమ మతపరమైన కార్యక్రమాలకు అనుమతి కోరుతూ కోర్టును ఆశ్రయించాయి.

## పీఎం స్వనిధి.. వీధి వ్యాపారులకు కొత్త భరోసా: ప్రధాని మోదీ

చిన్న వ్యాపారులు, వీధి వ్యాపారుల ఆర్థిక స్వావలంబన కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం స్వనిధి పథకం ప్రాముఖ్యతను ప్రధాని నరేంద్ర మోదీ వివరించారు. కేరళలో పర్యటించిన ప్రధాని మోదీ.. వీధి వ్యాపారుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన స్వనిధి క్రెడిట్ కార్డును ఆవిష్కరించారు. దీని ద్వారా వ్యాపారులు సులభంగా రుణాలు పొందే అవకాశం ఉంటుంది. ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు ఒక లక్ష మంది లబ్ధిదారులకు పీఎం స్వనిధి రుణాలను అందజేశారు. తోపుడు బండ్లు, చిన్న దుకాణాలు నడుపుకునే వారికి ఈ పథకం దేశవ్యాప్తంగా వెన్నుముకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. కేరళలో రైల్వే కనెక్టివిటీని పెంచే దిశగా మోదీ కీలక అడుగులు వేశారు. అత్యాధునిక సౌకర్యాలతో కూడిన మూడు అమృత్ భారత్ ఎక్స్ప్రెస్ రైళ్లను ప్రధాని జెండా ఊపి ప్రారంభించారు. సాధారణ ప్రయాణికుల సౌకర్యార్థం మరో కొత్త ప్యాసింజర్ రైలును కూడా అందుబాటులోకి తెచ్చారు. అనంతరం నగర అభివృద్ధిపై ప్రధాని మోదీ ప్రత్యేక దృష్టి సారించారు. తిరువనంతపురం నగర భవిష్యత్తు అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్ (బ్లూ ప్రింట్) ను స్థానిక మేయర్కు అందజేశారు. తిరువనంతపురాన్ని దేశంలోనే ఒక కీలకమైన స్టార్టప్ హబ్గా తీర్చిదిద్దడానికి కేంద్రం అన్ని విధాలా కృషి చేస్తోందని, దీనివల్ల యువతకు భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు.

## వేములవాడలో రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా వేములవాడ పట్టణంలో ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్, ఎస్పీ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలోని బస్టాండ్ చౌరస్తాలో అవగాహన, ర్యాలీ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గురువారం ప్రారంభించారు. విప్ తో పాటు జిల్లా కలెక్టర్ గరిమా అగ్రవాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి గీతె, జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిప్పాపూర్ బస్టాండ్ నుండి కోరుట్ల బస్టాండ్ వరకు విప్ ఆది శ్రీనివాస్ ఆటో నడుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం వాహనదారులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సంధర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. వాయిస్ ఓవర్ : వాహనదారులు జాగ్రత్తగా డ్రైవింగ్ చేసి సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించడం, సీటు బెల్టు పెట్టుకుని రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. రవాణా శాఖ అధికారులు సూచనలు పాటిస్తూ ఏకాగ్రతంగా వాహనం నడపి ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరారు. జిల్లా రవాణా శాఖ అధికారి లక్మణ్ మాట్లాడుతూ, వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ ప్రమాద రహిత జిల్లాగా మార్చేలా సహకరించాలని కోరారు. గత ఏడాదిలో జిల్లాలో 317 రోడ్డు ప్రమాదాలు జరిగి 82 మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం అవుతుందని, మద్యం సేవించి వాహనం నడపడం, సెల్ ఫోన్ డ్రైవింగ్ వంటి వాటి వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఆర్డీవో ఏఎస్పీ రుత్విక్ సాయి, రాధాభాయి, డీసీసీ జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్, ఆటో యూనియన్ నాయకులు సంద్రగిరి శ్రీనివాస్, రవాణా శాఖ అధికారులు వంశీధర్, డిపో మేనేజర్ శ్రీనివాస్, ఆర్టీఏ సభ్యుల శ్రీనాథ్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.


## విజయ్ పార్టీ TVKకు గుర్తు కేటాయించిన ఎన్నికల సంఘం

తమిళ సినీ స్టార్ హీరో, 'దళపతి' విజయ్ స్థాపించిన 'తమిళగ వెట్రి కళగం' (TVK) పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల గుర్తును కేటాయించింది. పార్టీ కోరిక మేరకు 'విజిల్' గుర్తును కేటాయిస్తూ గురువారం అధికారిక ప్రకటన వెలువడింది. విజయ్ ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా భారీ బహిరంగ సభలను నిర్వహించి తన బలాన్ని నిరూపించుకున్నారు. ఇప్పుడు ఎన్నికల గుర్తు కూడా రావడంతో పార్టీ సంస్థాగతంగా మరింత బలోపేతం కానుంది. ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగే దిశగా.. తమిళనాడులో దశాబ్దాలుగా కొనసాగుతున్న ద్రవిడ పార్టీల ఆధిపత్యానికి చెక్ పెట్టడమే లక్ష్యంగా విజయ్ రాజకీయాల్లోకి ప్రవేశించారు. పార్టీ పెట్టిన కొద్ది కాలంలోనే రికార్డు స్థాయిలో సభ్యత్వ నమోదు చేపట్టి, తన సత్తా చాటారు. ఇటీవలే విక్రవాండిలో నిర్వహించిన భారీ బహిరంగ సభ ద్వారా తన రాజకీయ విధివిధానాలను ప్రకటించిన విజయ్, ఇప్పుడు 'విజిల్' గుర్తుతో ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఈ గుర్తుతోనే అన్ని స్థానాల్లో తమ అభ్యర్థులు బరిలోకి దిగుతారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. కష్టాల్లో ఉన్న వేళ 'తీపి' కబురు గత కొద్ది రోజులుగా విజయ్ వరుస ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కరూర్లో నిర్వహించిన పార్టీ కార్యక్రమ సమయంలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది ప్రాణాలు కోల్పోగా, సుమారు 100 మందికి పైగా గాయపడ్డారు. ఈ విషాద ఘటన రాజకీయంగా కలకలం రేపింది. ఈ కేసుకు సంబంధించి సీబీఐ అధికారులు ఇప్పటికే రెండు విడతలుగా విజయ్ను సుదీర్ఘంగా విచారించారు. ఈ విచారణలు కొనసాగుతున్న తరుణంలోనే, ఈసీ నుంచి పార్టీకి గుర్తు కేటాయించడం విజయ్ వర్గానికి పెద్ద ఊరటనిచ్చింది.

## గ్రీన్ లాండ్ అంశంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ క్లారిటీ

గ్రీన్లాండ్ అంశంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్పష్టత ఇచ్చారు. రష్యాలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఈ వివాదంతో తమకు ఎటువంటి సంబంధం లేదని తేల్చి చెప్పారు. గ్రీన్లాండ్ ప్రస్తుతం డెన్మార్క్ పాలనలో ఉన్న స్వయం ప్రతిపత్తి కలిగిన భూభాగమన్నారు. ఈ సమస్యను అమెరికా, డెన్మార్క్లే పరిష్కరించుకుంటాయని పుతిన్ ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రీన్లాండ్కు రష్యా లేదా చైనా నుంచి ముప్పు ఉందన్న ట్రంప్ ఆరోపణలను పరోక్షంగా తోసిపుచ్చుతూ.. ఈ వ్యవహారంపై తమకు ఆసక్తి లేదని పుతిన్ పేర్కొన్నారు. ఇతరుల భూభాగాలను కొనుగోలు చేయడంలో అమెరికాకు ఉన్న చరిత్రను పుతిన్ గుర్తు చేశారు. 1867లో రష్యా తన అలస్కా భూభాగాన్ని కేవలం 7.2 మిలియన్ డాలర్లకు అమెరికాకు విక్రయించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. గ్రీన్లాండ్ను కొనుగోలు చేసేందుకు సుమారు 1 బిలియన్ డాలర్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేస్తూ.. అగ్రరాజ్యం అమెరికాకు ఆ మొత్తాన్ని భరించగల ఆర్థిక సామర్థ్యం ఉందని పుతిన్ వ్యాఖ్యానించారు.

## గ్రీన్లాండ్ వ్యవహారంపై డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలను ఖండించిన రష్యాఅధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్



గ్రీన్లాండ్ వ్యవహారంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న ఆరోపణలను రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఖండించారు. గ్రీన్లాండ్ భద్రతకు రష్యా, చైనా నుండి ముప్పు ఉందన్న వాదనలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. రష్యాలో జరిగిన ఒక కార్యక్రమంలో పుతిన్ మాట్లాడుతూ.. గ్రీన్లాండ్ సమస్యతో తమకు ఎలాంటి సంబంధం లేదని, ఇది అమెరికా-డెన్మార్క్ దేశాల మధ్య వ్యవహారమని పేర్కొన్నారు. డెన్మార్క్ తన భూభాగమైన గ్రీన్లాండ్ను ఎంతో గౌరవంగా చూస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. ఇతర దేశాల భూభాగాలను స్వాధీనం చేసుకోవడం అమెరికాకు అలవాటేనని పుతిన్ ఆరోపించారు. గ్రీన్లాండ్ కొనుగోలుకు అవసరమైన ఒక బిలియన్ డాలర్లను వెచ్చించే సామర్థ్యం అగ్రరాజ్యానికి ఉందని.. గతంలో 1867లో అలస్కాను రష్యా కేవలం 7.2 మిలియన్ డాలర్లకే అమెరికాకు విక్రయించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇక గాజా పునర్నిర్మాణం కోసం ట్రంప్ ప్రతిపాదించిన 'శాంతి మండలి'పై పుతిన్ కీలక ప్రకటన చేశారు. తాము ఈ మండలిలో చేరే అంశాన్ని ఇంకా పరిశీలిస్తున్నామని పుతిన్ స్పష్టం చేశారు. వ్యూహాత్మక భాగస్వాములతో చర్చించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఒకవేళ మండలిలో శాశ్వత సభ్యత్వం దక్కితే.. అమెరికా గతంలో స్తంభింపజేసిన రష్యా ఆస్తుల నుండి ఒక బిలియన్ డాలర్లను విరాళంగా ఇచ్చేందుకు సిద్ధమని ప్రకటించారు.

## సింగరేణిపై కేంద్ర ప్రభుత్వం ఏ రోజు ప్రత్యక్ష ఆజమాయిషీ చేయలేదు: కిషన్ రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం ఈ కోల్ బ్లాక్కు సంబంధించి వేలం నిర్వహించలేకపోతే, కేంద్ర ప్రభుత్వానికి అప్పగిస్తే, పారదర్శకంగా ఆక్షన్ నిర్వహించి సింగరేణికి కేటాయించేందుకు పూర్తిగా సిద్ధంగా ఉందనీ కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు.సింగరేణిపై ఏ రోజు కూడా కేంద్ర ప్రభుత్వం ప్రత్యక్ష ఆజమాయిషీ చేయలేదని స్పష్టం చేశారు.హైదరాబాద్ లోని బీజేపీ కార్యాలయం లో ఆయన మీడియాతో మాట్లాడారు. గత బి.అర్.ఎస్ పాలనలో సింగరేణిపై కేసీఆర్ కుటుంబ ఆధిపత్యం వల్ల నష్టాల్లోకి వెళ్లిందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో అయినా, ఎన్డీయే ప్రభుత్వంలో అయినా, ఎప్పుడూ కేంద్రం జోక్యం లేదని చెప్పారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాష్ట్ర సాధన కోసం సింగరేణి కార్మికులు వీరోచిత పోరాటం చేశారని అన్నారు.లాభాల్లో ఉన్న సింగరేణి, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత క్రమంగా సమస్యల్లో చిక్కుకుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. సంస్థలో తెలంగాణ రాష్ట్రానికి 51 శాతం, కేంద్రానికి 49 శాతం వాటా ఉన్నప్పటికీ, అనేక సంవత్సరాలుగా పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోనే ఉందని చెప్పారు.రోజు అనేక టెండర్లు వస్తుంటాయని , టెండర్లలో ఏ నియమాలు పెట్టారన్నది కూడా కేంద్రానికి తెలియజేయరని అన్నారు.బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబం పూర్తిగా సింగరేణిపై అజమాయిషీ చేసిందని అందుకే బోర్డు కేవలం నామమాత్రంగా మారిందనీ కిషన్ రెడ్డి అన్నారు. బైట్ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలలో భాగమే ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ అని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ లో ఆయన మీడియా తో మాట్లాడుతూ గతంలో బి.అర్.ఎస్ అధికారంలో కొనసాగిన కాలంలో అనేకమంది ఫోన్లు టాప్ చేశారన్న ఆరోపణలు ఉన్నాయని చెప్పారు.దీనిపై విచారణ జరుపుతామని ఎన్నికలకు ముందే కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని కిషన్ రెడ్డి గుర్తు చేశారు.ఇక సింగరేణి వ్యవహారంలో సీబీఐ విచారణ అడిగే నైతిక హక్కు బి ఆర్ ఎస్ కు లేదన్నారు.రాష్ట్రంలో సీబీఐ విచారణ జరగకుండా అసెంబ్లీ లో ఆనాడు బి.అర్.ఎస్ చట్టం తీసుకువచ్చిందన్నారు.

## యాదాద్రి భువనగిరి జిల్లాలో గోబర్ గ్యాస్ ప్లాంట్

యాదాద్రి భువనగిరి జిల్లాలో గోబర్ గ్యాస్ ప్లాంట్లతో గిరిజన తండాల్లో ఆర్థిక స్వావలంబన సాధిస్తున్న మహిళలు ప్రతినెల 1000 రూపాయల అదనపు ఖర్చును తగ్గించుకుంటున్న గిరిజన మహిళలపై దూరదర్శన్ అందిస్తున్న ప్రత్యేక కథనం...మారు మూల ప్రాంతాల్లో నివసిస్తున్న.గిరిజన తండాల్లో గోబర్ గ్యాస్ మంచి ఫలితాలను ఇస్తుంది. వ్యవసాయం చేస్తూ పశు పోషణ చేస్తున్న వారు గోబర్ గ్యాస్ వినియోగించడం వల్ల ఆర్థికంగా బలపడడానికి చక్కటి అవకాశంగా ఉపయోగపడుతుంది.. వాయిస్ ఓవర్: ఎంతటి వారైనా వంట చేసుకోవడానికి ఉపయోగించేది గ్యాస్ ఆ గ్యాస్ ధర రోజురోజు డిమాండ్ తో పాటు ధర కూడా పెరుగుతూ వస్తుంది గ్యాస్ను వాడాలంటేనే భయపడే రోజులు. అలాంటిది ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తుంటారు అందులో గోబర్ గ్యాస్ మంచి ఫలితాలను ఇస్తుంది అనడానికి ఇది చక్కటి ఉదాహరణ ప్రతి రోజు కేవలం 20 కిలోల పేడను ఉపయోగించి ఆ ఇంటికి సరిపోయే వంట గ్యాస్ ను ఉత్పత్తి చేసుకోగలుగుతున్నారు తిరిగి అదే పేడను వ్యవసాయానికి సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది. గ్యాస్ తీసుకురావాలంటే 15 20 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తుందని వంట మధ్యలో గ్యాస్ అయిపోతే ఇబ్బంది పడే వారమని ఇంట్లో ఎవరూ మగ వాళ్ళు లేనట్లయితే గ్యాస్ తెచ్చుకోవడం కష్టంగా ఉండేదని కానీ ఇప్పుడు ఆ ఇబ్బందులు ఏవి లేవని గోబర్ గ్యాస్ వల్ల ఇంటికి సరిపడే వంట చేసుకోగలుగుతున్నామని ప్రతినెల 1000 నుండి 1200 రూపాయల వరకు ఖర్చు తగ్గించుకోగలుగుతున్నామని ఇది తమకు ఎంతో చక్కగా ఉపయోగపడుతుందని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఒక స్వచ్ఛంద సంస్థ సుమారు 60 వేల రూపాయల ఖర్చుతో కూడుకున్న గోబర్ గ్యాస్ ప్లాంట్ ను అభరచడం చేశారు.

## 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యం.. దావోస్ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి




2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌లో భాగస్వామిగా ఉండేందుకు వరల్డ్ ఎకనామిక్ ఫోరం ముందుకొచ్చింది. దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో ఏర్పాటు చేసిన తెలంగాణ పెవిలియన్‌లో సీఎం రేవంత్ రెడ్డి.. వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ మేనేజింగ్ డైరెక్టర్ జెరెమీ జర్గెన్స్, C4IR నెట్‌వర్క్ కోఆర్డినేషన్ హెడ్ మంజు జార్జ్‌లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ విజన్ లక్ష్యాలతో పాటు వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ఫాలో అప్ సదస్సు నిర్వహించే ప్రతిపాదనలను చర్చించారు. ప్రతి ఏడాది జులైలో హైదరాబాద్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఫాలో-అప్ సమావేశం నిర్వహించాలని ప్రతిపాదించారు. జనవరిలో జరిగే దావోస్‌లో జరిగే సదస్సులోని చర్చలు, తీసుకున్న నిర్ణయాల పురోగతిని సమీక్షించుకునేందుకు ఫాలో అప్ సమావేశం ఉపయోగపడుతుందన్నారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం భాగస్వామ్యంతో ఫాలో అప్ సదస్సు నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సీఎం ప్రతిపాదనకు వరల్డ్ ఎకనమిక్ ఫోరం బృందం సానుకూలంగా స్పందించింది. వివిధ దేశాల నుంచి ప్రతిపాదనలు వచ్చినప్పటికీ.. సమీప భవిష్యత్తులో నిర్ణయం తీసుకుంటామని మేనేజింగ్ డైరెక్టర్ జెరెమీ జర్గెన్స్ తెలిపారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మూడు జోన్ల నమూనాను విశ్లేషించారు. CURE, PURE, RARE ఆర్థిక అభివృద్ధి వ్యూహంతో పాటు భారత్ ఫ్యూచర్ సిటీ ఏర్పాటును వివరించారు. ఇది నెట్-జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టుగా, దేశంలో సుస్థిర అభివృద్ధికి రోల్ మోడల్ సిటీగా నిలుస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధుల ప్రతిపాదనలు, అవకాశాలను సావధానంగా విన్న WEF మేనేజింగ్ డైరెక్టర్ జెరెమీ జర్గెన్స్.. తెలంగాణ విజన్‌లోని విభిన్న కోణాలు .. పరస్పర సహకారానికి అవకాశం కల్పించేలా ఉన్నాయని ప్రశంసించారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ లో తాము భాగస్వామ్యం పంచుకుంటామన్నారు. తెలంగాణ ఆర్థిక వృద్ధి ప్రయాణంలో కలిసి వస్తామనే సంకేతాలు ఇచ్చారు. హైదరాబాద్లో ప్రతిభావంతమైన మానవ వనరులున్నాయని అభిప్రాయపడ్డారు.

## కేపీహెచ్బీ వద్ద నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఆవిష్కరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

**కాంగ్రెస్ పార్టీలో సైతం మహాత్మా గాంధీ, జవహర్లాల్ నెహ్రూ కంటే గొప్ప పేరు ఉండడంతో పాటు జననం తప్ప మరణం లేని గొప్ప నాయకుడు ఎవరైనా ఉన్నారు అంటే అది సుభాష్ చంద్రబోస్ అని అన్నారు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామ్ చందర్రావు. ఛత్రపతి శివాజీ ధర్మ రక్షణ సేన వ్యవస్థాపకుడు కర్ర వేణుగోపాల్ ఆధ్వర్యంలో కూకట్ పల్లి కేపి.హెచ్.బి కాలనీ రోడ్డు నెంబర్ 1 వద్ద ఏర్పాటు చేసిన సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఆయన ప్రారంభించి జయంతి సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో ఆజాద్ హింద్ ఫౌజ్ అని ఏర్పాటు చేసి దేశాన్ని ఒక్కతాటిపైకి తీసుకొని వచ్చి బ్రిటీషర్లపై పోరు చేసేలా చర్యలు చేపట్టారని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ తీసుకున్న వికసిత భారత్ నిర్ణయాన్ని సుభాష్ చంద్రబోస్ ఆలోచనల నుంచి స్వీకరించడం జరిగిందని అన్నారు. దేశంలోని యువతకు రానున్న నూతన తరానికి ఆయన స్ఫూర్తి ఎంతో మేలు చేస్తుందని ఆ విధంగానే యువత కూడా ఆలోచనలతో అడుగులు వేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు, నియోజకవర్గ ఇన్చార్జ్ మాధవరం కాంతారావు, బిజెపి నేతలు తదితరులు పాల్గొన్నారు.**

## లోయలో పడిన ఆర్మీ వాహనం.. నలుగురు జవాన్లు మృతి



**జమ్మూకశ్మీర్లోని దోడా జిల్లాలో గురువారం భారీ రోడ్డు ప్రమాదం జరిగింది. భదేర్వాహ్చంబా రోడ్డులోని ఖన్నీ పర్వత ప్రాంతంలో భద్రతా సిబ్బందితో ప్రయాణిస్తున్న ఒక ఆర్మీ వాహనం అదుపుతప్పి లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో నలుగురు సైనికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. వారిని చికిత్స నిమిత్తం ఉదంపూర్ మిలిటరీ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమయంలో బుల్లెట్ ప్రూఫ్ వాహనంలో మొత్తం 17 మంది సిబ్బంది ఉన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే భారత సైన్యం. స్థానికపోలీసులు సంయుక్తంగా రంగంలోకి దిగి రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. క్షతగాత్రులను లోయ నుంచి బయటకు తీసి సకాలంలో ఆసుపత్రికి చేరవేసేందుకు చర్యలు తీసుకున్నారు.**

## దావోస్ వేదిక  ఉపయోగకరం

 ప్రపంచ పారిశ్రామిక రంగంలో వస్తున్న మార్పులు, పారిశ్రామికవేత్తల ఆలోచనలు తెలుసుకునేందుకు దావోస్ వేదిక  ఉపయోగకరమని ఆంధ్రప్రదేశ్  ముఖ్యమంత్రి  నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ముఖ్యమంత్రితో టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్ గురువారం మర్యాదపూర్వకంగా సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్పందిస్తూ...మూడు రోజుల పాటు నిర్వహించిన వేర్వేరు సమావేశాల ద్వారా గ్రీన్ ఎనర్జీ, సాంకేతికత, కృత్రిమ మేధా -ఏఐ, వ్యవసాయం, పర్యాటకం వంటి  రంగాల్లో రాష్ట్రం సాధిస్తున్న అభివృద్ధిని వివరించారు.ఇక నాలుగు రోజుల దావోస్ పర్యటన ముగించుకుని  ముఖ్యమంత్రి భారత్ బయల్దేరారు. శుక్రవారం ఉదయం హైదరాబాద్కు చేరుకుంటారు. అనంతరం అక్కడి నుంచి అమరావతి రాష్ట్ర సచివాలయానికి వెళ్తారని అక్కడ నిర్వహించే రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో పాల్గొంటారని అధికారులు తెలిపారు.

## ప్రపంచంలోనే రెండో రద్దీ నగరం బెంగళూరు



ట్రాఫిక్ కష్టాలకు కేరాఫ్ అడ్రస్గా మారిన కర్ణాటక రాజధాని బెంగళూరు, ప్రపంచంలోనే అత్యంత రద్దీ నగరాల జాబితాలో రెండో స్థానానికి చేరింది. నెదర్లాండ్స్కు చెందిన లొకేషన్ టెక్నాలజీ సంస్థ 'టామ్టామ్' విడుదల చేసిన 2025 ట్రాఫిక్ సూచీలో కీలక విషయాలు వెల్లడయ్యాయి. మెక్సికో సిటీ ప్రపంచంలోనే మొదటి స్థానంలో నిలవగా.. భారత ఐటీ హబ్ అయిన బెంగళూరు రెండో స్థానంలో నిలిచి వాహనదారుల అవస్థలను కళ్లకు కట్టింది. టామ్టామ్ విడుదల చేసిన ట్రాఫిక్ సూచీ-2025 ప్రకారం.. బెంగళూరు నగరంలో కేవలం 10 కిలోమీటర్ల దూరం ప్రయాణించడానికి సగటున 36 నిమిషాల 9 సెకన్ల సమయం పడుతోంది. 2024తో పోలిస్తే ఈ సమయం మరో 2 నిమిషాలు పెరగడం గమనార్హం. రద్దీ వేళల్లో నగరంలో వాహనాల సగటు వేగం గంటకు కేవలం 13.9 కిలోమీటర్లకు పడిపోయింది. అంటే వాహనం కంటే వేగంగా మనిషి నడవగలడనే విమర్శలు వినిపిస్తున్నాయి.  2025, మే 17న బెంగళూరులో ట్రాఫిక్ రికార్డు స్థాయికి చేరింది. ఆ రోజు సాయంత్రం 6 గంటల సమయంలో 15 నిమిషాల ప్రయాణంలో వాహనదారులు కేవలం 2.5 కిలోమీటర్లు మాత్రమే కదలగలిగారు. సగటున ఒక బెంగళూరు వాసి ఏడాదికి 168 గంటల సమయాన్ని (అంటే సుమారు ఏడు రోజుల పాటు) కేవలం ట్రాఫిక్ జామ్లలోనే కోల్పోతున్నట్లు నివేదిక స్పష్టం చేసింది.  భారత్ లోని ఇతర నగరాల పరిస్థితి ప్రపంచంలోని టాప్-5 రద్దీ నగరాల్లో బెంగళూరుతో పాటు మహారాష్ట్రలోని పుణె (5వ స్థానం) కూడా చోటు దక్కించుకుంది. ముంబయి (18వ స్థానం), దిల్లీ (23వ స్థానం), కోల్కతా (29వ స్థానం),  జైపూర్ (30వ స్థానం)చెన్నై (32వ స్థానం). హైదరాబాద్ (47వ స్థానం)ల్లో నిలిచాయి. ప్రపంచవ్యాప్తంగా 500 నగరాల్లో సేకరించిన 3.65 ట్రిలియన్ కిలోమీటర్ల డేటా ఆధారంగా ఈ ర్యాంకులను కేటాయించారు. పెరుగుతున్న వాహనాల సంఖ్య, రోడ్ల విస్తరణ లేకపోవడం, మౌలిక సదుపాయాల పనుల జాప్యం కారణంగానే భారత్లోని మెట్రో నగరాలు ఈ జాబితాలో ముందు వరుసలో నిలుస్తున్నాయి.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్ కు సిట్ నోటీసులు

రాష్ట్రంలో సంచలనం రేపుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణను వేగవంతం చేసింది. ఇటీవలే మాజీ మంత్రి హరీశ్ రావుకు నోటీసులిచ్చిన సిట్... తాజాగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు కూడా నోటీసులిచ్చింది. గురువారం నందినగర్లోని కేటీఆర్ నివాసానికి వెళ్లిన సిట్ అధికారులు.. స్వయంగా నోటీసులు అందజేశారు. రేపు ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో విచారణ ఉంటుందని, హాజరు కావాలని నోటీసుల్లో అధికారులు పేర్కొన్నారు. ఈ కేసులో ఇప్పటికే అరెస్ట్ అయిన నిందితుల వాంగ్మూలాలు, దర్యాప్తులో వెలుగు చూసిన అంశాల ఆధారంగా కేటీఆర్ను ప్రశ్నించనున్నట్లు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నేతలు, వ్యాపారవేత్తలు, చివరకు తమ పార్టీ నేతల ఫోన్లను కూడా అక్రమంగా ట్యాప్ చేశారనే ఆరోపణలపై ప్రస్తుత ప్రభుత్వం సిట్ విచారణకు ఆదేశించింది. ఈ కేసులో ఇప్పటికే పలువురు ఉన్నతాధికారులు జైలులో ఉండగా, తాజాగా రాజకీయ నేతల వైపు దర్యాప్తు మళ్ళింది. కేటీఆర్ నివాసానికి పోలీసులు వెళ్లిన విషయం తెలియగానే పెద్ద ఎత్తున బీఆర్ఎస్ కార్యకర్తలు అక్కడకు చేరుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కేటీఆర్కు నోటీసులు అందడంపై బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు హాజరైన కేటీఆర్



ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హాజరయ్యారు. జూబ్లీహిల్స్లో పోలీస్ స్టేషన్ లో ప్రస్తుతం కేటీఆర్ విచారణ కొనసాగుతోంది. కేటీఆర్ విచారణ సందర్భంగా పోలీస్ స్టేషన్ ముందు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫోన్ అక్రమ ట్యాపింగ్ జరిగిందంటూ 2024 మార్చిలో పంజాగుట్ట పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. ప్రస్తుతం ఈ కేసును హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ నేతృత్వంలోని సిట్ దర్యాప్తు చేస్తోంది. ఈకేసు దర్యాప్తులో భాగంగానే కేటీఆర్ను అధికారులు ప్రశ్నిస్తున్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో ముగిసిన కేటీఆర్ సిట్ విచారణ

ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విచారణ ముగిసింది. దాదాపు ఏడు గంటలపాటు సిట్ అధికారులు కేటీఆర్ ను ప్రశ్నించారు. ఇటీవలే మాజీ మంత్రి హరీశ్ రావును విచారణకు పిలిచిన ప్రత్యేక దర్యాప్తు బృందం... తాజాగా బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ను విచారించింది. త్వరలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను కూడా విచారణకు పిలుస్తారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీంతో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం తీరు, దర్యాప్తులో జరుగుతున్న జాప్యంపై అధికార, ప్రతిపక్షాల మధ్య విమర్శలు, ప్రతివిమర్శల పర్వం కొనసాగుతోంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కే. తారాక రామారావు ఇవాళ ప్రత్యేక దర్యాప్తు బృందం ముందు విచారణకు హాజరయ్యారు. విచారణకు హాజరు కావాలంటూ సిట్ అధికారులు నిన్న కేటీఆర్ కు నోటీసులివ్వగా.. ఇవాళ ఉదయం 11 గంటలకు జూబ్లిహిల్స్ లోని ఏసీపీ కార్యాలయంలో జరిగిన సిట్ విచారణకు కేటీఆర్ హాజరయ్యారు. అంతకు ముందు సిట్ విచారణకు హాజరయ్యే ముందు తెలంగాణ భవన్ లో నిర్వహించిన మీడియాలో సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. తాను ఏ తప్పు చేయలేదని, ఎన్నిసార్లు విచారణకు పిలిచినా హాజరవుతానన్నారు. మంత్రుల అవినీతి, కుంభకోణాల గురించి ప్రశ్నిస్తున్నందుకే నోటీసులు జారీ చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. తన మంత్రులతో పాటు ప్రతిపక్ష నేతల ఫోన్లు కూడా ట్యాప్ చేయిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ అసమర్థతను ప్రశ్నిస్తూనే ఉంటానని కేటీఆర్ పేర్కొన్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ.. ట్యాపింగ్ వ్యవహారంలో కొంతమంది అధికారులు చట్టాన్ని అతిక్రమిస్తున్నారని, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతోందని హరీశ్ రావు విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ సీరియల్లా కొనసాగుతోందని కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శించారు. కరీంనగర్లో మాట్లాడుతూ.. సిట్ విచారణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కాలాయాపన చేస్తోందన్నారు. కేసీఆర్ కుటుంబసభ్యులను అరెస్ట్ చేసే ధైర్యం ఈ ప్రభుత్వానికి లేదన్నారు. . దేశభద్రత కోసం జరిగే ట్యాపింగ్కు.. తెలంగాణలో జరిగిన ఫోన్ ట్యాపింగ్కు సంబంధమే లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సిట్ అధికారులకు స్వేచ్ఛనివ్వడం లేదని బండి సంజయ్ ఆరోపించారు. కాగా.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు ఆరోపించారు. కాగా... ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ప్రభుత్వ తీరును కాంగ్రెస్ నేతలు సమర్థించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. రాజ్యాంగం ప్రకారమే విచారణ జరుగుతోందని, రాజకీయ కక్ష్య సాధింపు ధోరణి ఉంటే అధికారంలోకి రాగానే చర్యలు ఉండేవన్నారు. ఫోన్ ట్యాపింగ్ ను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య దుర్మార్గపు చర్యగా పేర్కొన్నారు. అధికారం కోసం కల్వకుంట్ల కుటుంబం ఎంతటి దారుణానికైనా పాల్పడుతుందని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ కారణంగానే హరీశ్ రావుకు మంత్రిపదవి దక్కలేదని, ఈటల రాజేందర్ ను పార్టీని వీడాల్సి వచ్చిందని ఆరోపించారు. సిట్ దర్యాప్తు విషయంలో ప్రభుత్వ జోక్యం ఉండదని ఐలయ్య పేర్కొన్నారు. 2024 మార్చిలో పంజాగుట్ట ఠాణాలో నమోదైన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు.. అందుబాటులో లేకపోవడంతో రెండేళ్లుగా విచారణ ముందుకు సాగలేదు. గతేడాది జూలైలో ఆయన ఇండియాకు రావడంతో సిట్.. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణను వేగవంతం చేసింది. ఇందులో భాగంగానే హరీశ్ రావుతోపాటు కేటీఆర్ ను విచారణకు పిలిచారు. రానున్న రోజుల్లో కేసు విచారణ ఇంకెన్ని మలుపులు తిరుగుతుందో చూడాలి.

## కుంభమేళాను తలపించేలా గోదావరి పుష్కరరాలు

కుంభమేళాను తలపించేలా గోదావరి పుష్కరాలను నిర్వహించాలని, అధికార యంత్రాంగం ఇందుకు సిద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. పుష్కరాలకు సంబంధించిన పనులను అన్ని శాఖలు పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పుష్కరాలపై సమీక్షా సమావేశాన్ని ఆయన నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జులై 7వ తేదీ వరకూ జరగనున్న పుష్కరాలకు దేశ, విదేశాల నుంచి 10 కోట్ల మంది పుష్కర పుణ్య స్నానాలు ఆచరించేందుకు వచ్చే అవకాశం ఉన్నందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. అందుకు తగినట్లు వసతులు కల్పించాలని ఆదేశించారు. రాష్ట్రంలోని పోలవరం, ఏలూరు, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల్లో 212 కిలో మీటర్ల మేర గోదావరి నది ప్రవహిస్తున్నందున.. ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతోనూ వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడారు.

## నాగోబా ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ.22 కోట్ల నిధులు మంజూరు: మంత్రి కొండా సురేఖ

యాంకర్ పార్ట్ : గిరిజనుల ఆరాధ్య దైవం నాగోబా ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం 22 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసినట్లు రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రకటించారు. ఈ నిధులతో మౌలిక వసతులను కల్పించడంతోపాటు ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పించనున్నట్లు చెప్పారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ లోని నాగోబా ఆలయాన్నిసందర్శించిన మంత్రి సురేఖ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గిరిజన దర్బార్ లో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పలువురు గిరిజనులకు మంత్రికి అర్జిలను అందజేశారు. వాయిస్ ఓవర్ : అటవీ భూముల సమస్యలు, పోడు భూముల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. అటవీ ప్రాంతాలు రహదారులు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వంటి సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ లో కొనసాగుతున్న నాగోబా జాతర సందర్భంగా మంత్రి సురేఖ నాగోబా ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మెస్రం వంశీయులు మంత్రిని సత్కరించి జ్ఞాపికను బహూకరించడంతోపాటు ఆలయ విశిష్టత గురించి మంత్రికి వివరించారు. అనంతరం జాతరలో భాగంగా నిర్వహించిన గిరిజన దర్బార్ లో మంత్రి సురేఖ పాల్గొని గిరిజనుల నుండి అర్జిలను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దర్బార్ లో అందిన అర్జిల పరిష్కారం కోసం ఐటిడిఏ ప్రాజెక్టు అధ్యక్షత త్రిసభ్య కమిటిని వేసి వాటన్నింటిని పరిశీలించాలని కలెక్టర్ కు సూచించారు. శాఖల వారిగా సమస్యలను గుర్తించి, జిల్లా స్థాయిలో పరిష్కారమయ్యే వాటిని ఇక్కడే పరిష్కరించి, రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో పరిష్కరించాల్సిన వాటిని తమకు పంపించాలని అన్నారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే అటవీ సంబంధ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ఉన్నవాటిని పరిష్కరించి, కేంద్రం పరిధిలో ఉన్నవాటి పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామన్నారు. బైట్ : కొండా సురేఖ, రాష్ట్ర మంత్రి ఖానాపూర్ శాసన సభ్యుడు వెడ్మ బొజ్జు అధ్యక్షతన జరిగిన ఈ దర్బార్ లో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పి అఖిల్ మహాజన్, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మట్, మెస్రం వంశ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ కు చెందిన చిన్నారులు, గిరిజన కళాకారులతోపాటు భద్రాచలం, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుండి వచ్చిన కళాకారులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నారు.

## కామారెడ్డి జిల్లా అంతంపల్లిలో కోతులపై విషప్రయోగం.. 15 కోతులు మృతి

ఇటీవల కాలం లో కామారెడ్డి జిల్లాలో మూగజీవాలపై విష ప్రయోగం జరుగుతుంది.మాచారెడ్డి ఘటనలో ఆరు వందల శునకాలకు విషమిచ్చి అంతమొందించిన ఘటన మరువక ముందే మరోసారి కోతలపై విష ప్రయోగం చేశారని జంతు ప్రేమికులు పేర్కొన్నారు. వాయిస్ :కామారెడ్డి జిల్లా అంతంపల్లి లో హనుమంతునికి ప్రతి రూపంగా భావించే కోతలపై విషప్రయోగం జరిగింది.మూగజీవాలైన కోతులపై గుర్తు తెలియని వ్యక్తులు విష ప్రయోగం చేశారు. ఆపై, మరణించిన, అపస్మారక స్థితికి చేరుకున్న పదుల సంఖ్యలో కోతులను రోడ్డు పక్కన పారేసి వెళ్లిపోయారు. కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలంలోని అంతంపల్లి గ్రామ శివారులో ఈ ఘటన జరిగింది. అంతంపల్లి గ్రామ శివారులో 44వ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న సర్వీస్ రోడ్డుపై 25 కోతులు నిర్జీవంగా పడి ఉండడాన్ని స్థానికులు పరిశీలించగా వాటిలో 15 కోతులు మరణించగా మిగిలినవి మైకంలో ఉన్నాయి. స్థానికుల సమాచారంతో పశువైద్య సిబ్బంది ఆ కోతులను పరిశీలించి, మత్తు వదలడానికి వాటికి ఇంజక్షన్లు చేశారు. ఇక, మరణించిన కోతులను స్థానికులు సమీపంలో పూడ్చి పెట్టారు. కాగా, కోతులను ఎక్కడో పట్టుకుని వచ్చి తమ గ్రామం వద్ద వదిలేస్తున్నారని, అటవీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని సర్పంచ్ మంజుల ఆవేదన వ్యక్తం చేశారు.

## ములుగు జిల్లా మేడారం సమ్మక్క సారలమ్మ జాతరలో భక్తుల సందడి

మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరలో భక్తుల సందడి నెలకొంది ప్రధాన ఘట్టం మండమెలిగే పండుగను నిన్న బుధవారం ఘనంగా నిర్వహించారు. కన్నెపల్లిలోని సారలమ్మ గుడిలో జరిగిన మెలిగి పండుగ లో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పాల్గొన్నారు. ఇక వనదేవతలను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వస్తూ సమ్మక్క సారలమ్మ అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకుంటున్నారు సమ్మక్క సారలమ్మల మహిమ గొప్పదని కోరిన కోరికలు తీర్చే తల్లులని, జాతర ఏర్పాట్లు బాగున్నాయని వివిధ జిల్లాల నుంచి జాతరకు వచ్చిన భక్తులు అంటున్నారు. పాల్వంచ నుంచి వచ్చిన భక్తురాలు ఉమాదేవి మాట్లాడుతూ... మా పిల్లల చిన్నతనం నుంచి ఈ జాతరకు వస్తున్నామని అనుకున్న కోరికలు నెరవేడుతున్నాయని, ఈ అమ్మ మహిమ చాలా గొప్పదని, మా పిల్లల ఎత్తు బంగారం అమ్మవార్లకు సమర్పించామని ఉమాదేవి న్నారు. మంచిర్యాల సింగరేణి నుంచి వచ్చిన భక్తురాలు లలిత శ్రీ మాట్లాడుతూ... ఈ అమ్మవారి గురించి చెప్పాలంటే ఒక్క మాటలో తీరిపోయేది కాదని, ఈ సమ్మక్క సారలమ్మ దైవాలు సన్నిధి ప్రభుత్వ చొరవతో కన్నుల పండుగగా కనిపిస్తుందని, మూడు నాలుగు రోజులు జరుపుకునే పండుగ నెల రోజుల నుంచి పండగ వాతావరణం ఉందని, ఇప్పటికే నేను మూడుసార్లు దర్శనానికి వచ్చానని భక్తురాలు లలిత శ్రీ అన్నారు.

## అమృత్ భారత్ ఎక్స్ప్రెస్

తెలంగాణకు అమృత్ భారత్ ఎక్స్ప్రెస్ను కేటాయిస్తూ రైల్వేశాఖ నిర్ణయం తీసుకుంది. చర్లపల్లి జంక్షన్ నుంచి తిరువనంతపురం మధ్య సూపర్ ఫాస్ట్ రైలును కేటాయించింది. కేరళలోని తిరువనంతపురం నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రైలును శుక్రవారం ప్రారంభించనున్నారు. ఈ అమృత్ భారత్ రైలు తెలంగాణలో నల్గొండ, మిర్యాలగూడ.. ఆంధ్రప్రదేశ్లోని సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట స్టేషన్లలో ఆగనుంది.ఈ రైలు తిరువనంతపురంలో ఉదయం 10.45 గంటలకు ప్రారంభమై.. చర్లపల్లికి మరుసటి రోజు సాయంత్రం 4.30 గంటలకు చేరుకుంటుంది. తెలంగాణకు మరో అమృత్ భారత్ ఎక్స్ప్రెస్ కేటాయించడం పట్ల.. ప్రధానమంత్రి కేంద్రమంత్రి కిషన్రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## రానున్న 18 నెలల్లో 'భారతీయ మొబైల్ బ్రాండ్లు': కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్

స్విట్జర్లాండ్లోని దావోస్లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సులో కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్.. భారత మొబైల్ రంగంపై కీలక ప్రకటన చేశారు. భారత్ ఇప్పుడు కేవలం మొబైల్ ఫోన్ల తయారీలోనే కాకుండా, సొంత బ్రాండ్లను ప్రపంచానికి పరిచయం చేసే దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు. మరో 12 నుండి 18 నెలల కాలంలో భారతదేశానికి చెందిన స్వదేశీ మొబైల్ బ్రాండ్లు మార్కెట్లోకి వస్తాయని కేంద్ర మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. గత కొన్నేళ్లుగా దేశంలో ఎలక్ట్రానిక్స్ తయారీ వ్యవస్థ గణనీయంగా బలోపేతం అయ్యిందని, ఇప్పుడు మన స్వంత బ్రాండ్లను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడానికి ఇది సరైన సమయమని ఆయన పేర్కొన్నారు. మొబైల్ తయారీకి అవసరమైన వేలాది ప్రక్రియలు, విడిభాగాల తయారీపై కేంద్రం ఇప్పటికే పూర్తి స్థాయిలో కసరత్తు పూర్తి చేసిందని తెలిపారు. 2025 ఆర్థిక సంవత్సరంలో కేవలం యాపిల్ కంపెనీయే భారత్ నుండి 50 బిలియన్ డాలర్ల విలువైన ఐఫోన్లను ఎగుమతి చేసిందని, ఇది భారతదేశ తయారీ సామర్థ్యానికి నిదర్శనమని చెప్పారు. ప్రపంచంలో మొబైల్ ఫోన్ల తయారీలో భారత్ ఇప్పటికే రెండవ అతిపెద్ద దేశంగా అవతరించిందన్నారు. ప్రస్తుతం దేశంలో విక్రయించబడే మొబైల్ ఫోన్లలో 99.2%శాతం 'మేడ్ ఇన్ ఇండియా'వే కావడం విశేషం. మొబైల్ తయారీ రంగం ద్వారా గత దశాబ్ద కాలంలో సుమారు 12 లక్షల ఉద్యోగాలు లభించాయని మంత్రి వివరించారు.

## కేరళ రాజకీయాల్లో మార్పు మొదలైంది: ప్రధాని మోదీ



కేరళ రాజకీయాల్లో మార్పు మొదలైందని, రాబోయే ఎన్నికలు రాష్ట్ర గమనాన్ని మారుస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. తిరువనంతపురంలో జరిగిన భారీ ర్యాలీలో మోదీ ప్రసంగిస్తూ... ఇటీవల తిరువనంతపురం కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ సాధించిన చారిత్రాత్మక విజయాన్ని ప్రస్తావించారు. గుజరాత్ తరహా రాజకీయం ఇక్కడ పునరావృతం కాబోతోందని చెప్పారు. 1987లో గుజరాత్లో అహ్మదాబాద్ కార్పొరేషన్ గెలుపుతో మొదలైన ప్రస్థానం ఆ రాష్ట్ర రూపురేఖలను ఎలా మార్చిందో.. ఇప్పుడు తిరువనంతపురం గెలుపు కేరళలో అదే మార్పునకు పునాది అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శబరిమల అయ్యప్ప ఆలయంలో జరిగిన బంగారు చోరీ వ్యవహారంపై ప్రధాని స్పందించారు. భక్తుల మనోభావాలను ఎల్డీఎఫ్ ప్రభుత్వం దెబ్బతీస్తోందని ఆరోపించారు. కేరళలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడగానే శబరిమల స్వర్ణ చౌర్యంపై సమగ్ర విచారణ జరిపిస్తామని, దోషులను జైలుకు పంపిస్తామని హామీ ఇచ్చారు. ఇది 'మోదీ గ్యారెంటీ' అని ఆయన స్పష్టం చేశారు. ఎల్డీఎఫ్, యూడీఎఫ్ కూటములు అవినీతి, బుజ్జగింపు రాజకీయాలతో రాష్ట్రాన్ని నాశనం చేశాయని.. అభివృద్ధి, సుపరిపాలనే లక్ష్యంగా ఉన్న బీజేపీని మూడో ప్రత్యామ్నాయంగా ఎంచుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

## 71 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు

రాష్ట్రంలో 71 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రైతులకు బోనస్ గా 19 వేల కోట్ల రూపాయలను అందించామన్నారు. సూర్యాపేట జిల్లా, మట్టపల్లి గ్రామంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్ లతో కలిసి అభివృద్ధి కార్యక్రమాలను ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 85 శాతం మందికి సన్నబియ్యం అందిస్తున్నామన్నారు. అర్హులందరికీ రేషన్ కార్డులను పంపిణీ చేశామని తెలిపారు.

## సింగపూర్ గణతంత్ర వేడుకల్లో ఏపీ హస్తకళలు

: సింగపూర్లో జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్రానికి చెందిన హస్తకళల బహుమతులుగా అందజేయాలని భారత్ రాయబార కార్యాలయం నిర్ణయించింది. ఈ సందర్భంగా 400 ప్రత్యేక బహుమతుల తయారీకి లేపాక్షికి సింగపూర్లోని భారత్ రాయబార కార్యాలయం ఆదేశాలు ఇచ్చిందని రాష్ట్ర చేనేత, జౌళీ శాఖ మంత్రి ఎస్. సవిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బహుమతులలో సీతాదేవి తోలు బొమ్మలు, ఏనుగు ఆకారపు బ్యాగేజ్ ట్యాగ్, హస్త కళారూపాలు వంటివి ఉండనున్నాయి. ఆంధ్రప్రదేశ్ హస్తకళలకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు రావడం పట్ల మంత్రి సవిత హర్షం వ్యక్తం చేశారు. గతేడాది రిపబ్లిక్ డేలో రాష్ట్ర హస్తకళల శకటానికి లభించిన గుర్తింపుతో ప్రాచుర్యం మరింత పెరిగిందని తెలిపారు. విశాఖపట్నం, అనంతపురం, కడప సహా 15 లేపాక్షి దుకాణాలు ఆధునీకరణ చేపడుతున్నామని, త్వరలో ఇతర దేశాల్లోనూ లేపాక్షి దుకాణాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆమె వెల్లడించారు.

## త్వరలో పాదయాత్రను ప్రారంభించనున్న జగన్మోహన్ రెడ్డి

ఆంధ్రప్రదేశ్ లో త్వరలో పాదయాత్రను ప్రారంభించనున్నట్లు మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రకటించారు. గుంటూరు జిల్లా తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఏలూరు శాసనసభ నియోజకవర్గ పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో ఆయన నిన్న సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ, ఒకటిన్నర సంవత్సరం తర్వాత పాదయాత్ర మొదలవుతుందని . అక్కడ నుంచి ఒకటిన్నర సంవత్సరం రోడ్ల మీదే ప్రజలతో మమేమకవుతూ ప్రయాణం కొనసాగుతుందని వెల్లడించారు

## విజయవాడలో 'ఏకాత్మ మానవ దర్శన్ పునఃస్మరణ' సదస్సు

ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడలో 'ఏకాత్మ మానవ దర్శన్ పునఃస్మరణ' సదస్సు శుక్రవారం నుంచి జరగనుంది. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్రెడ్డి, బిజెపి జాతీయ సంఘటన ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, పార్టీ సీనియర్ నాయకులు రామ్ మాధవ్ పాల్గొంటారని బిజెపి పార్టీ వర్గాలు తెలిపాయి. 1965లో జరిగిన జనసంఘ్ మహాసభలలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఏకాత్మ మానవ దర్శనాన్ని పార్టీ అధికారిక మార్గదర్శక సిద్ధాంతంగా విజయవాడలోనే ప్రకటించారు. ఆ సందర్భానికి 60 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఈ పునఃస్మరణ కార్యక్రమాన్ని బిజెపి నిర్వహిస్తోంది.

## :రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యం: ఎంపీ ధర్మపురి అరవింద్

మున్సిపల్ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీని అన్ని కార్పొరేషన్ లలో, మున్సిపాలిటీలలో గెలిపించే విదంగా ముందుకు వెళ్తున్నామని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై నాయకులకు, కార్యకర్తలకు మున్సిపాలిటీ లలో గెలిచే విదంగా దిశా నిర్దేశం చేశారు. అనంతరం ఎంపీ అర్వింద్ మీడియాతో మాట్లాడుతూ అన్ని మున్సిపాలిటీ లలో బీజేపీ జెండా ఎగురవేస్తామన్నా ఆయన బి.ఆర్.ఎస్ పార్టీకి పోటీ చేసే నాయకులు దొరకడం లేదని అది బీజేపీ పార్టీకి మంచి అవకాశమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిజాయితీగా ఉంటే బి.ఆర్.ఎస్ ముఖ్య నాయకులు జైలులో ఉంటారని చెప్పారు. బి.ఆర్.ఎస్ పాలనలో ఫోన్ ట్యాపరింగ్ జరిగిందని అన్న ఆయన ముఖ్యమంత్రి ప్యాకేజీలకు అమ్ముడుపోతడా లేక నిజాయతీగా విచారణ చేస్తారా అనే దానిపై ఆధారపడి ఉంటుందన్నారు. బొగ్గు కుంభకోణానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోదని రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాస్తే తప్పకుండా విచారణ జరుపుతామని, కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ లాగా కాలయాపన చేస్తే బొగ్గు కుంభకోణం విచారణ కూడా మరో 2 సంవత్సరాలు పడుతుందన్నారు. డ్రగ్స్ తీసుకునే కె.టి.ఆర్ కు క్యారెక్టర్ లేదని ఆయనపై డ్రగ్ పేడ్లర్ కేసు, డ్రగ్ ప్రమోషన్ చేసిన కేసులు పెట్టాలని మండిపడ్డారు. జగిత్యాలలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు ఎవరికి అర్థం కావడం లేదని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ఏ పార్టీలో ఉన్నాడో అర్థం కావడం లేదని, దానికి తోడు అభివృద్ధి కోసం కాంగ్రెస్ తో పని చేస్తున్నానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ పాలనలో డబ్బులు లేవని, ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధి కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధుల ద్వారానే జరుగుతుందన్నారు. బిజెపి పార్టీలో గెలిచిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరి ఎంత అభివృద్ధి చేస్తున్నారో అర్థం అవుతుందన్నారు. వారందరూ మళ్ళీ బీజేపీ వైపు వచ్చారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జీవన్ రెడ్డి విషయంలో కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తున్న తీరు మంచిగా లేదన్నారు. జీవన్ రెడ్డి ని హింసిస్తున్న తీరును తప్పుపట్టారు. ఇంటికి వెళ్లి పరామర్శించాలని అనిపిస్తుందన్న ఆయన మున్సిపల్ ఎన్నికలు ఉన్నాయని వెళ్లడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మాజీ ఎంపీ వెంకటేష్ నేత, బీజేపీ సీనియర్ నాయకులు గుజ్జుల రామకృష్ణ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు, మాజీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జ్ భోగ శ్రావణి, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు యువతకు ఉద్యోగ నియామక ప్రతాలు అందిచనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు 18వ రోజ్‌గార్ మేళాలో వివిధ ప్రభుత్వ శాఖలు, విభాగాల్లో కొత్తగా నియమితులైన యువతకు 61 వేలకుపైగా నియామక పత్రాలను దృశ్యమాధ్యమ విధానంలో పంపిణీ చేయనున్నారు. రోజ్ గార్ మేళాలు ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకూ దేశ వ్యాప్తంగా 11 లక్షలకు పైగా నియామక పత్రాలు అందజేసినట్లు అధికారులు వెల్లడించారు. 18వ రోజ్‌గార్ మేళా దేశవ్యాప్తంగా 45 ప్రదేశాలలో నిర్వహించబడుతుందని తెలిపారు. కేంద్ర హోం, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖలు, ఆర్థిక సేవలు, ఉన్నత విద్యా విభాగాలు వంటి కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలలో వీరు బాధ్యతలు స్వీకరించనున్నారని పేర్కొన్నారు.

## చిరుధాన్యాలు పోషకాలతో నిండిన ఒక సూపర్ ఫుడ్: ప్రధాని మోదీ

చిరుధాన్యాలపై మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రస్తావించారు. చిరుధాన్యాల పట్ల ప్రజలలో ఆదరణ నిరంతరం పెరగడం చూసి తనకు చాలా ఆనందంగా ఉందన్నారు. 2023 ని మనం మిల్లెట్ ఇయర్గా జరుపుకున్నామని తెలిపారు. కానీ, నేడు మూడేళ్ల తర్వాత కూడా మిలెట్స్ పట్ల దేశంలోనూ, ప్రపంచంలోనూ కనబడుతున్న ఆసక్తి, , నిబద్ధత ఎంతో స్ఫూర్తిదాయకమైనది అని కొనియాడారు. తమిళనాడులోని కల్లకురుచి జిల్లాలో ఒక మహిళా రైతుల సమూహం ప్రేరణాత్మకంగా మారిందని ప్రధాని మోదీ తెలిపారు. ఇక్కడి పెరియ కలరాయన్ మిల్లెట్స్ ఎఫ్పీసీతో దాదాపు 800మహిళా రైతులు అనుసంధానమై ఉన్నారన్నారు. చిరుధాన్యాల పట్ల పెరుగుతున్న ప్రజాదరణను దృష్టిలో పెట్టుకుని ఈ మహిళలు మిలెట్ ప్రాసెసింగ్ యూనిట్ ని స్థాపించారని మోదీ తెలిపారు. ఇప్పుడు వారు మిలెట్స్ తో తయారైన ఉత్పాదనలను నేరుగా మార్కెట్ వరకూ చేరుస్తున్నారని పేర్కొన్నారు. రాజస్థాన్లోని రామ్సర్లో కూడా రైతులు చిరుధాన్యాలతో కొత్త ఆవిష్కరణలు చేస్తున్నారని మోదీ తెలిపారు. అక్కడి రామ్సర్ ఆర్గానిక్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ నుంచి 900 కంటే ఎక్కువ రైతులు అనుసంధానమై ఉన్నారని చెప్పారు. ఈ రైతులు ఎక్కువగా సజ్జల వ్యవసాయం చేస్తారన్నారు. అక్కడ సజ్జలను ప్రాసెస్ చేసి, రెడీ టూ ఈట్ లడ్డూలను తయారుచేస్తారని పేర్కొన్నారు. వీటికి బజారులో చాలా డిమాండ్ ఉందని మోదీ తెలిపారు. ఇటీవల కొన్ని ఆలయాలలో ప్రసాదంలో కేవలం మిల్లెట్స్ నే ఉపయోగిస్తున్నారని తెలిసి ఆనందం కలుగుతోందన్నారు. తాను ఆ ఆలయాల వ్యవస్థాపకులందరినీ ఈ ప్రయత్నానికి గాను హృదయపూర్వకంగా అభినందిస్తున్నానని మోదీ తెలిపారు. మిల్లెట్స్/ చిరుధాన్యాల వల్ల అన్నదాతల ఆదాయం పెదరగడమే కాక ప్రజల ఆరోగ్యాలు కూడా మెరుగుపడుతున్న నమ్మకం ఏర్పడుతోందని మోదీ తెలిపారు. మిల్లెట్స్ పోషకాలతో నిండిన ఒక సూపర్ ఫుడ్ అని వ్యాఖ్యానించారు. మన దేశంలో చలికాలాన్ని అన్నపానాలకు అనువైన కాలంగా పరిగణిస్తారని.. అందుకని ఈ కాలంలో మనం చిరుధాన్యాలను తినాలని ప్రధాని మోదీ సూచించారు.

## గుజరాత్లోని చందన్కీ గ్రామానికి చెందిన సంప్రదాయం ఎంతో ప్రత్యేకమైంది: ప్రధాని మోదీ

భారత్లోని ఏ ప్రాంతానికి వెళ్లినా, అక్కడ మనకు ఏదో ఒక అసాధారమైన, మునుపెన్నడూ చూడనిది, జరుగుతూ కనిపిస్తుందని ప్రధాని మోదీ తెలిపారు. ఎన్నోసార్లు మీడియా తాలుకు వెలుగు జిలుగులలో ఈ విషయాలు చోటు సంపాదించుకోలేకపోతాయని అన్నారు. కానీ, వీటివల్లనే మన సమాజంలోని నిజమైన శక్తి ఏమిటన్నది మనకు తెలుస్తుందన్నారు. ఐకమత్యమే సర్వోపరి అనే భావన కనిపించే ఇలాంటి వాటివల్లనే మన విలువలు మనకు కనిపిస్తాయని చెప్పారు. గుజరాత్ లోని బేచరాజీ తాలుకాలోని చందన్కీ గ్రామానికి చెందిన సంప్రదాయం ఎంతో ప్రత్యేకమైనదని మోదీ కొనియాడారు. ముఖ్యంగా పెద్దలు తమ ఇళ్ళలో భోజనాన్ని వండుకోరు అని తెలిసి మీరు ఆశ్చర్యపోతారని చెప్పారు. దానికి కారణం గ్రామంలోని గొప్ప కమ్యూనిటీ కిచెన్ ఉంటుందన్నారు. ఆ కమ్యూనిటీ కిచెన్లో ఒకేసారి యావత్ గ్రామానికీ సరిపడే భోజనం తయారవుతుందన్నారు. ఆ భోజనాన్ని గ్రామంలో అందరూ కలిసి ఒకేసారి తింటారని చెప్పారు. గత 15 సంవత్సరాలుగా ఈ సంప్రదాయం నిరంతరం అక్కడ కొనసాగుతోందన్నారు. అంతేకాక ఎవరైనా వ్యక్తి అనారోగ్యంతొ ఉంటే, ఆ వ్యక్తికి టిఫిన్ సర్వీస్ కూడా అక్కడ అందుబాటులో ఉంటుందని మోదీ తెలిపారు. హోమ్ డేలివరీ సదుపాయం కూడా ఉందన్నారు. గ్రామంలోని ఈ సామూహిక భోజనం ప్రజలను ఆనందంతో నింపుతుందన్నారు. ఈ ప్రయత్నం ప్రజలను ఐకమత్యంగా ఉంచడమే కాక దీనివల్ల కుటుంబపరమైన భావనలకు కూడా ప్రోత్సాహం లభిస్తుందని చెప్పారు.

## స్టార్టప్ ఇండియా ప్రయాణంపై మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రస్తావించిన ప్రధాని మోదీ

ఇటీవల తాను సోషల్ మీడియాల్లో ఒక ఆసక్తికరమైన విషయాన్ని చూస్తున్నానని మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ తెలిపారు. ప్రజలు తమ 2016 జ్ఞాపకాలను తిరిగి గుర్తుచేసుకుంటున్నారని తెలిపారు. అదే భావనతో తాను కూడా మీతో ఒక జ్ఞాపకాన్ని పంచుకోవాలనుకుంటున్నానని వ్యాఖ్యానించారు. పదేళ్ల క్రితం జనవరి 2016లో మనం ఒక ప్రగాఢమైన ప్రయాణాన్ని మొదలుపెట్టామన్నారు. ఈ ప్రయాణం చిన్నదే అయినా, ఇది యువతరానికి, దేశ భవిష్యత్తు కోసం చాలా ముఖ్యమైనదని మనకి అప్పుడు తెలుసు అన్నారు. కానీ, కొందరు మాత్రం ఇది ఎలాంటి ప్రయాణమన్నది అర్థం చేసుకోలేకపోయారని మోదీ తెలిపారు. తాను మాట్లాతుంది స్టార్టప్ ఇండియా అనే ప్రయాణాన్ని గురించి అని మోదీ తెలిపారు. ఈ అద్భుతమైన ప్రయాణానికి హీరోలు మన యువ మిత్రులే అని ప్రశంసించారు. తమ కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చి వారు కనిపెట్టిన ఆవిష్కరణలు చరిత్రలో లిఖించబడుతున్నాయని కొనియాడారు. ప్రపంచంలోని అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్ లో మన భారతదేశం నేడు మూడవ స్థానంలో ఉందన్నారు. మామూలు స్టార్టప్స్ కంటే ఈ స్టార్టప్‌లు విభిన్నంగా ఉన్నాయన్నారు. పదేళ్ల క్రితం మన ఊహకు కూడా అందనటువంటి రంగాలలో వారు ఇవాళ పనిచేస్తున్నారని అన్నారు. ఏఐ, స్పేస్, న్యూక్లియర్ ఎనర్జీ, సెమీ కండక్టర్స్, మొబిలిటీ, గ్రీన్ హైడ్రోజన్, బయోటెక్నాలజీ ఇంకా మీరు ఏ పేరు చెప్తే ఆ రంగంలో నేడు ఏదో ఒక భారతీయ స్టార్టప్ పని చేస్తూ కనిపిస్తుందన్నారు. ఏదో ఒక స్టార్టప్‌తో ముడిపడిన లేదా తమ సొంత స్టార్టప్ ను మొదలుపెట్టాలనుకుంటున్న యువమిత్రులందరికీ తాను సెల్యూట్ చేస్తున్నానని మోదీ తెలిపారు నేడు మన్ కీ బాత్ ద్వారా తాను దేశప్రజలకు, ముఖ్యంగా పరిశ్రమలు, స్టార్ట్ అప్స్  తో ముడిపడిన యువతను కోరుతున్నానని.. భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా ముందుకు వెళ్తోందని మోదీ తెలిపారు. ప్రపంచం దృష్టి భారతదేశంపై ఉందని తెలిపారు. ఇలాంటి సమయంలో మనందరిపై ఒక పెద్ద బాధ్యత కూడా ఉందన్నారు. నాణ్యతపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఈ సంవత్సరంలో మనం పూర్తి శక్తితో నాణ్యతకు ప్రాముఖ్యతను ఇద్దామని పిలుపునిచ్చారు. మనందరికీ ఒకే మంత్రం ఉండాలని అది నాణ్యత, నాణ్యత, కేవలం నాణ్యత అని పేర్కొన్నారు. నిన్నటి కంటే నేడు మెరుగైన నాణ్యత ఉండాలన్నారు. మనం ఏదైతే ఉత్పాదన చేస్తామో, దాని నాణ్యతను పెంచుదామనే తీర్మానాన్ని చేసుకుందామని చెప్పారు. టెక్స్‌టైల్, టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అయినా కేవలం ప్యాకింగ్ అయినా కూడా ఇండియన్ వస్తువు అంటే టాప్ క్వాలిటీ అనే మాట నిలిచిపోవాలని మోదీ పిలుపునిచ్చారు. అత్యుత్తమ నాణ్యత మన నిత్య గుర్తింపుగా మారాలని అన్నారు. నాణ్యతలో ఏ లోపమూ ఉండదని, నాణ్యతలో రాజీ ఏమీ ఉండదని మనం తీర్మానించుకుందామని మోదీ తెలిపారు. జీరో డిఫెక్ట్, జీరో ఎఫెక్ట్ అని నేను ఎర్రకోట నుంచి చెప్పానని గుర్తు చేశారు. ఇలా చేస్తేనే మనం అభివృద్ధి చెందుతున్న భారతదేశ ప్రయాణాన్ని మనం వేగంగా ముందుకు తీసుకువెళ్ళగలమని మోదీ పిలుపునిచ్చారు.

## భారతీయ కుటుంబ వ్యవస్థ మన సంప్రదాయంలో విడదీయలేని అనుబంధం: ప్రధాని మోదీ

భారతీయ కుటుంబ వ్యవస్థ మన సంప్రదాయంలో విడదీయలేని అనుబంధమని మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. ప్రపంచంలోని అనేక దేశాలలో దీనిని ఎంతో కుతూహలంతో చూస్తారన్నారు. ఎన్నో దేశాలలో ఇలాంటి కుటుంబ వ్యవస్థ పట్ల ఎంతో గౌరవభావం ఉందని మోదీ తెలిపారు. కొద్దిరోజుల క్రితం తన సోదరులైన యూఏఈ రాష్ట్రపతి షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నాహయాన్ భారతదేశానికి వచ్చారని తెలిపారు. 2026 సంవత్సరాన్ని  యూఏఈ ఇయర్ ఆఫ్ ఫ్యామిలీగా జరుపుకుంటోందని ఆయన చెప్పారన్నారు. అక్కడి ప్రజల మధ్య సహృదయత, సామూహిక భావన మరింత బలపరచడం దాని లక్ష్యమని.. నిజంగా ఇది ఎంతో మెచ్చుకోదగ్గ ప్రయత్నమని మోదీ తెలిపారు.

## ఓటరు ప్రజాస్వామ్యానికి ఆత్మ వంటి వాడు: ప్రధాని నరేంద్ర మోదీ

ప్రతి నెలా చివరి ఆదివారం దేశ ప్రజలతో ముచ్చటించే 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ గణతంత్ర దినోత్సవం, జాతీయ ఓటరు దినోత్సవం, పదేళ్ల జ్ఞాపకాల ట్రెండ్పై ముచ్చటించారు. 2026 సంవత్సరంలో ఇది మొదటి మన్ కీ బాత్ కార్యక్రమం అని పేర్కొన్నారు. జనవరి 26న గణతంత్ర దినోత్సవం జరుపుకుంటామని.. ఇదే రోజున భారతదేశ రాజ్యాంగం అమలులోకి వచ్చిందని చెప్పారు. ఈ జనవరి 26వ తేదీ మనం మన రాజ్యాంగ నిర్మాతలకు నమస్కరించే అవకాశాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. జనవరి 25వ తేదీ కూడా చాలా ముఖ్యమైనదని.. ఇవాళ "నేషనల్ వోటర్స్ డే", అంటే ఓటర్ల దినోత్సవం. ఓటరు ప్రజాస్వామ్యానికి ఆత్మ వంటివాడు అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. 18ఏళ్లు నిండి ఓటరుగా మారాక, అది జీవితంలో ఒక సాధారణ అంశంగా మారుతుందని ప్రధాని మోదీ తెలిపారు. కానీ, నిజానికి ఈ అవకాశం ఏ భారతీయుడి జీవితంలోనైనా ముఖ్యమైన మైలురాయిగా మారుతుందని చెప్పారు. మనం దేశంలో ఓటరుగా మారాకా, ఓటరుగా మారినందుకు ఉత్సవాన్ని జరుపుకోవాలని తెలిపారు. పుట్టినరోజున శుభాకాంక్షలు తెలిపినట్లు, పుట్టినరోజుని పండుగలా జరుపుకున్నట్లు, ఎవరైనా యువకుడు మొదటిసారి ఓటరుగా మారాకా మొత్తం కాలనీ, గ్రామం, లేదా నగరంలో అందరూ కలిసి ఆ మొదటిసారి ఓటరుగా మారిన వారిని అభినందించాలని తెలిపారు. దీంతో ప్రజలకు ఓటింగ్ పట్ల అప్రమత్తత పెరుగుతుందని.. ఒక ఓటరుగా మారడం ఎంత ముఖ్యమైన విషయమో వారికి అర్థమవుతుందన్నారు. దేశంలో ఎవరైతే ఓటింగ్ ప్రక్రియలో భాస్వాములు అవుతారో.. మన ప్రజాస్వామ్యాన్ని సజీవంగా ఉంచడానికి ప్రాథమిక స్థాయి నుంచీ తోడ్పడతారో వారందరినీ తాను మెచ్చుకోవాలని అనుకుంటున్నానని మోదీ తెలిపారు. నేడు "ఓటరు దినోత్సవం" సందర్భంగా మన యువ మిత్రులను, వారికి 18 సంవత్సరాలు నిండగానే ఓటరుగా తమని తాము నమోదు చేయించుకోవాల్సిందిగా మరోసారి కోరుతున్నానని మోదీ తెలిపారు. దీంతో ప్రతి పౌరుడూ ఏ కర్తవ్య భావననైతే పాటించాలని రాజ్యాంగం కోరుకుంటుందో.. అది సంపూర్ణమవుతుందన్నారు. దీనివల్ల భారతదేశ ప్రజాస్వామ్యమూ బలోపేతం అవుతుందని మోదీ తెలిపారు.

## పశ్చిమ బెంగాల్లో ఫరీద్పూర్ గ్రామంలో వివేకానంద లోక్ శిక్షానికేతన్ సంస్థపై మోదీ ప్రశంసలు

: ఎన్నో ఏళ్ళుగా నిస్వార్థ భావంతో సమాజసేవలో నిమగ్నమైన అనేక సంస్థలు మన దేశంలో ఉన్నాయని మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. అలాంటి ఒక సంస్థ పశ్చిమ బెంగాల్ లోని తూర్పు మేదినీపూర్ లోని ఫరీద్పూర్లో ఉంది. దాని పేరు వివేకానంద లోక్ శిక్షానికేతన్. ఈ సంస్థ గత నాలుగు దశాబ్దాలుగా పిల్లల, పెద్ద సంరక్షణలో నిమగ్నమై ఉందన్నారు.. గురుకుల పద్ధతిలో విద్యను అందించడంతో పాటూ, టీచర్స్ ట్రైనింగ్తో పాటు సమాజ శ్రేయస్సు ను అందించే అనేక మంచి పనులను ఈ సంస్థ చేస్తూ ఉంటుందని ప్రశంసించారు. ఈ నిస్వార్థ సేవాభావం దేశప్రజల మధ్య నిరంతరం మరింత శక్తివంతంగా మారాలని తాను కోరుకుంటున్నానని మోదీ తెలిపారు. కుటుంబం, సమాజం - రెండింటి శక్తి కలిసినప్పుడు మనం ఎంత బలమైన సమస్యనైనా చిత్తు చెయ్యగలమని మోదీ తెలిపారు. తనకు అనంతనాగ్ లోని షేక్ గుండ్ గ్రామం గురించి తెలిసిందన్నారు. అక్కడ డ్రగ్స్, తంబాకూ, సిగరెట్ , తాగుడుతో ముడిపడిన సమస్యలు బాగా పెరిగిపోయాయన్నారు. వీటన్నింటిని చూసి అక్కడ నివసించే మీర్ జాఫర్ ఎంతో కంగారుపడి, ఆ సమస్యను నిర్మూలించాలని కంకణం కట్టుకున్నారని మోదీ తెలిపారు. ఆయన గ్రామంలోని యువత నుంచీ ముసలివారి వరకూ అందరినీ ఒకచోట చేర్చారన్నారు. వారి ఈ ప్రయత్నం వల్ల అక్కడి దుకాణాలు తంబాకూని అమ్మడమే మానేశాయన్నారు. ఈ ప్రయత్నం వల్ల డ్రగ్స్ వల్ల కలిగే ప్రమాదాల గురించి ప్రజలలో అప్రమత్తత పెరిగిందని మోదీ తెలిపారు.

## :దేశ సంస్కృతికి భజనలు, కీర్తనలు ఆత్మగా నిలిచాయి: ప్రధాని మోదీ

భారత్‌లో భజనలు,కీర్తనలు శతాబ్దాలుగా దేశ సంస్కృతికి ఆత్మగా నిలిచాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. మనం ఆలయాలలో భజనలు విన్నాము. హరికథలు వినేప్పుడూ భజనలు విన్నాము, ప్రతి కాలంలోనూ భక్తిని కాలానుగుణంగా జీవించామన్నారు. నేటి తరం వారు కూడా కొన్ని కొత్త చిత్రాలు చేస్తున్నారని తెలిపారు. నేటి యువతరం భక్తిని తమ అనుభవాలలో, తమ జీవన రక్షణలా కలిపేసుకున్నారని ప్రశంసించారు. ఇదే ఆలోచనతో ఒక కొత్త సాంస్కృతిక విధానం వెలువడిందని చెప్పారు. ఇలాంటి వీడియోలు సోషల్ మీడియాలో తప్పకుండా చూసే ఉంటారని మోదీ తెలిపారు. దేశంలోని వివిధ నగరాలలో యువత పెద్ద సంఖ్యలో ఏకమవుతున్నారన్నారు. వేదిక, వెలుగు, సంగీతం, పూర్తి హంగులతో ఏర్పాట్లు ఉంటాయన్నారు. ఏ కచేరీకి తీసిపోనటువంటి వాతావరణం ఉంటుందన్నారు. కానీ పూర్తి తన్మయత్వంతోనూ, తాద్దత్మ్యతతోనూ, లయతోనూ నిండిన భజన అక్కడ ప్రతిధ్వనిస్తూ ఉంటుందని మోదీ తెలిపారు. ఈ ప్రయత్నాన్ని నేడు భజన్ క్లబ్బింగ్ అంటున్నారని మోదీ తెలిపారు. ఇది ముఖ్యంగా జెన్-జీ లలో వేగంగా జనరంజకంగా మారుతోందని కొనియాడారు. ఈ ఏర్పాట్లలో భజనల పట్ల గౌరవం, పవిత్రత పట్ల శ్రద్ధ కనిపిస్తాయని మోదీ తెలిపారు. భక్తిని తేలికగా తీసుకోరని అన్నారు. భాష పట్ల ,భావాల పత్ల గౌరవం చెరగదన్నారు. వేదిక ఆధునికంగా ఉన్నా, ప్రస్తుతీకరణ భిన్నంగా ఉన్నా మూల భావన మాత్రం భక్తి మాత్రమే. ఆధ్యాత్మికత తాలుకు నిరంతర ప్రవాహం అక్కడ కనిపిస్తుందని మోదీ చెప్పారు.

## పరిశుభ్రతపై మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రస్తావించిన ప్రధాని మోదీ

మన్ కీ బాత్ కార్యక్రమంలో మనం నిరంతరమూ పరిశుభ్రత గురించి మాట్లాడుకుంటూ ఉంటామని ప్రధాని మోదీ తెలిపారు. మన యువత తమ చుట్టుపక్కల పరిశుభ్రత పట్ల ఎంతో అప్రమత్తంగా ఉండడం చూస్తే తనకు గర్వంగా ఉంటుందని తెలిపారు. అరుణాచల్ ప్రదేశ్ లో జరిగిన ఒక ఇలాంటి ప్రత్యేకమైన ప్రయత్నం గురించి తనకు తెలిసిందన్నారు. దేశంలో మొట్టమొదటి సూర్యకిరణాలు పడేది ఈ అరుణాచల్ ప్రాంతంలోనే. అక్కడి ప్రజలు "జైహింద్" అని ఒకరినొకరు అభివాదం చేసుకుంటారని కొనియాడారు. అక్కడి ఇటానగర్ లో యువత పరిశుభ్రత లోపించిన ప్రాంతాలలో శుభ్రతను పాటించడం కోసం ఏకమయ్యారని తెలిపారు. ఈ యువత వివిధ నగరాలలో బహిరంగ ప్రదేశాలలో పరిశుభ్రతను తమ ఉద్యమంగా మార్చుకున్నారని మోదీ తెలిపారు. ఆ తర్వాత ఈటానగర్, నాహర్లాగూన్, దోయీ ముఖ్, సెప్పాపాలిన్, పాసీఘాట్ ప్రాంతాలలో కూడా ఈ ఉద్యమాన్ని చేపట్టారని తెలిపారు. ఈ యువత ఇప్పటివరకూ దాదాపు 11 లక్షల కిలోలకు మించిన చెత్తను తొలగించారు. మరోవైపు అస్సాంలోని నాగావ్లో అక్కడి పాత వీధులతో ప్రజలు భావాత్మకంగా ముడిపడ్డారని మోదీ తెలిపారు. అక్కడ కొందరు ప్రజలు కలిసి తమ వీధులను శుభ్రపరిచే సంకల్పాన్ని చేపట్టారు. నెమ్మది నెమ్మదిగా వారితో మరికొందరు ప్రజలు కలిశారన్నారు. ఇలాంటి ఒక జట్టు తయారయి వీధుల నుంచి ఎంతో చెత్తను తొలగించిందని చెప్పారు. బెంగుళూరులో ఇలాంటి ఒక ప్రయత్నమే జరుగుతోందన్నారు. బెంగళూరులో సోఫా వేస్ట్ ఒక పెద్ద సమస్యగా ఏర్పడిందని.. దీంతో కొందరు ప్రొఫెషనల్స్ కలిసి ఈ సమస్యను తమ పద్ధతిలో పరిష్కరిస్తున్నారని ప్రశంసించారు. నేడు ఎన్నో నగరాలలో ల్యాండ్ ఫిల్ వేస్ట్ ను రీసైకిల్ చేసే పనిలో నిమగ్నమైన ఎన్నో జట్టులు ఉన్నాయని మోదీ తెలిపారు. చెన్నైలో ఇలాంటి ఒక జట్టు ఎంతో మెరుగైన పనిని చేసిందన్నారు. ఇలాంటి ఉదాహరణల వల్ల పరిశుభ్రతతో ముడిపడిన ప్రతి ప్రయత్నం ఎంత ముఖ్యమైనదో తెలుస్తుందని చెప్పారు. పరిశుభ్రత కోసం మనం వ్యక్తిగతంగానో లేక జట్టుగానో తమ ప్రయత్నాలను పెంచాలని మోదీ పిలుపునిచ్చారు. అప్పుడే మన నగరాలు మరింత మెరుగ్గా తయారవుతాయని మోదీ తెలిపారు.

## పర్యావరణ సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేస్తున్నారు: ప్రధాని మోదీ

: పర్యావరణ సంరక్షణ విషయం వస్తే చాలాసార్లు ఎన్నో ఆలోచనలు , పెద్ద పెద్ద ఉద్యమాలు, పెద్ద పెద్ద సంస్థల గురించి వింటామని.. కానీ, ఎన్నోసార్లు మార్పుకి నాంది చాలా సాధారణంగానే పడుతుందని ప్రధాని మోదీ తెలిపారు. ఒక వ్యక్తి నుంచి, ఒక ప్రాంతం నుంచి, ఒక అడుగుతో , నిరంతరం జరిగే చిన్న చిన్న ప్రయత్నాల వల్ల కూడా పెద్ద పెద్ద మార్పులు జరుగుతాయని అన్నారు. పశ్చిమ బెంగాల్ లోని కూచ్ బిహార్ లో నివసించే బినోయ్ దాస్ ప్రయత్నమే దీనికి ఉదాహరణ అని కొనియాడారు. గత కొన్నేళ్ళుగా ఆయన తమ జిల్లాను పచ్చదనంతో నింపే పనిని ఒంటరిగానే చేశారన్నారు. బినోయ్ దాస్ వేల చెట్లను నాటారని.. ఎన్నోసార్లు మొక్కలను కొనడంతో పాటూ వాటిని నాటి, వాటిని సంరక్షించే పనికి సంబంధించిన ఖర్చు మొత్తం ఒక్కరే భరించారని తెలిపారు. అవసరమైన చోట స్థానికులతో, విద్యార్థులతో, మున్సిపాలిటీలతో కలిసి పనిచేశారన్నారు. వారి ప్రయత్నాల వల్ల రహదారుల అంచులలో పచ్చదనం మరింత పెరిగిందని చెప్పారు. మధ్యప్రదేశ్ లో పన్నా జిల్లాకు చెందిన జగదీశ్ ప్రసాద్ అహిర్వార్ ప్రయత్నాలు కూడా ఎంతో మెచ్చుకోదగ్గవని ప్రధాని మోదీ తెలిపారు.ఆయన అడవిలో బీట్ గార్డ్ గా తన సేవలను అందిస్తారని చెప్పారు. ఒకసారి గస్తీలో భాగంగా తిరుగుతున్న ఆయనకు అడవిలో లభ్యమయ్యే ఔషధ మొక్కల సమాచారం ఎక్కడా క్రమబద్ధమైన రూపంలో నమోదు కాలేదనిపించిందని చెప్పారు. జగదీశ్ ఈ సమాచారాన్ని భావితరాలకు అందించాలనుకున్నారని చెప్పారు. దీంతో ఆయన ఔషధ మొక్కలను గుర్తించి, వాటిని నమోదు చేయడం మొదలుపెట్టారని తెలిపారు. ఆయన 125 ఔషధ మొక్కలను గుర్తించారని తెలిపారు. ప్రతి మొక్క ఫోటో, పేరు, ఉపయోగాలు,. ఎక్కడ దొరుకుతాయో కూడా నమోదు చేశారన్నారు. ఆయన ఏకం చేసిన సమాచారాన్ని అటవీ శాఖ వారు సంకలనం చేసి పుస్తకరూపంలోకి తీసుకొచ్చారన్నారు. ఈ పుస్తకంలో పొందుపరిచిన సమాచారం ఇప్పుడు పరిశోధకులు, విద్యార్థులు, అటవీ అధికారులకు ఎంతో ఉపయోగపడుతోందన్నారు. పర్యావరణ సంరక్షణ అనే ఈ భావన ఇప్పుడు పెద్ద ఎత్తున కనిపిస్తోందని మోదీ తెలిపారు. ఇదే ఆలోచనతో దేశవ్యాప్తంగా ఏక్ పేడ్ మా కే నామ్ (అమ్మ పేరుతో ఒక చెట్టు) ఉద్యమం నడుస్తోందని మోదీ తెలిపారు. ఈ ఉద్యమంలో నేడు కోట్లమంది ప్రజలు భాగస్వామ్యులయ్యారన్నారు. ఇప్పటివరకు దేశంలో 200 కోట్లకు మించిన చెట్లు నాటినట్లు చెప్పారు. పర్యావరణ సంరక్షణ పట్ల ప్రజలు ఎంతో ఎక్కువ అప్రమత్తంగా మారారు అనడానికి ఇది ఉదాహరణ అని చెప్పారు. ఏదో ఒక రూపంలో దీనికి సహకారాన్ని అందించడానికి ప్రజలు ఇష్టపడుతున్నారని మోదీ తెలిపారు.

## వరంగల్ నగరంలో టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో రథసప్తమి వేడుకలు

తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో వరంగల్ నగరంలోని సువిద్యా జూనియర్ కళాశాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈరోజు మన గుడి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు సామూహికంగా సూర్య నమస్కారాలతో పాటు ఆదిత్య హృదయాన్ని పఠించారు. ఈ సందర్భంగా టిటిడి కోఆర్డినేటర్ కృష్ణమూర్తి దూరదర్శన్ తో మాట్లాడుతూ రథసప్తమి పురస్కరించుకొని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేడుకలు నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగా సూర్య నమస్కారాలు యోగాసనాలు చేయడంతో పాటు భక్తులచే ఆదిత్య హృదయ పారాయణం చేస్తున్నామన్నారు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రత్యక్ష దేవుడు సూర్యుడు కాబట్టి ఆదివారం రథసప్తమి రావడం విశేషంగా భావిస్తున్నామని ఈరోజు విద్యార్థిని విద్యార్థులకు యోగాసనాలు సూర్య నమస్కారాల సాధన చేస్తున్నామని అన్నారు

## ఆదివాసీ ఆరాధ్యదైవం నాగోబా జాతరకు పోటెత్తిన భక్తులు

ఆదివాసీ ఆరాధ్యదైవం నాగోబా జనసంద్రమైంది. సెలవు దినం కావడంతో పాటు నాగోబా వేడుకలు చివరి రోజులు కావడంతో భక్తులు సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చి నాగోబా ఆలయంలో నాగోబాను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంటల తరబడి క్యూ లైన్లో ఉంది నాగోబా దర్శనం చేసుకొని మొక్కలు చెల్లించుకున్నారు. దీంతో ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ నాగోబా సన్నధి భక్తులతో కిటకిటలాడింది. జాతర ముగింపు సందర్భంగా మెస్రం వంశీయులు ఆనవాయితీ ప్రకారం వస్తున్న బేతాళ్, మండగాజిలి పూజలు నిర్వహించారు. తమ సాంప్రదాయ వాయిద్యాలు మోగిస్తూ ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు. భక్తులు ఆలయంలోని గోడకు చిల్లర నాణేలు అంటించి తమ మొక్కులు తీర్చుకున్నారు. నాగోబా దర్బార్ హాల్ లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గుస్సాడి నృత్యాలు ఆహుతులను అలరించారు. మరోవైపు వరుస సెలవులు రావడంతో నాగోబా ఆలయం జన సంద్రంగా మారింది. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు దూరదర్శన్ తో మాట్లాడుతూ ఏటా నాగోబా దర్శనం చేస్తుకుంటామని, గిరిజన ఆరాధ్యా దైవం కావడంతో ఎక్కడ ఉన్న నాగోబా జాతరలో కేస్లాపూర్ కు కుటుంబంతో కలిసి వచ్చి దర్శనం చేసుకుంటామన్నారు. జాతర సందర్భంగా ఒకరోజు సెలవు ప్రకటించడం, ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం భక్తులకు సౌకర్యాలు కల్పించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

## మేడారం మహాజాతరలో అందుబాటులో రెండు హెలికాప్టర్ సర్వీసులు

*తెలంగాణ కుంభమేళా శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర అంగరంగ వైభవంగా జరుగుతుంది* *మేడారంలోని వనదేవతలను దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు పర్యాటకశాఖ హెలికాప్టర్ సేవలను కూడా అందుబాటులో ఉంచింది* *తుంబి ఎవేషన్ వారి ఆధ్వర్యంలో రెండు హెలికాప్టర్లు ప్రస్తుతం జాతరలో పనిచేస్తున్నాయి* ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో నిర్వహిస్తున్న శ్రీ సమ్మక్క సారలమ్మ మహా జాతరలో రాష్ట్ర పర్యాటక శాఖ ద్వారా తుంబి ఏవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో రెండు హెలికాప్టర్ సర్వీస్ లను అందుబాటులో ఉంచారు. ఏరియల్ వ్యూ ద్వారా మేడారంలోని చిలకలగుట్ట, జంపన్న వాగు కన్నేపల్లి, మేడారం జాతర పరిసర ప్రాంతాలు,ప్రకృతి అటవీ అందాలను చూసేందుకు ఈ సర్వీసులు ఉపయోగపడుతున్నాయి. రెండు ఎలిఫర్డ్ సర్వీసులు ఒకటి జాయ్ రైడ్ కోసం ఇంకొకటి సెటిల్ సర్వీస్ కోసం ఈ సెటిల్ సర్వీస్ వచ్చి హనుమకొండ నుంచి మేడారం వరకు ప్రొవైడ్ చేస్తున్నామని, ఒక వ్యక్తికి 35999/- రూపాయలు చార్జ్ చేస్తున్నామని, హనుమకొండలో పిక్ చేసుకొని మేడారం స్పెషల్ దర్శనం తర్వాత హనుమకొండలో డ్రాప్ చేయడం జరుగుతుందని, ఇక జాయ్ రైడ్ ₹4,800 అని ఇందులో ఆరు నుంచి ఏడు నిమిషాలు ఏరియల్ వ్యూ ద్వారా వినోదం చూపిస్తామని, ఇది పడిగగా పూర్ దగ్గర ఉన్న హెలికాప్టర్ ల్యాండింగ్ ఏరియా నుంచి స్టార్ట్ చేస్తున్నామని, ఇది ఆన్లైన్ లేదా ఆఫ్లైన్లో కూడా బుక్ చేసుకునేందుకు నంబర్స్ ఉంచామని, ఈ సర్వీసులు ఈనెల 21 నుంచి 31 వరకు అందుబాటులో ఉంటాయని ఎలిప్యాడ్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ లవకుమార్ అన్నారు.

థంబి ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ సర్వీస్ నిర్వహిస్తుంది.బుకింగ్ వివరాలు: ఫోన్: 9676320139, 8530004309, 7660939509 లోగో బైట్ -లవ కుమార్ ( ఎలిప్యాడ్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్)

# నేడు 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం




నేడు 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం. ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరుడికి ఉన్న అత్యంత శక్తివంతమైన ఆయుధం ఓటు. ఆ ఓటు హక్కు ప్రాముఖ్యతను చాటిచెబుతూ, ఓటర్లలో చైతన్యం నింపేందుకు దేశవ్యాప్తంగా వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. 1950 జనవరి 25న భారత ఎన్నికల సంఘం ఆవిర్భవించిన రోజును పురస్కరించుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాయి. "My India, My Vote" అనే నినాదంతో ఈ ఏడాది వేడుకలు సాగుతున్నాయి. యువతను ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములను చేస్తూ దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడమే ఈ రోజు లక్ష్యం. ప్రజాస్వామ్య భారతావనిలో ఓటు ఒక పవిత్రమైన బాధ్యత. ప్రతి పౌరుడి గళం అసెంబ్లీ, పార్లమెంట్ గోడల మధ్య ప్రతిధ్వనించాలంటే అది ఓటు ద్వారానే సాధ్యం. అందుకే అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకుని, పోలింగ్ కేంద్రం వరకు వెళ్లేలా ప్రోత్సహించడమే ఈ జాతీయ ఓటర్ల దినోత్సవ ప్రధాన ఉద్దేశం. 2011లో అప్పటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రారంభమైన ఈ ప్రయాణం, నేడు 16వ వసంతానికి చేరుకుంది. దేశ గమనాన్ని నిర్దేశించే శక్తి యువత చేతుల్లోనే ఉంది. 18 ఏళ్లు నిండిన ప్రతి యువతీ యువకుడు ఓటరుగా నమోదు చేసుకోవడం ద్వారా దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలి. ఏటా జనవరి 1వ తేదీని ప్రాతిపదికగా తీసుకుని అర్హులైన కొత్త ఓటర్లను గుర్తించి, వారికి ఈ రోజున ఎలక్టోరల్ ఫొటో ఐడెంటిటీ కార్డులు అంటే ఎపిక్ కార్డులను అందజేస్తున్నారు. కేవలం కార్డు పొందడమే కాదు, ఎన్నికల సమయంలో నిష్పక్షపాతంగా, ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయడం పౌర ధర్మమని ఈ రోజు ఉద్ఘాటిస్తోంది. ఈ ఏడాది జాతీయ ఓటర్ల దినోత్సవం "మై ఇండియా, మై ఓట్" అనే విశిష్టమైన థీమ్తో జరుగుతోంది. నా దేశం.. నా ఓటు అనే భావన ప్రతి పౌరుడిలో ఆత్మగౌరవాన్ని, బాధ్యతను పెంపొందించడమే ఈ నినాదం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. సాంకేతికత పెరిగిన ప్రస్తుత కాలంలో ఓటు నమోదు నుంచి పోలింగ్ వరకు ఈసీ ఎన్నో సంస్కరణలు తెచ్చింది. ఈవీఎంలు, వీవీప్యాట్ యంత్రాల పనితీరుపై ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేస్తూ క్షేత్రస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ గతంలో ఓటర్లను ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు కేవలం ఒక హక్కు మాత్రమే కాదు.. అది దేశ గమనాన్ని, భవిష్యత్తును నిర్ణయించే ఒక గొప్ప శక్తిని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఓటుతోనే భారత్ ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని ప్రధాని తెలిపారు. దేశం దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపాలన్నా, అంతర్జాతీయ స్థాయిలో భారత్ బలాన్ని చాటాలన్నా ఓటే కీలకమని మోదీ వెల్లడించారు. రాజకీయాల్లో మార్పు కావాలని కోరుకునే వారు ముందుగా పోలింగ్ బూత్ వైపు అడుగు వేయాలి. ఓటు వేయకపోవడం అంటే దేశ భవిష్యత్తుపై బాధ్యతను విస్మరించడమే. పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెంచడం, వృద్ధులు, దివ్యాంగులకు ఓటింగ్ ప్రక్రియను సులభతరం చేయడంపై ఈసారి ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టి సారించింది. అక్షరాస్యతతో సంబంధం లేకుండా ప్రతి పౌరుడు తన ఓటు విలువను గుర్తించినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది. మొత్తానికి జాతీయ ఓటర్ల దినోత్సవం కేవలం ఒక వేడుక కాదు.. అది ఒక బాధ్యతాయుతమైన పౌర మేల్కొలుపు. "నేను ఓటు వేస్తాను - దేశాన్ని కాపాడుతాను" అనే ప్రతిజ్ఞతో ముందుకు సాగుదాం. పటిష్టమైన ప్రజాస్వామ్య నిర్మాణంలో మన వంతు పాత్ర పోషిద్దాం.

## శాసనసభ, మండలి ఆవరణలో గణతంత్ర దినోత్సవ వేడుకలు

శాసనమండలి ఆవరణలో 77 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు జరిగాయి.మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి జాతీయ పథకాన్ని ఆవిష్కరించారు.జాతీయ గీతాలపనతో వేడుకలు జరిపారు.ఇటు శాసన సభ ఆవరణలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ ఎమ్మెల్సీలు దయాకర్,చిన్నారెడ్డి, మల్కా కొమురయ్య,దయానంద్,రవీందర్, శ్రీపాల్ రెడ్డి,అంజిరెడ్డి, వాణిదేవి శాసనమండలి కార్యదర్శి నరసింహ చార్యులు తదితరులు పాల్గొన్నారు

## భారత్-యూరోపియన్ యూనియన్ మధ్య చారిత్రాత్మ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఖరారు

భారత్ -యూరోపియన్ యూనియన్ మధ్య చారిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఖరారు అయ్యింది. ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య భాగస్వామ్యానికి నిదర్శనంగా ఈ ఒప్పందం నిలిచింది. ప్రపంచ జీడీపీలో 25శాతం వాటా కలిగి ఉన్న భారత్-ఈయూల మధ్య ఈ ఎఫ్టీఏ మదర్ ఆఫ్ ఆల్ డీల్స్ అని ప్రధాన మంత్రి అభివర్ణించారు. ఈ ఒప్పందం సందర్భంగా ఇవాళ ఈయూ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఆంటోనియో, యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ తో ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్ లో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. కాగా, గోవాలో జరుగుతున్న ఇండియా ఎనర్జీ వీక్-2026లో ప్రధాని ఉదయం వర్చువల్ గా మాట్లాడుతూ.. నిన్న ఈ ఒప్పందం కుదిరినట్టు ప్రకటన చేశారు. భారత్-ఈయూ ఎఫ్టీఏ వల్ల భారత్ లోని 140కోట్ల మంది ప్రజలకు, ఈయూలో నివసిస్తున్న లక్షలాది మందికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. ఉత్పత్తి, సేవ రంగాలపై ఈ ఒప్పందం సానుకూల ప్రభావం చూపిస్తుందని అన్నారు. భారత్ లో పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచ వ్యాప్తంగా ఇన్వేస్టర్లలో విశ్వాసం పెరుగుతుందన్నారు. 2007లో ఎఫ్టీఏపై భారత్-ఈయూ కసరత్తు ప్రారంభించాయి, అనేక అవరోధాలను ఎదుర్కొని ఈ ఒప్పందం నేటికి ఖరారు అవడం విశేషం.

## దేశ రాజధాని ఢిల్లీలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తో యూరోపియన్ ఈయూ ప్రతినిధుల భేటీ

కమిషన్ వైస్ ప్రెసిడెంట్ కాజా కల్లాస్ తన ప్రతినిధి బృందంతో సమావేశం అయ్యింది. ఈ సందర్భంగా ఇరు దేశాలు 'భద్రత, రక్షణ భాగస్వామ్య' ఒప్పందంపై సంతకం చేశాయి. ఈ ఒప్పందం ద్వారా సముద్ర భద్రత, సైబర్ సెక్యూరిటీ, ఉగ్రవాద వ్యతిరేక పోరాటం, రక్షణ సాంకేతికత వంటి రంగాల్లో భారత్-ఈయూ దేశాల మధ్య సహకారం పెరగనుంది. ఈ సందర్భంగా రాజ్ నాథ్ సింగ్ మాట్లాడుతూ.. ఈ ఒప్పందం ఇరు దేశాల మధ్య ఉన్న విశ్వాసానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఈ ఒప్పందం భారత్-ఈయూ మధ్య రక్షణ సహకారాన్ని బలోపేతం చేస్తుందని అన్నారు. యూరోపియన్ యూనియన్తో భారత్ కు పెరుగుతున్న భాగస్వామ్యానికి పునాదిగా నిలుస్తుందన్నారు.

## మహారాష్ట్రలో జరిగిన విమాన ప్రమాదంలో డిప్యూటీ సీఎం అజిత్ పవార్ దుర్మరణం



మహారాష్ట్రలో ఘోర ప్రమాదం జరిగింది. ఈ ఉదయం జరిగిన విమాన ప్రమాదంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ దుర్మరణం చెందారు. ఆయన ప్రయాణిస్తున్న విమానం బారామతిలో కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో పవార్తో పాటు మరో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. జిల్లా పరిషత్ ఎన్నికల ప్రచారం నిమిత్తం ముంబై నుంచి బారామతి వెళ్తుండగా ఉదయం 8:45 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. ముంబై నుంచి బయల్దేరిన గంట తర్వాత విమానంలో సమస్య తలెత్తింది. ఎమర్జెన్సీ ల్యాండింగ్ సమయంలో విమానం అదుపుతప్పి కూలిపోయింది. ఆ వెంటనే భారీగా మంటలు చెలరేగాయి. విమాన ప్రమాదంపై స్పందించిన డీజీసీఏ.. విమానంలో ఎవరూ బతికి లేరని వెల్లడించింది. అజిత్ పవార్, ఇద్దరు వ్యక్తిగత సిబ్బంది, ఇద్దరు విమాన సిబ్బంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపింది.

## అజిత్ పవార్ మరణం పట్ల పలువురు ప్రముఖుల దిగ్భ్రాంతి

మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ దుర్మరణం పట్ల ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన అకాల మరణం దిగ్భ్రాంతికరమైనదని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఎక్స్ వేదికగా రాష్ట్రపతి సంతాపం తెలిపారు. మహారాష్ట్ర అభివృద్ధికి, సహకార రంగంలో ఆయన చేసిన కృషికి ఎల్లప్పుడూ గుర్తుండిపోతారని అన్నారు. పవార్ కుటుంబానికి, అభిమానులకు ఎక్స్ వేదికగా ప్రధాని మోదీ సంతాపం తెలిపారు. అట్టడుగు స్థాయి నుంచి ప్రజలతో బలమైన సంబంధాలు కలిగి ఉన్నారని గుర్తు చేశారు. అజిత్ పవార్ మరణించారనే వార్త తనను తీవ్రంగా బాధించిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. అజిత్ పవార్నుఎప్పుడు కలిసిన మహారాష్ట్ర ప్రజల సంక్షేమానికి సంబంధించిన వివిధ అంశాలపై సుదీర్ఘ చర్చలు జరిపేవారని అన్నారు. సుదీర్ఘ ప్రజా జీవితంలో అజిత్ పవార్ రాష్ట్ర అభివృద్ధి, శ్రేయస్సుకు కట్టుబడి ఉన్నారని కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ అన్నారు. మహారాష్ట్ర రాజకీయాల్లో సన్నిహిత మిత్రుడిని కోల్పోయానని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అన్నారు.

## అశ్రునయనాల మధ్య ముగిసిన అజిత్ పవార్ అంత్యక్రియలు

వేలాది మంది అశ్రునయనాల మధ్య మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ అంత్యక్రియలు ముగిశాయి. బారామతిలోని విద్యా ప్రతిష్ఠాన్ మైదానంలో అధికారిక లాంఛనాలతో నిర్వహించారు. ఈ ఉదయం అశేష జనవాహిని మధ్య ఆయన అంతిమయాత్ర సాగింది. పూలతో అలంకరించిన ప్రత్యేక వాగ పై అజిత్ దాదా అమర్ రహే అనే నినాదాల మధ్య బారామతి పురవీధుల్లో ఆయన భౌతికకాయాన్ని ఊరేగించారు. తమ ప్రియతమ నేతను చూసేందుకు కార్యకర్తల కన్నీటి వీడ్కోలు తో బారామతి నగరం శోకసంద్రమైంది. ఈ అంత్యక్రియలకు కేంద్ర మంత్రులు అమిత్ షా, నితిన్ గడ్కరీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రి ఏకనాథ్ షిండే సహా పలువురు ప్రముఖులు హాజరై నివాళులర్పించారు. అజిత్ పవార్ చిన్నాన్న, ఎన్సీపీ అధినేత శరద్ పవార్, ఎంఎన్ఎస్ చీఫ్ రాజ్ థాకరే, సుప్రియా సూలే, ఇతర కుటుంబ సభ్యులు అత్యంత భావోద్వేగంతో ఆయనకు తుది వీడ్కోలు పలికారు. అంతిమ సంస్కారాల సమయంలో త్రివర్ణ పతాకాన్ని అజిత్ పవార్ కుమారుడు జయ్ పవార్కు అధికారులు అందజేశారు.

# కాశీమజిలీ కథలు

ధారావాహిక -ఐదవభాగం

డా. మాదిరాజు బ్రహ్మానంద రావు




## దేవతా వస్త్రముల కథ

గ్రామాధికారులు రాజు వద్దకు వెళ్లి "రాజా! నూలు అద్భుతంగా ఉంది. భూలోకంలో ఇట్లాంటి నూలును మేమెప్పుడూ చూడలేదు. ఆ నూలు గాని- ఆ బట్టలుగాని మనుషుల చేత తయారు చేయబడిందంటే ఎవరు నమ్మరు. అది నిజంగా భగవంతుడొక్కడు మాత్రమే చేయగల"డంటూ అని పొగడ సాగారు. ఈ విషయాన్ని వారు రాజునకే కాదు- వారికి కనిపించిన వారికందరికీ చెప్పసాగారు.

మరిరెండు నెలలు గడిచాయి. బట్టలెంతవరకు పూర్తియయ్యాయో తెలుసుకొని రమ్మని రాజీసారి దండనాథుని పంపాడు. దండనాథుడు రాగానే రాముడు లేని నూలును వస్త్రాలను చూపించసాగాడు. ఈ బట్టలెంత బాగున్నాయో-ఎంత మెత్తగా ఉన్నాయో పట్టుకొని చూడమన్నాడు. దండనాథునకు నూలు గాని బట్టలు గాని కనిపించలేదు. ఇందుకు కారణం తన తల్లియేనని కుమిలిపోయాడు. తమతల్లి గ్రామాధికారుల తల్లుల వంటి సుగుణవంతు రాలు కాదని విచారపడి దాన్ని మనసులోనే ఉంచుకొని రాజు వద్దకు వెళ్లి పట్టుసాలెవారిని -నూలు వస్త్రాలను పొగడ సాగాడు. మరో నెల గడిచిన తర్వాత రాజు తన మంత్రి దుర్బుద్ధిని వస్త్రాలను చూచిరమ్మని పంపాడు. మంత్రికి కూడా లేని వస్త్రాలను వరప్రసాదులు చూపారు. వస్త్రాలను చూడలేని మంత్రి కూడా తన తల్లి శీలాన్ని శంకించాడు. దీన్ని కప్పిపుచ్చి మంత్రి కూడా రాజు వద్దకు వెళ్లి పట్టుసాలీలను-బట్టలను అద్భుతమని ప్రశంసించాడు. ఆరు-నెలల గడువు పూర్తి అయింది. ఒక రోజు రాముడు రాజసభకు వెళ్లి రాజునకు నమస్కరించి రాజుతో "దేవా! దేవతావస్త్రాలు పూర్తియయ్యాయి. మేము ఈ బట్టలనేతను అనేక సంవత్సరాలు తపస్సు చేసి నేర్చుకున్నాము. ఇవి దేవతా వస్త్రాలు కాబట్టి ఆనాడు స్త్రీలకు పురుషుని చూసే స్వేచ్ఛ కూడా ఉంటుంది. తమకు కొత్త పద్ధతులు అంటే చాలా ఇష్టం కాబట్టి ఈ దేవతావస్త్రాలను మీరు రేపు రాణిగారితో పాటుగా ఊరేగింపుగా వచ్చి బట్టలను కట్టుకో"మని చెప్పి వెళ్లిపోయాడు. రాజు సంతోషంతో నగరం అంతా అలంకరింప చేయమన్నాడు. మంత్రి సామంత పురోహితులతో తాను పట్టపురాణితో పట్టపుటేనుగునెక్కి మంగళ వాయిద్యాలతో వరప్రసాదులుండే భవనాన్ని చేరుకున్నాడు. వసంతుడొక పళ్ళెంతో వచ్చి దేవతా-వస్త్రాలు చూడమని చూపాడు. రాజునకేమీ కనిపించ లేదు. తన తల్లి జారిణి అని భావించి ఆమెను లోలోన తిట్టుకోసాగాడు. అప్పుడు రాముడు కలగజేసుకొని రాజుతో "మీకేమీ కనిపించడం లేదా? ఈ నూలు బాగోలేదా? ఈ బట్టలు మంచిగా లేవా? అంటూ ప్రశ్నలను గుప్పింపసాగాడు. దీన్ని తట్టుకోలేక రాజు "బట్టలు కనపడుతున్నాయి కానీ ఈ బట్టలు కట్టుకొని మా తల్లికి మొక్కాలనిపిస్తుంది" అంటూ మంత్రి దుర్బుద్ధితో 'ఈవస్త్రాలు నీవిదివరకు చూసిన వస్త్రాల వలె నాణ్యంగా ఉన్నాయో లేవో' చూసి చెప్పమన్నాడు. మంత్రి వాటిని చూస్తున్నట్టు నటిస్తూ 'ఇదివరకు తాను చూసిన వస్త్రాల కంటే సుందరంగా నాణ్యంగా ఉన్నా'యన్నాడు. రాజు అక్కడున్న వాళ్ళనందరిని ఇదే ప్రశ్న

అడిగాడు. అందరూ తమకేమీ కనిపించకపోయినా కనిపించినట్టుగా బాగా ఉన్నాయని నమ్మబలికారు. రాజు భార్యతో 'ఈ వస్త్రాలను చూస్తు'న్నావా అని అడగ్గా ఆమె కూడా ఏమీ కనబడకపోయినా తన తల్లి శీలాన్ని శంకిస్తూ 'ఈ దేవత వస్త్రాలు బాగున్నా'యని అబద్ధమాడింది. రాజు రాణి తర్వాతపౌరులందరు దేవతావస్త్రాలను పొగడిన తరువాత రాముడు రాజుగారిని నిలుచుండ బెట్టి కట్టుకున్న వస్త్రాలను ఊడదీసి మాయా వస్త్రాలు కడుతున్న వాని వలె నటిస్తూ రాజును దిగంబరుని చేశాడు. దిగంబరుడైన రాజును చూసిన ప్రతివాడు రాజు కట్టుకొన్న వస్త్రాలు కనిపించక పోవటం వలన తమతమ తల్లులదోషాన్ని తలుచుకొని తేలుకుట్టిన దొంగల్లాగా మిన్నకుండిపోయారు. వరప్రసాదులు ముందు నియమించుకున్న ఒక కాంత చేత రాణి గారి ఒంటిమీద ఉన్న బట్టలను విప్పించి దేవతా వస్త్రాలను కట్టింపించారు. రాజు రాణి తమ దిగంబరత్వం తామొక్కరికే కనబడుతున్నదని- అందరికీ తాము బట్టలు కట్టుకున్న వారిగానే కననబడుతున్నామని భావించారు. రాజు రాణి దిగంబరంగానే పట్టపుటేనుగు నెక్కి ఊరేగింపుకు బయలుదేరారు. దిగంబరులై ఊరేగుతున్న రాజ దంపతులను మేడలపై నుండి చూస్తున్న పౌరకాంతలు సిగ్గుతో తలుపులు మూసుకోసాగారు.




ఊరేగింపు పూర్తయిన తరువాత ఆ రాజదంపతులు అంతఃపురానికి వెళ్లారు. ఏకాంతంలో రాజు రాణితో "కాంతామణీ! నీవు కట్టుకున్న చీర నాకు ఏమీ కనిపించటంలేదు. అపకీర్తి వస్తుందనే భయంతో నిజం చెప్పలేక పోయాను". అని అనగా అప్పుడు రాణి కూడా "రాజా! ఆ నేతగాండ్రు తెచ్చిన పళ్లెంలో నాకు బట్టలేవీ కనిపించలేదు. తల్లి కళంకాన్ని కప్పి పుచ్చుకోవడానికి నేను అబద్ధం ఆడాను" అని అంది. రాజుకు నిజం తెలిసింది. తామిద్దరిని దిగంబరంగా ఊరేగించిన వారిపై రాజునకు అంతులేని కోపం వచ్చింది. అప్పుడు మంత్రి దుర్బుద్ధిని, దండనాథుని, గ్రామాధికాలను పిలిపించాడు. నిజం చెప్పమనాడు. అందరూ మాతాపాతకాన్నిమరుగుపరచడానికి అబద్ధమాడామన్నారు. రాజు పట్టుసాలెవారిని పట్టితెమ్మని బంట్లను వరప్రసాదులున్నభవనానికి పంపించాడు. భటులకు వారు దొరకలేదు. వారికక్కడ ఒకలేఖ దొరకగా దాన్ని తెచ్చి రాజునకు ఇచ్చారు. అందులో ఇట్లా ఉంది "మహారాజశ్రీ అపూర్వ దుర్మార్గ చర్యాభిలాషులైన కానీన మహారాజుగారికి కపటపు పట్టుసాలీలు వ్రాయునది: నీవు లోకవిరుద్ధమైన పనులు చేయటం వల్ల ఇంద్రుడు మా యిదుగురిని నీ వద్దకు దూతగా పంపాడు. ఇకనైనా బుద్ధి తెచ్చుకొని వివరీత శాసనాలు చేయటం మానుకో. లేకపోతే ఇంద్రుని ఆజ్ఞను మన్నింపని వానిగా నిన్ను భావించి నిన్ను రాజ్య భ్రష్టుని చేసి దండిస్తాము. సుబుద్ధిని మంత్రిగా చేసి రాజ్యాన్ని పరిపాలించు" అనే సందేశమున్న ఆ లేఖను చదువుకున్న రాజు ఇంద్రునితో వివాదం పెట్టుకోవడం నష్టమే గాని లాభం లేదని భావించాడు. ఇకనుండి ప్రజలు రాత్రిని రాత్రిగాను-పగలిటిని పగలుగాను భావించమని ఆజ్ఞాపత్రాలు పంపించాడు. ప్రజలు సంతోషాలను అనుభవిస్తుండగా రాజు మునుపటి మాదిరిగా రాజ్యాన్ని సుఖంగా పరిపాలింప సాగాడు.

డా. మాదిరాజు బ్రహ్మానందరావు

# నాయకుని మాట తీరే ఆతని జయాపజయాలను నిర్ణయిస్తుంది

పాలకుర్తి రామమూర్తి



**అని మొన దేవదానవుల కైనను మార్కొన రాదు నిన్ను, నే**
**డెనిమిది నాళ్ళు లయ్యె, సమయింపవు, నొంపవు, సవ్యసాచి న**
**ప్పని యటు లుండ నిమ్ము, నిను ప్రార్థన సేసెద నింతవట్టు నా**
**చనువున పోవ నిచ్చి; నృప సత్తమ పోరికి కర్ణు బంపవే!**
(తిక్కన - భీష్మ పర్వము - తృతీయ - 171 ప)

రాజులలో గొప్పవాడవైన ఓ భీష్మపితామహా! నిన్ను యుద్ధంలో దేవతలు దానవులు కూడా ఎదుర్కొనలేరు. ఇప్పటికి ఎనిమిది రోజులుగా యుద్ధం జరుగుతున్నా ఇంతవరకు అర్జునుడిని చంపలేదు సరికదా బాధింపనూ లేదు. సరే ఆ పనిని అట్లాగే ఉండనివ్వు. నీపైన నాకున్న చనువుతో నిన్ను వేడుకుంటున్నాను. తాతా... ఇక యుద్ధానికి కర్ణుడిని పంపు. నా కోరిక ప్రకారం నన్ను నడుచుకోనివ్వు, అంటాడు, భీష్మునితో దుర్యోధనుడు. నిజానికి ఇది చాలా చిన్న పద్యమే కాదు, భారతంలో పెద్దగా ప్రాచుర్యమూ లేని పద్యము కూడా.. కాని ఒక నాయకుడు ఎలా ప్రవర్తించాలో ఎలా ప్రవర్తించ కూడదో స్పష్టంగా తెలియచేసే పద్యము. ఈ పద్య నేపథ్యాన్ని పరిశీలిస్తే.... భారత యుద్ధం గత 8 రోజులుగా సాగుతుంది. కౌరవ సేన ఎక్కువగా నష్టపోయింది. అసలే అహంభావంతో కూడిన భావోద్వేగాలు ఎక్కువగా ఉన్న దుర్యోధనునిలో ఆదుర్దా హెచ్చింది. ఆ రాత్రి సమీక్షా సమావేశాన్ని ఆత్మీయులతో నిర్వహించాడు. ఆ సమావేశంలో కర్ణ, దుశ్శాసన, శల్యులు పాల్గొన్నారు. దుర్యోధనుడు భీష్ముని యుద్ధ విధానంపై అసహనాన్ని ప్రదర్శించగా అందరూ ఏక కంఠంతో భీష్ముని స్థానంలో కర్ణునిని యుద్ధానికి పంపాలని నిర్ణయిస్తారు. ఆ ప్రకారమే దుశ్శాసనునితో కలసి భీష్ముని శిబిరం చేరి ఆతనికి నమస్కరించి పై విధంగా పలుకుతాడు, దుర్యోధనుడు.

విశ్లేషణ.....

1) ఇతరులతో కలసి పని చేయడం, మన పనిని ఇతరులతో చేయించుకోవడం ఒక కళ. 2) ఆ ఇతరులు స్నేహితులో, బంధువులో అయితే వారితో పని చేయించుకోవడంలో కొన్ని పరిమితులుంటాయి. వారితో మన బంధం ఎలాంటిదనే అంశం, మనతో వారి అవసరాలు, వారితో మన అవసరాలు, సమాజంలో ఎదుటివారి స్థానం, పరస్పర ప్రయోజనాలు... ఇలాంటి వన్నీ ప్రధాన పాత్రను పోషిస్తాయి. 3) బంధుత్వం ఎంత దగ్గరిదైనా, స్నేహం ఎంత గాఢమైన దైనా కార్యస్థలంలో యజమానికి - ఉద్యోగికి మధ్య దూరం అనివార్యమే కాదు అవసరం కూడా. 4) ఎంతగా కావలసిన వారైనా యజమాని ఇచ్చే ప్రాధాన్యత ఎదుటి వారి నైపుణ్యం, సామర్థ్యం, దక్షతలకే కాని బంధుత్వానికి మైత్రికి కాదు. (యుద్ధారంభంలో భీష్మునికి కర్ణునికి మధ్య ఎన్నుకోవలసిన సమయంలో కర్ణుడెంత మిత్రుడైనా భీష్మునికే ప్రాధాన్యత నిచ్చాడు, దుర్యోధనుడు) 5) యజమాని తన పనిని సాధించుకునే క్రమంలో ఎదుటి వానిని ఎంతమేరకైనా పైకెత్తేందుకు సిద్ధపడతాడు. అవసరం తీరితే అవసరం అనుకుంటే అథఃపాతాళానికి త్రొక్కేందుకూ బాధపడడు. 6) తన చుట్టూ

ఉండేవారు యజమాని కంటిలో పడేందుకు ఎంతకైనా తెగిస్తారు. తమ ప్రాబల్యం పెంచుకునేందుకు యజమాని ఇష్టాయిష్టాలను మాత్రమే దృష్టిలో పెట్టుకొని సలహాలిస్తారు. నిజానికి ప్రయోజనం ముఖ్యమైనదే కాని యిష్టాయిష్టాలు ప్రధానమైనవి కావు. ప్రయోజనాన్ని అనుసరించి ఇష్టాయిష్టాలుండాలే కాని ఇష్టాయిష్టాలను ప్రయోజనాలు అనుసరించ కూడదు.

7) నాయకుడు ఏవి తోడేళ్ళో ఏవి మేకపిల్లలో గుర్తించ గలిగిన విజ్ఞత కలిగిన వాడై ఉండాలి. ఈ వివేచన, నైపుణ్యం నాయకునికి లేకపోతే కష్టాలు ఎదురయ్యే అవకాశాలు హెచ్చుగా ఉంటాయి.

8) పనిలో ఒత్తిడి సహజమైనదే. ముఖ్యంగా పోటీదారులు అధికంగా ఉండి వారి శక్తిసామర్ధ్యాలు అపారమైన సమయంలో ఆ ఒత్తిడిని జయించే విధానాన్ని ఎవరిని ఎంతవరకు ఉపయోగించుకోవాలో తెలియాలి. ఆ నైపుణ్యం తెలియకపోతే లేదా ఆ నైపుణ్యాన్ని గుర్తించకపోతే నాయకుడు అపజయం పాలవుతాడు.

9) ఎవరిని ఎలా ఉపయోగించుకోవలో తెలియడమే కాదు వారు భారమనిపించిన సమయంలో వారిని ఎలా వదిలించుకోవాలో తెలియాలి. ఈ మాట కఠినంగా ఉండవచ్చు కాని... భారాన్ని పెంచుకోవడం కన్నా... దించుకోవడం వల్ల సులభంగా లక్ష్యాన్ని చేరవచ్చు. అంతేకాదు... అనవసరమైన భారం దిగితే అవసరమైన, ఉపయుక్తమైన మరొక భారాన్ని తల్లకెత్తుకునే అవకాశమూ ఉంటుంది. దానిని గుర్తించాలి. ఇది కృతఘ్నత అనుకోకూడదు.

10) గుడ్డిగా అనుచరుల లేదా ఆత్మీయులు, ఆత్మీయ మిత్రులు అనుకుంటూ సలహాదారుల సలహాలను సూచనలను పాటించడం సమంజసం కాదు. అలా గుడ్డిగా విశ్వసిస్తూ, అనుసరిస్తూ పోతే నిరంతర దుఃఖాన్ని అనుభవించ వలసి వస్తుంది.

11) అవతలి వ్యక్తి ఎంత సాధారణమైన వాడైనా, మనమెంత ఉన్నత పదవిలో, అధికారంలో ఉన్నా అతని నుండి ఏనాడైనా ప్రమాదం పొంచి ఉన్నట్లే. అవమానితుడు సమయం కోసం ఎప్పుడూ ఎదురు చూస్తూనే ఉంటాడు. అదును చూచి దెబ్బ తీయడం జరగవచ్చు. ఏవ్యక్తికైనా అతనిలో అమితమైన ఆత్మాభిమానం ఉంటుంది. దానికి ప్రతిఘాతమేర్పడినప్పుడు... ప్రతీకారం తీర్చుకునే ప్రయత్నం చేస్తాడు. కాకపోతే సమయం సందర్భం కోసం ఎదురుచూడడం జరుగుతుంది.

12) అలాగే అసాధారణ తెలివి తేటలూ, ఉన్నత పదవులూ, ఆత్మీయ బంధాలూ లేకపోయినా ఒక్కొక్క సారి సాధారణ వ్యక్తి సలహాలు మన జీవిత స్థితి గతులను మార్చవచ్చు.

13) జయించాలి అనుకునే వానికి తన శక్తి సామర్ధ్యాలే కాదు... ఎదుటి వారి శక్తియుక్తులపై సరైన అవగాహన ఉండాలి. వేటను వృత్తిగా తీసుకున్న వ్యక్తి అడవిలోని జంతువులను వేటాడే సమయంలో అన్ని జంతువులనూ ఒకే విధంగా వేటాడడు. ఒకే వలను పన్ని పులిని ఏనుగునూ వేటాడడు.

14) అలాగే తాను వేటాడే స్థలంలో ఏయే జంతువులు తిరుగుతాయో... వాటి అలవాట్లు ఏమిటో, ఎచ్చోట దాక్కుంటాయో, వాటిని వెలికి రప్పించేందుకు ఏ విధానాలు అవసరమో స్పష్టమైన అవగాహనతో ఉంటాడు. సమగ్రమైన వ్యూహంతో, అన్ని ఉపకరణాలతో వేటకు ఉపక్రమిస్తాడు. ఇక్కడ అధ్యయనం, వ్యూహం ప్రధానమైనవి.

15) ఈ క్రమంలో మన చుట్టూ ఉండే సమాజంలోని వ్యక్తుల నైజాన్ని, వ్యక్తిత్వాన్ని పరిశీలిస్తే..... వారిలో

అ) అహంకారం, గర్వం పాలు ఎక్కువగా కలిగిన వారు కనిపిస్తారు. వీరు ఎప్పటికైనా ప్రమాదకారులే. వీరి నుండి ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. భారతంలో దుర్యోధనుని పాత్ర అలాంటిదే. తనతో పాటుగా వంశాన్నే క్షయం చేసిన అహంకారం అతనిది. మరొక పాత్ర రామాయణంలో,, రావణునిది.

ఆ) ఆత్మ న్యూనతతో అహంకారాన్ని ప్రదర్శించే వ్యక్తులూ కనిపిస్తారు. తమకు ఉన్న దానికన్నా మిన్నగా శక్తిసామర్ధ్యాలను ఊహించుకుంటూ అరచేతిలో వైకుంఠాన్ని చూపే వ్యక్తులు కొందరు. వీరివల్ల కూడా ప్రమాదమే. భారతంలో కర్ణుడి పాత్ర అలాంటిదే. ఎన్ని యుద్ధాలలో తానోడిపోయినా తన అహంకారాన్ని ప్రదర్శిస్తూ... తాను సకుటుంబంగా నశించాడు... కౌరవ వంశ నాశనానికీ కారణమయ్యాడు.

(50 వ పేజీ చూడండి)

# బ్రహ్మఖండం



డా.పోచనపెద్ది వెంకట మురళీ కృష్ణ

వేదవ్యాస మహర్షి రచించిన అష్టాదశ పురాణాలలో స్కాంద పురాణం ఒకటి. ఎనభైఎనిమిది వేల ఒక వంద శ్లోకములతో కూడిన ఈ పురాణం పురాణాలలోకెల్లా అతి పెద్దది.

ఈ పురాణం మహేశ్వర, వైష్ణవ, బ్రహ్మ, కాశీ, అవంత్య, నగర మరియు ప్రభాస అనే ఏడు (7) ఖండాలుగా విభజింపబడింది. అందులో మూడవ భాగమైన 'బ్రహ్మ ఖండం' మూడు ఉపఖండాలుగా విభజింపబడింది.

ఇదివరలో మన చైతన్యం సంకల్పబలం పత్రికా పాఠకులకు 'కాశీ ఖండం' అందించిన ప్రముఖ రచయిత శ్రీ పోచనపెద్ది వేంకట మురళీకృష్ణ గారు ఇప్పుడు 'బ్రహ్మఖండం' సమర్పిస్తున్నారు.

పాఠకులు ఈ పురాణ పఠన సదవకాశాన్ని వినియోగించుకుని ఆ పరమేశ్వరుని కృపకు పాత్రులు కాగలరని ఆశిస్తున్నాము.

-ఎడిటర్

28.వ. అధ్యాయం

సాధ్యామృతం

కోటి తీర్థంలోను, జితేంద్రియ తీర్థంలోను స్నానం చేసాక " సాధ్యామృత తీర్థాన్ని" సేవించాలి. ఈ తీర్థాన్ని సేవిస్తే పాపాలు నశించి, కోరిన కోరికలు తీరుతాయి. బ్రహ్మచర్యం , యజ్ఞం దానం చేయడం వలన కలిగే ఫలితం ఇక్కడ స్నానం చేయడం వలన లభిస్తుంది. ఈ తీర్థంలోని నీటిని తాకిన వెంటనే పాపాలు అన్ని నశించిపోతాయి. ఇక్కడ అఘమర్షణ స్నానం చేస్తే విష్ణులోకం చేరుకుంటాడు. పూర్వజన్మలో చేసిన పాపాలు నశిస్తాయి. దేహబంధాలు విడిపోతాయి. నరకానికి వెళ్ళడు. ఇక్కడ స్నానం వలన లభించే పుణ్యం యజ్ఞ యాగాదులవలనకూడా లభించదు. " పూర్వం పురూరవుడు ఇక్కడ స్నానం చేసి తుంబురుడు శాపంనుండి విముక్తుడయ్యాడు. ఆ వృత్తాంతం చెబుతాను శ్రద్ధగా వినండి" అని సూతుడు ఈ విధంగా చెప్పాడు.

పూర్వం పురూరవుడు అను రాజు యజ్ఞాలు, దానాలు చేస్తూ ధర్మ బద్ధంగా రాజ్యాన్ని పాలిస్తున్నాడు.మిత్రావరుణుని శాపం వలన ఊర్వశి భూలోకంలో సంచరిస్తూ పురూరవుని ఉద్యాన వనంలో వీణ వాయిస్తూ , పాట పాడుతోంది. ఆ పాటను విని పురూరవుడు ఆకర్షితుడై , ఆమెను

వెదుకుచు అక్కడికి వచ్చాడు. ఊర్వశి సౌందర్యాన్ని చూసి మోహితుడై వివాహం చేసుకోమని అడిగాడు. " ఓ రాజా! నేను చెప్పిన షరతులకు నీవు అంగీకరిస్తే వివాహానికి అంగీకరిస్తాను.నా దగ్గర ఉన్న ఈ రెండు పొట్టేళ్ళకి ఎప్పుడు ప్రమాదం రాకుండా రక్షించాలి. నీవు నగ్నంగా నాకు కనబడ కూడదు. ఎంగిలి పెట్టకూడదు. నేను నేతిని మాత్రమే భుజిస్తాను. "అని ఊర్వశి పలికింది. ఊర్వశి నియమాలకి అంగీకరించి పురూరవుడు వివాహం చేసుకున్నాడు.




పురూరవుడు ఊర్వశితో కలిసి రాజమందిరానికి వచ్చి సుఖంగా ఉన్నాడు. ఊర్వశి స్వర్గాన్ని మర్చిపోయి ఇక్కడ ఆనందంగా ఉంది. విశ్వావసువు ఊర్వశిని తీసుకు రావడానికి భూలోకానికి వచ్చాడు. అర్ధరాత్రి ఊర్వశి గదిలో ప్రవేసించి అక్కడ ఉన్న పొట్టేలును తీసుకొని ఆకాశంలోకి ఎగిరిపోయాడు.దొంగ దొంగ , నా బిడ్డలను ఎత్తుకుపోతున్నారు అని ఊర్వశి గట్టిగా అరిచింది. ఆ అరుపులు విని పురూరవుడు విశ్వావసువును వెంటాడాడు.

మెరుపుల కాంతిలో పురూరవుని నగ్నంగా ఊర్వశి చూసింది. విశ్వావసువు పొట్టేలును అక్కడే వదిలి పారిపోయాడు. పురూరవుడు పొట్టేలును తీసుకొని ఊర్వశి భవనం దగ్గరకు వచ్చాడు. ఊర్వశి పురూరవుని నగ్నంగా చూసినందుకు అంతర్ధానమయింది. పురూరవుడు ఊర్వశి కనబడక పోవడంతో పిచ్చివాడివలె భూమండలం అంతా తిరిగాడు. కురుక్షేత్రంలో ఒక సరస్సులో చెలికత్తెలతో జలక్రీడలు ఆడుతూ పురూరవునికి కనబడింది. " మహారాజా! ఇటురా!నీకుమారులను తీసుకు వెళ్ళు" అని పిలిచింది. పురూరవునికి ఉర్వశి ఒక కుమారుని ఇచ్చింది. ఆరోజు రాత్రి ఉర్వశి పురూరవునితో గడిపింది. ఐదుగురు పుత్రులుగల గర్భాన్ని పొందింది. " రాజా! ఇప్పుడు నా గర్భంలో ఉన్న గంధర్వులు నీకు వరాన్ని ఇస్తారు. వారిని ప్రార్థించు" అని ఉర్వశి పలికింది. పురూరవుడు ప్రార్ధించగా ఆ గంధర్వులు అగ్ని స్థాలిని ఇచ్చి " రాజా! ఈ అగ్నిని మూడు భాగాలుగా చేసి యజ్ఞం చేసి ఉర్వశి లోకానికి చేరుకో " అని చెప్పి అంతర్ధానమయ్యారు. ఊర్వశి మాయమయింది. ఆ బాధలో పురూరవుడు అగ్ని స్థాలిని( యజ్ఞ అగ్ని ఉంచిన కుండ) అక్కడే వదిలి వెళ్ళాడు.

ఇంటికి వెళ్ళి ఆరాత్రి నిద్రకు ఉపక్రమిస్తూ "అగ్ని స్థాలిని అక్కడ వదిలేసాను. ఆ స్థాలిని తెచ్చుకొని యజ్ఞం చేస్తే ఉర్వశిలోకానికి వెళ్ళవచ్చుకదా! " అని ఆలోచించి, ఉదయాన్నే బయలుదేరి అరణ్యానికి వెళ్ళాడు. అక్కడ అగ్ని స్థాలి కనబడలేదు. అక్కడ ఒక రావిచెట్టు ఉంది. "ఈ రావిచెట్టు తీసుకు వెళ్ళి, అరణి చేసి(యజ్ఞములో అగ్ని చేయుటకు ఉపయోగించు రావి పుల్ల) దానితో అగ్నిని సృష్టించి యజ్ఞం చేస్తాను " అని ఆ రావి చెట్టు పెకలించుకొని వెళ్ళిపోయాడు.

గాయత్రిమంత్రంలో ఉన్న అక్షరాల ప్రకారం అన్ని అంగుళాల ఆరణి తయారు చేసి, దానితో అగ్నిని సృష్టించాడు. ఆ అగ్నితో అనేక యజ్ఞాలు చేసాడు. చివరికి గంధర్వ లోకం చేరి, ఉర్వశితో కలిసి సుఖంగా ఉన్నాడు.ఒకరోజున ఇంద్ర సభలో జరుగుచున్న నాట్య ప్రదర్శన చూడడానికి వెళ్ళాడు. అక్కడ ఉర్వశి నాట్యం చేస్తూ పురూరవుని చూసి, అనురాగంతో నవ్వింది.తుంబురుడు వారి ప్రవర్తనకు కోపగించి " మీకు ఈ క్షణంలో వియోగం కలుగుతుందని " శపించాడు. పురూరవుడు ఇంద్రుని సమీపించి " ఓ ఇంద్రా! ఉర్వశి సాలోక్య సిద్ధి కోసం నేను యజ్ఞంచేసి వచ్చాను. ఉర్వశి వియోగం భరించలేను: అని వేడుకొన్నాడు. " రాజా! విచారించక. నీకు ఒక ఉపాయం చెబుతాను విను. గంధమాదన పర్వతం మీద సాధ్యామృత తీర్థం ఉంది. అక్కడ స్నానం చేస్తే ఉర్వశి తిరిగి లభిస్తుంది. స్వర్గలోక నివాసం లభిస్తుంది" అని చెప్పాడు.

పురూరవుడు సాధ్యామృత తీర్థానికి వెళ్ళి, స్నానం చేసాడు. వెంటనే ఉర్వశితో కలిసి విమానం ఎక్కి స్వర్గానికి వెళ్ళాడు. ఈ తీర్థంలో స్నానం చేసిన వానికి కోరిన కోరికలు తీరుతాయి. పాపాలు నశిస్తాయి. మోక్షాన్ని పొందుతాడు. ఈ అధ్యాయం చదివిన వారు, విన్నవారు వైకుంఠానికి చేరుకుంటారు.

స్కాంద పురాణంలోని బ్రహ్మ ఖండంలోని, సేతు మహాత్మ్యంలో "సాధ్యామృత తీర్థ మహాత్మ్యం"అను ఇరవై ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

# కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరుడు

ముడుంబై వేంకటాచార్యులు

కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంక-టేశ్వరుడు --13వ భాగం



న్నా సంతానం లేని కారణంగా మానసికం గా ఒకనాడు దుఃఖిస్తూ ఉండగా వారి కుల పు-రోహితుడు వశిష్టులవారు రాగా వారికి నమస్కరించి వారితో నేను బ్రాహ్మణులకు పేదలకు అనేక దానధర్మాలు చేస్తూనే ఉన్నా, వయస్సు లో పెద్ద వారిని , బ్రా-హ్మణులను గౌరవించే విధంగా మాట్లాడటం తప్ప అగౌరవ పరిచే విధంగా ప్రవర్తించేవాణ్ణి కాదు. నాకు భగవంతుడు మంచి రాజ్యాన్ని, మంచి భార్య లను ఇచ్చాడు కాని నాకు తెలియని ఏదో పాపం చేసి ఉంటా అందు వల్లనే నాకు సంతానాన్ని పర-మాత్మ ఇవ్వలేదని బాధ పడుతుంటే ..... వశిష్టులవారు దశరధుని తో బాధ పడవద్దని చెబుతూ నీవు పుణ్యాచరిత్ర గల వాడవు.

ఈజన్మలో అన్నీ పుణ్యకార్యాలే చేశావు. నీకు ఈజన్మ-లో పాపము లభించే అవకాశ మే లేదు.అయినా సంతానం నీకు ఇంత వరకూ కలుగ లేదంటే ..... అంటూ. .. వశిష్టులవారు కాసేపు కాళ్ళు మూసుకుని ఆలోచించి మీ కు ఏవైనా దోషాలు ఉన్నా తొలిగి సంతానం కలుగుట-కు "శ్రీ వేంకటాచల క్షేత్రము" లో నున్న శ్రీ నివాసుని దర్శిచ-మని తెలియజేశాడు.దశరధు-డు ఆ క్షేత్రము ఎక్కడ ఉన్నదో తెలియజేయమని కోరగా ...... భాగీరథీ నదీ తీరమునకు రెండు వందల యోజనముల దూరంలో "వేంకటాచల మను పర్వతము" కాలేదు.ఆపర్వతమున. సువ-ర్ణముఖరీ నదీ తీరము నుండి క్రోశ మాత్ర దూరములో ఈక్షేత్ర మున్నది.

ఇందు మహిమగల అనేక పుణ్య తీర్థములు ఉన్నట్లు, శ్రీ మన్నా రావణునకు వైకుంఠం కన్నా ఆనందాన్నిచ్చే ముఖ్య నివాస స్థానంగా ఈక్షేత్రాన్ని పెద్ద లు తెలియ-జేశారు.అంతేకాదు ఈకొండపై శ్రీ నివాసుడు లక్ష్మీదేవి తో విహ-రిస్తూ ఉంటారని, అనేక మంది మునులు ఈప్రాంతంలోనే యజ్ఞాలు ,యాగములు నిర్వహి-స్తూ ఉంటారని, యోగులు దే-వతలతో సహితం ఈప్రాంతం-లో తపస్సు చేస్తూఉంటా రని వశిష్టులవారు తెలియజేశారు. దేవతలతో సహితం జనులం-దరికీ సకల అభీష్ట ములను నె-రవేర్చు గుణము గలవాడు శ్రీ నివాసుడు ఆయన కొండకు వెళ్ళి స్వామి ని ఆరాధిస్తే నీకు తప్పని-సరిగా సంతానం కలుగుతుం-ది.ఈవిషయం లో సందేహం లేదు అని రాజుకు వారి పురోహి-తులైన వశిష్టుడు వారు తెలి-యజేశారు.దశరధుడు మిక్కిలి సంతోషించి ప్రయాణానికి మంచి రోజు చూసుకుని శ్రీ వేంకటా-చల క్షేత్రానికి బయలు దేరారు. దారి లో గంగ, గోదావరి, కృ-ష్ణా,తుంగభద్ర,పాపనాశని వంటి పుణ్య నదులలో స్నానాదులా చరించుతూ" వేంకటాచలం " చేరి అక్కడ ఉన్న స్వామి పుష్క-రిణి వంటి పుణ్య తీర్థాలలో ఎంతో ఆనందం తో తమకు తెలిసీ, తెలియని పాపాలు నశించుటకు స్నానమాచరించారు.ఆకొండపై ఉండే విశేషాలు చూసుకుంటూ ముందడుగు వేస్తున్నారు.

(ఇంకా ఉంది)

# కదిరి నరసింహాలయం

(అతి పురాతమైన క్షేత్రం)



డా॥కె.రామానందం

తెలుగు రాష్ట్రములలో నరశింహస్వామికి చాలా ఆలయములు ఉన్నవి. అందులో స్థంభాద్రి, మట్టపల్లి, ధర్మపురి, యాదాద్రి దేవాలయాలు తెలంగాణాలో, అహోబిలం, సింహాచలం, కోరుకొండ, మంగళగిరి, వేదాద్రి, కదరి వంటి ప్రముఖ దేవాలయములు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములో అలరారుతున్నవి. అలాంటి ప్రముఖ క్షేత్రాలలో అనంతపురం జిల్లాలోని కదిరి క్షేత్రం పురాతనమైనది. ఈ ఆలయమునందు సంవత్సరం పొడుగునా అనేక నిత్య, వార, మాస, వార్షికోత్సవములు కడు వైభవముగా జరుపుతుంటారు. పాల్గుణమాసంలో జరిగే బ్రహ్మోత్సవములు కాక ధనుర్మాస పూజలు, రథసప్తమి, శ్రీకృష్ణ జయంతి, సంక్రాంతి, దసరా పర్వదినాలలో ప్రత్యేక అలంకరణాలు, పూజలు, విశేష ఉత్సవాలు నిర్వహిస్తారు. అశేష ప్రజానీకం ఉత్సాహంగా పాల్గొని స్వామివారి కృప పొందుతారు. కదిరిలో వెలసిన నారసింహునకు 'ఖాద్రి నరసింహస్వామి' అని పేరు. పూర్వం కదిరి ప్రాంతం దండకారణ్యమనియూ, ప్రస్తుత ఆలయ ప్రాంతాన్ని కిష్కింద అనే పేర్లతో వ్యవహరించేవారు. ఈ దండకారణ్యంలో అధిక సంఖ్యలో ఖదిర వృక్షాలు (అత్తిపత్తి చెట్లు) ఉండడం వల్ల ఈ ప్రాంతానికి 'ఖాద్రి' అని పేరు వచ్చింది. అదేవిధంగా 'ఖ' అంటే విష్ణు పాదమని 'ఆద్రి' అంటే కొండ అని అర్థం. విష్ణు భగవానుడు కృతయుగంలో తన పాదాన్ని ఇచ్చుటి పర్వతం పైన మోపినందున 'ఖాద్రి' అని పేరు వచ్చిందనియు, కాలక్రమేణా



అది కదిరిగా మారిందని ప్రతీతి. ఈ కదిరిలో ఉన్న కొండపై నరసింహస్వామి, సీతారాములు మరియు ఆంజనేయ స్వామి ఆలయములను తిలకించవచ్చును. ఆలయములు ఉన్న ప్రాంతాన్ని 'వేదారణ్య' అనే నామంతో పిలుస్తుంటారు. ఇందుకు ఒక కారణం ఉన్నది. శ్రీ వేద వ్యాస మహర్షి ఈ క్షేత్రాన్ని దర్శించిన కారణమున 'వేదారణ్యం' అనే పేరు వచ్చిందంటారు. కదిరి ఆలయం సమున్నత రాజగోపురాలలో పెద్ద ఆలయ ప్రాకారాలతో, ప్రకృతి శోభతో కనువిందు చేస్తుంది. ఇచ్చటి ఆలయమందలి తూర్పు గోపురం ప్రధాన రాజగోపురం. అప్పటి గోపుర ద్వారం దగ్గరలో వినాయకుని దర్శించి ప్రాంగణములోకి వెడితే హనుమంతుని ఉపాలయాన్ని తిలకించవచ్చును. ప్రధాన ఆలయానికి ఎదురుగా ధ్వజస్తంభం, బలిపీఠం, దీప స్థంభంకు నమస్కరించి, అంతరాలయంలోకి భక్తులు 'జై జై నరసింహ' అని నామాలు చెప్పుకుంటూ లక్ష్మీ నరసింహ స్వామిని అర్చించుటకులోనికి వెడతారు. గర్భగుడిలో శ్రీ నరసింహ స్వామి వారి ఎడమతొడపై లక్ష్మీదేవి ఆసీనురాలై ఉండగా, ఆయన ప్రసన్న వదనంతో భక్తులను అనుగ్రహిస్తుంటాడు. మూలవిరాట్టు చెంత భక్త ప్రహ్లాద విగ్రహాన్ని ఉంచారు. స్వామి మూడు అడుగులు ఎత్తుతో, అష్టభుజములతో, సింహవదనంతో కానవస్తాడు. స్వామివారు హిరణ్యకశిపుని తన తొడలపై పడుకోబెట్టుకుని ఒక చేత్తో శిరస్సును, మరొక చేత్తో పాదాలను పట్టి, మరో రెండు చేతులతో హిరణ్యకశిపుడి వక్షస్థలాన్ని చీల్చుతున్నట్లు అచ్చటి మూలవిరాట్టు కానవస్తాడు. తక్కిన చేతులలో శంఖ, చక్ర, గధ, ఖడ్గం ధరించి, తలపై మణిమయ కిరీటాన్ని, ఆభరణాలు ధరించి ఉంటాడు. ఆయన నోట్లో భయంకరమైన కోరపండ్లు ఉంటాయి. ఇక్కడి స్వామి వారి విగ్రహంలో ఒక విశేషమున్నది. ఈ మూలవిరాట్టుకు అభిషేకం గావించిన పిదప వారి శరీరం నుండి స్వేద జలం వస్తుంటుంది. భక్తులు ఈ విశేషాన్ని ఆసక్తితో తిలకించి తన్మయులౌతారు. ఎడమవైపున అంజలి ఘటిస్తూ నిలిచి ఉన్న భక్త ప్రహ్లాదుని విగ్రహం ఉంది. ఆలయంలోని శ్రీ లక్ష్మీదేవి ఉన్న గర్భగుడి ముఖ మండపానికి నైరుతి భాగంలో ఒక గుహ ఉండేది. ఈ గుహ ద్వారా ఖాద్రి



కొండ నుండి ఋషులు ఆలయానికి వచ్చి స్వామి వారిని అర్చించుకునే వారట. అమ్మవారి విగ్రహాన్ని గర్భ గుహలో ఉంచి, ఆ ప్రతిమను 'దుర్గాదేవి' అని పిలుస్తారు ఈ దేవీ ఆలయమందు సంతాన వేణుగోపాల స్వామి వెలసి ఉన్నారు. సంతానం లేని దంపతులు భక్తితో స్తంభం పైన ఉన్న స్వామిని సేవించి తమ కోరికలను విన్నవించుకుంటారు. స్వామివారు కరుణామయుడగుటచే తమకు సత్సంతానాన్ని ప్రసాదిస్తాడని ప్రగాఢ నమ్మకంతో వివిధ ప్రాంతముల నుండి భక్తులు తరలి వస్తారు. ఆ స్థంభం పై ఉన్న శిలలను మృదువుగా వేలితో మీటితే సప్త స్వరాలు వెలువడతాయి. ఆ కాలం శిల్పకళా వైభవానికి ఇది ఒక మచ్చుతునక. ఆలయంలో శిల్ప కళా వైభవం కడు కమనీయంగా ఉన్నది. ఇంకా ఈ కోవెలలో భాగవత కథలు అనగా శ్రీ గోపాలకృష్ణుని రాసలీలలు, విల్లు ధరించి నరకుని సంహరించుటకు సిద్ధమయిన సత్యభామ సుందర చిత్రం, హిరణ్యకశిప సంహార చిత్రములు భక్తులకు నయనానందకారము చేస్తాయి. జగన్నాథ స్వామి, ఆంజనేయ స్వామి మొదలగు

వారి విగ్రహాలను కూడా తిలకించవచ్చును. ఆలయ ఆగ్నేయ దిశలో చత్రపతి శివాజీ మహారాజు ప్రతిష్టిగావించిన మహిషాసురమర్ధిని అమ్మవారి విగ్రహాన్ని దర్శించుకోవచ్చును. ఈ ప్రాంతమందే శ్రీ రాఘవేంద్ర స్వామి మందిరాన్ని, ఆంజనేయ స్వామి మందిరాలను తిలకించవచ్చును. గర్భగుడి మరియు ఉపాలయాలలో ఆలయ అర్చకులు భక్తిశ్రద్ధలతో శాస్త్రయుక్తంగా పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదములు ఇస్తారు. ఆలయ శాసనములు అనుసరించి, ఈ ఆలయాన్ని అనేక రాజులు కవులు దర్శించి ఆలయ అభివృద్ధికి అధిక కృషి చేశారు. ఆలయ ప్రధాన తూర్పు గోపురాన్ని రెండవ హరిహరరాయులు, పడమటి గోపురాన్ని స్థానిక సాలెవారు, దక్షిణ గోపురాన్ని సానువుల చిన్నమ్మ నిర్మించినట్లు తెలుస్తున్నది. 1584 సంవత్సరంలో ఉత్తర రాజగోపురం నిర్మితమైనది. శ్రీకృష్ణదేవరాయల కాలంలో, రాజావారు ప్రాకారాలను, అనేక మండపాలను నిర్మింపజేసి ఆలయ వైభవాన్ని దశదిశల వ్యాపింపజేశారు. ఇక ఈ ఆలయ నిర్మాణం మూలవిరాట్ న శింహుని ఆదేశంపై విజయనగర రాజ్యస్థాపకుడయిన బుక్క రాయులకు, స్వామి కలలో కనిపించి ఖదిర వృక్షం క్రింద ఉన్న పెద్ద పుట్టలో విగ్రహం ఉందనీ, దానిని వెలికి తీసి ప్రతిష్టించమని ఆదేశించాడు. ఆదేశానుసారం బుక్కరాయలు విగ్రహాన్ని తీయించి ఆలయాన్ని నిర్మించినట్లు ప్రతీతి. ఆలయ రంగమండపంలో భాగవత ఘట్టాలతో కూడిన తైలవర్ల చిత్రాలను పాలె శ్రీనివాసులు 1829లో చిత్రించినట్లు తెలుస్తుంది. శ్రీ అన్నమాచార్యులు వారు కదిరి ఆలయాన్ని దర్శించి ఖాద్రి నరసింహుని దర్శించి స్వామిని భక్తితో కీర్తించినట్లు ఆలయ చరిత్ర చెబుతుంది. ఇక ఆలయ రంగమండపం నందు స్వామివారి మహా భక్తురాలైన శ్రీ సానువుల చిన్నమ్మ వారి స్త్రిమూర్తి అత్యంత ఆకర్షణీయంగా కానవస్తుంది. విష్ణు భక్తురాలైన చిన్నమ్మ అత్తవారింట్లో పలు హింసలకులోనై కుటుంబం నుంచి వెలివేయబడింది. అప్పుడు ఆమె ఖాద్రి నరసింహుని భక్తితో సేవించి విష్ణు సాయజ్యం చెందిన భాగ్యశీలి. ఆ భక్తురాలికి మద్దిలేటిలోనే దర్శనం ఒసంగి మోక్షం ఒసంగారు. స్వామి దయామయుడు. కారుణాంతరంగుడు. ఆయనను 'మద్దివేటి స్వామి' అని కూడా పిలుస్తారు. ఇంకా కొందరు భక్తులు ఆయనను 'కాటమ రాయస్వామి' 'కంచల రాయుడు' అనే నామములతో పిలుచుకుంటారు.

**ఉత్సవ విశేషాలు:** ఆలయ దసరా మండపంలో దసరా ఉత్సవాలు పది రోజులూ అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. అధిక సంఖ్యలో కుంకుమ పూజలలో మహిళలు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులౌవుతారు. ఫాల్గుణ శుద్ధ దశమి మొదలు 15 రోజులపాటు నరసింహ స్వామివారి బ్రహ్మోత్సవములు అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తూ ఆలయాన్ని, ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలతో స్వాగత ద్వారాలతో ముస్తాబు చేస్తారు. ఈ పక్షం రోజులు స్వామివారు వివిధ వాహనాలు అధిరోహించి పురవీధులలో ఊరేగుతూ తన కరుణాకటాక్ష వీక్షణాలను భక్తులందరిపై ప్రసరింపజేస్తారు. ఈ బ్రహ్మోత్సవ వేడుకలలో పాల్గొనుటకు రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి తమ భక్తి ప్రవత్తులు తెలుపుకుంటారు. తాపత్రయాలుతొలగించేదైవంగా, కరుణించే దైవంగా భక్తులు పరిగణించి తమ భక్తుని చాటుకుంటున్నారు. న సింహుడు ఆదిభౌతిక, ఆది దైవిక, ఆధ్యాత్మిక తొలగించి ముక్తినిచ్చే అవతారం. ఆనాటి నరసింహస్వామి ఈనాడు శ్రీ వెంకటేశ్వరస్వామిగా అవతరించాడు అంటారు. కదిరి క్షేత్ర దర్శనం జీవితకాలంలో మరిచిపోలేని ఓ మధురానుభూతి. ఒకసారి కదిరి నరసింహస్వామిని దర్శిస్తే చాలు. జీవితంలో అప్పటివరకు పడిన కష్టనష్టాలన్నీ క్షణమాత్రంలో మటుమాయమవుతాయన్నది నిజం.

**జై నారసింహ**

# కలిస్తే నిలుస్తాం-విడిపోతే పడిపోతాం

డాక్టర్ . చిలకమర్తి దుర్గాప్రసాదరావు



. Ten they came for me And there were no one left To speak out for me. కొంతకాలం తరువాత చివరకు ఒక రోజున వాళ్ళు నా కోసం వచ్చారు . ఇక నా కోసం మాట్లాడడానికి ఒక్కడు కూడ అక్కడ మిగలలేదు .

ఇక ఒకప్పుడు చవకబారు ఆలోచనలతో, స్వార్థ బుద్ధితో విదేశీయుల పాలనకు అవకాశం ఇచ్చి ఎన్నో ఇబ్బందులు పడ్డ మనకు మహాత్ముని నాయకత్వం వలన స్వాతంత్ర్యం లభిస్తే , పటేల్ మహాశయుని వలన ఏకత్వం సిద్ధించింది. దేన్ని సాధించాలన్నా ఏకత్వం అనివార్యం. అందుకే మహాత్మాగాంధి స్వాతంత్ర్యం కోసం అందరిని రాట్నం పుచ్చుకోమన్నారు. హిందువులను గీత , క్రైస్తవులను బైబిలు, మహమ్మదీయులను ఖురాను మిగిలిన మతాల వారిని వారి వారి పవిత్రగ్రంథాలను పట్టుకొమ్మని చెప్పలేదు . అలాగే చెప్పి ఉంటే మనం ఇంకా బానిసత్వంతో బాధపడుతూనే ఉండేవాళ్లం. ఒకవేళ మీరందరు కర్ర పట్టుకోండి, లేదా కత్తి పట్టుకోండి అని చెప్పి ఉంటే స్వతంత్రభారతం దాదాపు స్మశానం గానే మారి ఉండేది . ఇక అభిప్రాయ భేదాలు మనుషులకే ఉంటాయి . జంతువులకు ఉండవు ఎందుకంటే వాటికి ఒక అభిప్రాయమే ఉండదు కాబట్టి . మనలో అనేక సంప్రదాయాలు , విశ్వాసాలు, ఆచార వ్యవహారాలూ ఉన్నా అంతర్లీనంగా ఏకత్వం ఉంది. ఒకసారి సమాజాన్ని మానవ శరీరంతో పోల్చి చూద్దాం. మన శరీరంలో nervous system , respiratory system , digestive system , circulatory system , excretory system వంటి ఎన్నో ఎన్నెన్నో భిన్న భిన్నమైన సిస్టమ్స్ ఉన్నాయి . వాటి పనులు, వేరైనా లక్ష్యం శరీరాన్ని ఆరోగ్యవంతంగా ఉంచడమే . ఇంతే గాక మన శరీరంలో కోటానుకోట్ల రక్త కణాలు ఉన్నాయి . అవి వేటి పని అవి చేసుకుంటూనే పోతున్నాయి. అలాగే ఒక సంస్థలో ఎన్నోశాఖలుంటాయి, ఎంతో మంది వ్యక్తులు వివిధమైన బాధ్యతలు కలిగి ఉంటారు . అందరి లక్ష్యం సంస్థ అభివృద్ధి మాత్రమే . అలాగే మనలో ఎన్నెన్ని భేద భావాలున్నా మన దృష్టిమాత్రం, దేశహితం, సౌభాగ్యం, సార్వభౌమత్వం మీదే ఉండాలి. అంతేగాని “ ఎవడి కొంప తీతునా” అనే ఆధునిక అష్టాక్షరీ మంత్రాన్ని ; “మాకారోగ్యం , మాకైశ్వర్యం; మాకు ధనం, మీకు ఋణం” అనే ఆధునిక ద్వాదశాక్షరీ మంత్రాన్ని జపం చేస్తూ కూర్చోకూడదు . ఏది ఏమైనా నేను చెప్పే ఈ రెండు, మూడు మాటలు నిత్యసత్యాలు. ఇవి అందరికీ తెలిసినవే. కొత్తవి కావు. ఒకటి, మనం వచ్చినప్పుడు ఏమీ తేలేదు, పోయేటప్పుడు మంచి, చెడు, ఈ రెండు తప్ప మరేమీ మన వెంట రావు. ఇకరెండోది, మనకంటే గొప్పవాడు ఎవడు లేడు, అలాగే మనకంటే తక్కువ వాడు కూడ ఎవడు లేడు. ఇక ముఖ్యమైన మూడో విషయం. మనకు ప్రపంచంలో భారతీయుడుగానే గుర్తింపు ఉంది . మరో విధంగా గుర్తింపు లేదు. . ఐక్యరాజ్యసమితిలో మన చిరునామా India, also known as Bharat అనే ఉంటుంది. మరో విధంగా ఉండదు అని ఎవరో చెపితే విన్నాను. భారతీయ సమగ్రతకు సమైక్యానికి మనం కృషి చేద్దాం, బంగారు బాటలు వేద్దాం . ‘ జననీ, జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసీ ’ అనే మహానినాదాన్ని మారు దశదిశలు మ్రోగేలా చేద్దాం . నమస్కారం.

# సమయం విలువ

సి. లక్ష్మికుమారి



ఆలా కాకుండ సినిమాల్లో నటించే కొంతమంది నాయికానాయకుల పేర్లు చెప్పి వారు నటించిన మొదటి చిత్రం చెప్పమని కోరుతూ ఆకర్షణీయమైన బహుమతులు ఎర చూపిస్తే అది యువత అమూల్యమైన కాలాన్ని హరించడమే అవుతుంది. కాబట్టి నేటి యువత వివేకంతో దేనికెంత సమయాన్ని కేటాయించాలో తెలుసుకుని తగిన విధంగా ప్రవర్తిస్తే ప్రగతి సాధించగలం. ఐదు. విద్యార్థులు పాఠ్యాంశాలను క్రమబద్ధంగా చదవడం వల్ల కూడ సమయాన్ని ఆదా చేసుకోవచ్చు. పరీక్షలొచ్చే వరకు పుస్తకాలు తీయకుండ అవి దగ్గరకొచ్చాక విశ్రాంతి లేకుండ చదివి చదివి పరీక్షల్లో కళ్లు తిరిగి పడి పోయి భవిష్యత్తు నాశనం చేసుకున్న వాళ్లెంతమందో ఉన్నారు. అందువల్ల విద్యార్థులు ముందునుంచే సమయం విలువ గుర్తించాలి. ఆరు. మనలో కొంతమంది ఇతరులతో మాట్లాడేటప్పుడు ఎంతసేపు మాట్లాడాలో గమనించరు. ఎదుటివారి ఇబ్బందులు అసలు పట్టించుకోరు. ఒకాయన మరొక వ్యక్తిని సుమారు రెండు గంటల సేపు వాయించాక 'అయ్యా! మీతో మాట్లాడేక నాకు తల నొప్పి పోయిందండి ' అన్నాడు . రెండో ఆయన దానికి సమాధానంగ 'అయ్యా! అదెక్కడికీ పోలేదు. నాకు చుట్టుకుంది ' అన్నాడు. పరేంగితావగాహి జ్ఞానమే పాండిత్యం అన్నారు పెద్దలు. కాబట్టి ఇతరుల మనోభిప్రాయం తెలుసుకు తదనుగుణంగా నడుచుకోవడమే పాండిత్యం గాని కేవలం శాస్త్రాలు బట్టీపట్టడం కాదు. ఇక ఏడో అంశం. ధ్యానం , యోగాభ్యాసం ఏకాగ్రతను పెంచుతాయి కాబట్టి వాటిద్వారా తక్కువ సమయంలోనే ఎక్కువ జ్ఞానాన్ని , ఎక్కువ పనులు సాధించే సామర్థ్యాన్ని పొందవచ్చు. ఎనిమిది. రేపు చెయ్యవలసిన పని ఈ రోజు , నేడు చెయ్యవలసిన పని ఇప్పుడు చెయ్యమని పెద్దలు చెబుతున్నారు. అలా చేస్తే సమయం ఆదా అవుతుంది. అలాగే మనం చేసుకోగల చిన్న చిన్న పనులకు గూడ ఇతరులపై ఆధారపడి వాళ్ల కోసం ఎదురుచూడడం మంచిది కాదు. అలాగే ఏ పనైన , మొదలు పెట్టి చేస్తోంటే పూర్తవుతుంది గాని ఆ లోచిస్తూ కూర్చుంటే ఎప్పటికీ పూర్తి కాదు. నడక ప్రారంభిస్తే చీమకూడ కొంతకాలానికి చేరవలసిన గమ్యం చేరుకుంటుంది. నడవకపోతే వేగంగా వెళ్లే గరుత్మంతుడు కూడ ఒక్కడుగు ముందుకెయ్యలేడు. అందువల్ల ఆలోచన కన్నా ఆచరణ మిన్న. సమయం విలువ బాగా తెలిసింది కాబట్టే మన భారతీయ సంస్కృతి శుభకార్యాలకు ఒక ముహూర్తాన్ని నిర్ణయించి కాల యాపనకు తావు లేకుండ చేసింది. ఇంత వరకు సమయం విలువ , ఆ సమయాన్ని పొదుపు చేసే విధానం గురించి కొంచెం తెలుసుకున్నాం. ఇంత కంటే ఎక్కువ చెప్పడం మీ కాలాన్ని హరించడమే అవుతుంది. సమయాన్ని సద్వినియోగం చేసుకుందాం . సమాజ ప్రగతికి బాటలు వేద్దాం. సమయం విలువ తెలియ జేసే ఒకచక్కనికవితతో నా వ్యాసం ముగిస్తాను. ఈ గొప్ప రచయిత పేరు మీకు తెలియజెయ్యలేక పోయినందుకు చాల చింతిస్తున్నాను.

ఒక సంవత్సరం ఎంత విలువైనదో పరీక్షలో తప్పిన విద్యార్థి నడుగు
ఒక రోజు ఎంత విలువైనదో ఒకటో తేదీనజీతంరానివాణ్ణడుగు
ఒక గంట ఎంత విలువైనదో క్షణమొక యుగంగా గడిపిన ప్రేమికుడినడుగు
ఒక నిముషం ఎంత విలువైనదో రైలు మిస్సయిన ప్రయాణికుడినడుగు
ఒక సెకను ఎంత విలువైనదో యాక్సిడెంట్లో ప్రాణాలు దక్కిన వాణ్ణడుగు.

# గజేంద్ర మోక్షము

ఆచార్య డా. శనగవరపు కృష్ణ మూర్తి శాస్త్రి



వ. నీవు ఈ గజేంద్ర మోక్ష మహత్త్వము గూర్చి గజేంద్రుని తో నెట్లు నుడివితివి . “ప్రతి రోజు బ్రహ్మీ ముహూర్తము-లో మేల్కొని నిర్మల, నిశ్చల మనస్కులై నన్ను, నిన్ను, ఈ సరోవరమును , ఈ పర్వత గుహలను, వనములను, వేము, వెదుళ్ల పొద లను, దివ్య వృక్షములను, ఈ గిరి శిఖరములను, నాయొక్క శివబ్రహ్మల యొక్క నివాస స్థానములను, నా ప్రియ ధామ మైన క్షీర సాగరమును, తేజోమయ మైన శ్వేత ద్వీపమును, శ్రీ వత్స చిహ్నమును, కౌస్తుభ మణిని, వనమాలను, నా కౌమోదిక గదను సుదర్శన చక్రమును, పాంచజన్య శంఖమును, పక్షి రాజైన వైన తేయుని, నా సూక్ష్మయంశ యైన ఆదిశేషుని, నిత్యము నన్నాశ్రయించి యుండు లక్ష్మీ దేవిని, బ్రహ్మ దేవుని, నారద మహర్షిని, పరమశివుని, ప్రహ్లాదుని, మత్స్య, కూర్మ,వరాహాది అవతార లీలలను, రవిని, శశిని, అగ్నిని, ఓంకారమును, సత్యవచనములను, మూల ప్రకృతిని, గోవులను, బ్రాహ్మణులను, సనాతనమైన ధర్మములను, సోమునకు, కశ్యపునకు, దక్షుని, దక్ష పుత్రికలును,  అలకనందను, గంగా,యమునా,సరస్వతీ నదులను, ఐరా-వతమును, ధ్రువుని, సప్తర్షులను, నలుడు, యుధిష్టిరుడు,జనకుడు మొదలగు మహా పురుషులను భక్తి శ్రద్ధ-లతో స్మరించు వారు సకల పాపముల నుండి విముక్తు లగుదురు. ఎటులన ఈ పేర్కొన్న రూపము లన్నియు,నా రూపములై యున్నవి. మరణ సమయమున నిర్మల బుద్ధి ప్రసాదించెదను ” అని ఫలశ్రుతిని చెప్పి యుంటివి కృష్ణ మూర్తి .

హరి ఓం తత్సత్   స్వస్తి

---

## నాయకుని మాట తీరే ఆతని జయాపజయాలను నిర్ణయిస్తుంది

(41 వ పేజీ తరువాయి)

ఇ) కొందరిలో అభద్రతా భావన ఎక్కువగా కనిపిస్తుంది. ఎవరు తనమీద దాడిచేస్తారేమోననే భావనలో నిరంతరం మ్రగ్గుతూ... ప్రతిదాన్నీ అనుమానిస్తూ జీవిస్తూ ఉంటారు. అభద్రతా భావనలో బ్రతికే వీరు ఇతరులకు ప్రమాదకారులే. వీరికి కుత్సితత్వం తోడైతే చెప్పేదేముంది. భారతంలో ధృతరాష్ట్రుని పాత్రను దీనికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు.
ఈ) సమయ సందర్భాలను చూచుకొని ప్రతీకారం తీర్చుకునే వ్యక్తులూ ఉంటారు. అవసరానుగుణంగా మనతో బాగానే ఉంటారు.. కాని అవకాశం వచ్చిన సమయంలో తమ ప్రతాపాన్ని చూపుతారు. ఇలాంటి వ్యక్తులు చాలా ప్రమాదకారులు. శకుని పాత్రను దీనికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు (ప్రాచుర్యంలో ఉన్న గాథను బట్టి) ఉదంకుని ప్రోద్బలంతో జరిగిన సర్పయాగం...
ఊ) కొందరు అమాయకంగా కనిపిస్తారు. ఇతను గర్వంలేని వాడు, సామాన్యమైన వాడు, తెలివి తేటలు లేని వాడని మనం భావిస్తాము. కాని అతనిలోని ప్రతీకార వాంఛ అవసరమైన సమయంలో మనకు ఉచ్చు భిగిస్తుంది. సామాన్యునిగా భావించిన సైంధవుడు పాండవులను అడ్డిన ఉదంతం ఇలాంటిదే.

కాబట్టి ఎలాంటి వారిని దగ్గరకు తీయాలి, ఎలాంటివారిని ఎంత దూరంలో ఉంచాలి అనే అవగాహన ఉన్న నాయకుడు విజయ సాధకుడౌతాడు.


మరణానంతర
పద్మ విభూషణ్
ధర్మేంద్ర


మరణానంతర పద్మశ్రీ గరిమెళ్ళ బాలకృష్ణప్రసాద్

RNI No. TELTEL/2011/39497 FEBRUARY 2026 POSTAL NO. HSE/1043/2017-19
Date of Publication:1st February Date of Posting:8th February



యూరోపియన్ ప్రెసిడెంట్ తో మన ప్రధాని

Published, Edited and Printed by T Shanti at Flat No. 504, Tower A06, Rajiv Sahabhavana Nagole-Bandlaguda, Hyderabad-500068. Phone 9490571297 email: teega51@gmail.com , www.chaitanyam.net, Printed at Planographers, 5-8-300, Chirag Ali Lane, Abids, Hyderabad-500001.